fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 23 | విజయవాడ, బుధవారం 24 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00



రెడ్ కార్పెట్ పరిచాం.. రండి!

దావోస్ సదస్సులో మోడీ పిలుపు

ఉగ్రవాదానికి మంచి, చెడు లేదు

ప్రజాస్వామ్యమే భారత్‌కు బలం

దావోస్ : భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని బహుళ జాతి కంపెనీల సిఇఓలకు, బడా వాణిజ్య వేత్తలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) సదస్సు ప్రారంభం సందర్భంగా ఆయన కీలక ప్రసంగం చేశారు. దావోస్‌లోని స్విస్ మౌంటైన్ రిసార్ట్‌లో జరిగిన ఈ సదస్సులో భారత ఆర్థిక ప్రగతి తీరుతెన్నులను మోడీ వివరించారు. భారత్‌లో వ్యాపారం చేయడం ఇప్పుడు చాలా సులువని, లైసెన్స్ రాజ్‌కు మిగతా 8లో



దావోస్‌లో సౌదీ ఆర్మ్ కో ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీతో సిఎం చంద్రబాబు భేటీ

కృష్ణపట్నంలో ఆయిల్ రిఫైనరీ లాభదాయకం

పెట్టుబడి పెట్టేందుకు సౌదీ ఆర్మ్ కో ఆసక్తి

రెండోరోజు దావోస్ పర్యటనలో పలు సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కృష్ణపట్నాన్ని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రిఫైనరీ ఏర్పాటుకు వాణిజ్య పరంగా లాభసాటి అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు సౌదీ ఆర్మ్ కో ప్రతినిధులకు స్పష్టం చేశారు. దావోస్ పర్యటనలో భాగంగా మంగళవారం ఆ సంస్థ ప్రెసిడెంట్ సైద్ అల్ హద్రమీతో ఆయన భేటీ అయ్యారు. కృష్ణా-గోదావరి బేసిన్ (కెజి బేసిన్)లో అపార చమురు నిక్షేపాలున్నాయని, పెట్రోలియం శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమని ఈ సందర్భంగా మిగతా 9లో

జస్టిస్ దీపక్ మిశ్రాకు అభిశంసన

అవకాశాలపై చర్చిస్తున్నామన్న ఏచూరి



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై అభిశంసన తీర్మానాన్ని పెట్టేందుకు వీలున్న అవకాశాలపై ఇతర ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి మంగళవారం తెలిపారు. న్యూఢిల్లీలో సిపిఎం కేంద్ర కార్యాలయంలో ఎఎన్ఐ వార్తా సంస్థ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో నెలకొన్న సంక్షోభం ఇంకా పరిష్కారం కాలేదన్నారు. ఒక మధ్య వర్తిత్వం అవసరమనే పరిస్థితి న్యాయవ్యవస్థలో కనిపిస్తోందని, కార్యనిర్వాహక వ్యవస్థ తన పాత్రను నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందని ఏచూరి అభిప్రాయపడ్డారు. ప్రధానన్యాయమూర్తిపై వచ్చే బడ్జెట్ సమావేశాల్లో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశాలపై ఇతర ప్రతిపక్ష పార్టీలతో తాము చర్చిస్తున్నామని ఆయన తెలిపారు. కొలీజియం, కేసులను ధర్మాసనాలకు కేటాయించడంలో ప్రధాన్యాయమూర్తి వ్యవహారశైలిపై ఆరోపణలు గుప్పిస్తూ ఇటీవల నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అసాధారణరీతిలో మీడియా సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే డిమాండ్ చేశాయి.

పునరావాసం ప్రశ్నార్థకమే



కానరాని ప్రత్యామ్నాయం

పోలవరంలోనే 1.01 లక్షల నివాసాలు

గుండ్లకమ్మ, వెలిగోండలోనూ 8000 కుటుంబాలు

ప్రభుత్వం చెబుతున్నదొకటి... చేస్తున్నదొకటి

ప్రాజెక్టులు పూర్తయితే ఇళ్లన్నీ నీటమునకే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పునరావాసం ప్రశ్నార్థకంగా మారింది. వివిధ జిల్లాల్లో చేపడుతున్న ప్రాజెక్టు పరిధిలో మునిగిపోయే, నష్టపోయే కుటుంబాలకు పునరావాసం కల్పించే విషయంలో ప్రభుత్వం కనీస బాధ్యతగా వ్యవహరించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రాజెక్టుల్లో ఇప్పటికీ పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించలేదు. ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని చెబుతున్న ప్రభుత్వం పునరావాసంపై దృష్టి సారించడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పరిధిలో 507 నివాస ప్రాంతాల్లో 1,18,322 కుటుంబాల్ని తరలించాల్సి ఉందని జలవనరులశాఖ అధికారులు నివేదిక సమర్పించారు. వీటిల్లో ఒక్క పోలవరంలోనే 1.01 లక్షల కుటుంబాల్ని తరలించాల్సి ఉంది. అదే సమయంలో ప్రాజెక్టు పనులు 77 శాతం పూర్తి చేశామని నివేదికలో పొందుపరిచారు. మరో 23 శాతం పనులు మిగతా 2లో

మధు అక్రమ అరెస్ట్

కొనసాగుతున్న నిర్బంధం

వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకుల ముందస్తు అరెస్టులు

'చలో గొట్టిపాడు'ను వాయిదా వేసుకోవాలన్న ఎస్పి

నిర్వహించి తీరుతామని మధు స్పష్టీకరణ



తాడేపల్లి పోలీస్‌స్టేషన్ నుండి మధును పోలీసు వాహనంలో గుంటూరు తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో వామ పక్షాలు, ప్రజాసంఘాల నాయకులపై తీవ్ర నిర్బంధం కొనసాగుతోంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు సహా పలువురు నాయకులను మంగళవారం అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో దళితులపై ఈనెల ఒకటో తేదీన జరిగిన దాడి ఘటన నేపథ్యంలో వారిని పరామర్శించి సంఘీభావం తెలిపేందుకు బుధవారం వామపక్షాలు, పలు ప్రజా సంఘాలు 'చలోగొట్టిపాడు' పిలుపు ఇచ్చారు. దీంతో మంగళవారం కూడా మిగతా 9లో



రాష్ట్రవ్యాప్తంగా కదంతొక్కిన స్కీం వర్కర్లు

వెట్టి చాకిరికి స్వస్తి పలకండి

విజయవాడలో భారీ ధర్నా

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి

పిఎఫ్, గ్రాట్యుటీకి డిమాండ్

పలుచోట్ల అరెస్టులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/యంత్రాంగం

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పిఎఫ్, గ్రాట్యుటీ తదితర డిమాండ్లతో స్కీం వర్కర్ల సమ్మె పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా కదం తొక్కారు. విజయవాడలో ధర్నాచౌక్ వద్ద ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టారు. దశాబ్దాల నుంచి మిగతా 9లో



బిజెపితో శివసేన 'కటీఫ్'

ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తాం : ఉద్ధవ్ థాకరే

ముంబయి : మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలతోపాటు వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలలోనూ ఒంటరిగా పోటీ చేయనున్నట్లు శివసేన మంగళవారం ప్రకటించింది. దీంతో బిజెపితో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న పొత్తుకు శివసేన తెరదించినట్లయ్యింది. ముంబయిలోని వర్లి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు శివసేన నిర్ణయం తీసుకుంది. బిజెపితో తెగతెంపులు చేసుకోవాలన్న నిర్ణయంతోపాటు రాష్ట్రంలోని రైతులకు రుణాలు పూర్తిగా రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ హిందూత్వ ఎజెండాతోనే అన్ని రాష్ట్రాల లోనూ తమ పార్టీ బరిలోకి దిగుతుందని అన్నారు.

25 మోడల్ పోలీస్ స్టేషన్లు

ప్రతి పోలీస్ స్టేషన్‌పైనా డార్మిటరీ

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 25 మోడల్ పోలీస్ స్టేషన్ భవనాల్ని నిర్మిస్తున్నట్లు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా వెల్లడించారు. పోలీస్ శాఖకు చెందిన సముదాయాల నిర్మాణాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా ఉందన్నారు. విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం పోలీస్ హౌసింగ్‌పై సమావేశం జరిగింది. డిజిపి మాలకొండయ్యతో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో కీలక విషయాలపై చర్చించారు. సమావేశం అనంతరం నాగుల్‌మీరా మీడియాతో మాట్లాడుతూ రూ.22 కోట్లతో అమరావతిలో ప్రపంచస్థాయి ఫోరెన్సిక్ ల్యాబ్‌ను నిర్మిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రాల్లో పోలీస్ సిబ్బందికి క్వార్టర్లను నిర్మించాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. వీటితో పాటు ప్రతి పోలీస్ స్టేషన్‌పైనా సిబ్బందికి ఉపయుక్తంగా ఉండే విధంగా ఒక డార్మిటరీని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. రాష్ట్రంలోని 44 వేల పోలీస్ క్వార్టర్లు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల శిధిలావస్థలో ఉన్నాయని, వాటిలో 10 వేలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. పోలీస్ శాఖతో పాటు జైళ్ల శాఖకు సంబంధించిన అన్ని మరమ్మతులనూ హౌసింగ్ కార్పొరేషన్ చేపడుతుందన్నారు. ఏలూరు, నూజివీడు, అనంతపురాల్లో నిర్మించిన 70 క్వార్టర్లు పూర్తయ్యాయని, వీటిని సిఎం చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు. సిఎంతో చర్చించి పోలీస్ శాఖకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్ని చేపడతామన్నారు. సమావేశంలో హోం శాఖ ముఖ్యకార్యదర్శి అనురాధ, ఫైర్ డిజి సత్యనారాయణతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.


కోడిపందేలను కోర్టుకు నివేదిస్తాం : డిజిపి

కోడి పందేల నిర్వహణపై పూర్తిస్థాయి నివేదికను ఈ నెల 29న కోర్టుకు అందజేస్తామని డిజిపి మాలకొండయ్య తెలిపారు. మంగళవారం జరిగిన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూదాలు, కోడి పందేలపై పోలీస్ శాఖ తీసుకున్న చర్యల్ని కోర్టుకు వివరిస్తామన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయేషా మీరా హత్య కేసును సిట్ పునర్విచారణ చేపట్టిందని చెప్పారు. విభజనానంతరం రాష్ట్ర పోలీస్ శాఖ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైనా సమావేశంలో చర్చించామన్నారు. పోలీస్ శాఖలోని ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రూ.17 కోట్లతో పోలీస్ క్వార్టర్ల మరమ్మతు పనుల్ని చేపట్టామన్నారు.

మే 6న నీట్ పరీక్ష

న్యూఢిల్లీ : ఈ ఏడాది నీట్ పరీక్షను మే 6వ తేదీన సిబిఎస్ఇ నిర్వహించనుంది. ఎయిమ్స్, జిప్‌మర్ మినహా దేశంలోని అన్ని వైద్య, దంత కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఈ పరీక్షను గతేడాది మే 7వ తేదీన నిర్వహించారు. నీట్ పరీక్ష తేదీతో ఇతర పరీక్షల తేదీలు కలవకుండా వుండేందుకు గానూ సిబిఎస్ఇ జాయింట్ కార్యదర్శి సన్యామ్ భరద్వాజ్ అన్ని ఎగ్జామ్ బోర్డులకు ఈ విషయాన్ని తెలియచేశారు. ఈ నెల 30న నోటిఫికేషన్ జారీ అవుతుంది. అందులో మరిన్ని వివరాలు తెలుస్తాయి. నీట్-2018 సిలబస్‌లో ఎలాంటి మార్పు లేదని గత వారమే సిబిఎస్ఇ స్పష్టం చేసింది. నీట్ వెబ్‌సైట్‌లో సిలబస్ వివరాలుంటాయని, విద్యార్థులు తెలుసుకోవచ్చని తెలిపింది.

నారాయణ, శ్రీచైతన్యలకు హైకోర్టు నోటీసులు



ప్రజాశక్తి - హైదరాబాద్

విద్యార్థుల ఆత్మహత్యలపై నారాయణ, శ్రీ చైతన్య కళాశాలలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ రెండు కళాశాలలతో పాటు ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, విద్య, హెూం శాఖల ప్రధాన కార్యదర్శులు, ఇంటర్ బోర్డు కార్యదర్శులు, స్విమ్స్, నిమ్స్ డైరెక్టర్లకు హైకోర్టు నోటీసులు జారీ చేసి వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ప్రైవేటు విద్యా సంస్థల్లో, ఐఐటీల్లో విద్యార్థులు తీవ్ర ఒత్తిళ్ల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇందుకు కారణమైన కార్పొరేట్ కాలేజీలపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరుతూ లోక్‌సత్తా ఉద్యమ సొసైటీ ప్రకాశం జిల్లా కన్వీనర్ దాసరి ఇమ్మాన్యుయేల్ మిగతా 9లో

ఉద్యోగాల కల్పన, రైతులకు ఆర్థిక లబ్ధే లక్ష్యం : సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగాల కల్పనతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర చెల్లించి, రైతులకు ఆర్థిక లబ్ధి చేకూర్చడమే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ స్పష్టం చేశారు. సచివాలయంలో తన కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాధికారిక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వప్రయోజనాల కోసం ప్రభుత్వ రాయితీలు దుర్వినియోగం చేసే కంపెనీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా 22 యూనిట్లకు అనుమతులు మంజూరు చేశారు.

చర్చాగోష్ఠి



విజయవాడలో 'సుప్రీంకోర్టు పరిణామాలు - న్యాయపాలన' అనే అంశంపై ఐలు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ కె.జి. శంకర్

న్యాయ వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు

హైకోర్టు మాజీ న్యాయమూర్తి శంకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

న్యాయ వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాల్ని సరిచేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కెజి శంకర్ అన్నారు. ఇటీవల పరిణామాలు న్యాయవ్యవస్థలోపాల్ని ఎత్తిచూపేలా ఉన్నాయన్నారు. 'సుప్రీంకోర్టు పరిణామాలు-న్యాయపాలన' అనే అంశంపై విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబివికె)లో మంగళవారం చర్చాగోష్ఠి జరిగింది. ఎంబివికె, ది బెజవాడ బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విశ్రాంత న్యాయమూర్తి డి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మీడియా ముందుకొచ్చి న్యాయవ్యవస్థలో లోపాల్ని ఎత్తిచూపారన్నారు. జస్టిస్ కర్ణన్ కేసుకు, ప్రస్తుత నలుగురు న్యాయమూర్తులు ప్రధాన న్యాయమూర్తిపై చేసిన అభియోగాలకు సంబంధం లేదన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల్ని ధిక్కరించినందువల్లే కర్ణన్‌కు జైలుశిక్ష విధించారని, అభియోగాలు మోపినందుకు కాదని స్పష్టం చేశారు. మీడియా ముందుకొచ్చిన నలుగురు న్యాయమూర్తులు కోర్టు ఉత్తర్వుల్ని ధిక్కరించలేదన్నారు. ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. న్యాయవ్యవస్థలో జరుగుతున్న పరిణామాల్ని ప్రజల ముందు ఉంచడాన్ని స్వాగతించాలన్నారు. సుప్రీంకోర్టును కూడా ఆర్‌టిఐ పరిధిలోకి తీసుకురావాలన్నారు. న్యాయకళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ బాబు మాట్లాడుతూ న్యాయవ్యవస్థను బిజెపి కాషాయికారణ చేస్తోందని విమర్శించారు. ఈ వ్యవస్థ ఎప్పుడూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్,ఎంబివికె కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తమిళనాడు తీరంలో ఆవర్తనం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నైరుతి బంగాళాఖాతంలోని ఉత్తర తమిళనాడు తీరంలో 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ మంగళవారం పేర్కొంది. మరోవైపు ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణిస్థిరంగా కొనసాగుతోందని తెలిపింది. వీటి ప్రభావంతో రాష్ట్రంపైకి తూర్పు, ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. కోస్తా, సీమల్లో నాలుగు రోజుల పాటు పగలు ఎండలు, రాత్రి పూట చలి తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంది.



ఏడాది ఆగండి : జగన్

- నెల్లూరు జిల్లా సరిహద్దుల్లో ఘన స్వాగతం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

'మీ మనవడు.. మీ కొడుకుగా చెబుతున్నా ఏడాది ఆగండి వచ్చేస్తా.. అన్నీ ఇచ్చేస్తా.. మీ కష్టాలు తీరుస్తా.. ఈ చంద్రబాబు పాలన ఏం బాగాలేదు.. మన ప్రభుత్వం వస్తుంది' అంటూ జగన్ ప్రజా సంకల్పయాత్ర మంగళ వారం నెల్లూరు జిల్లాలో ప్రారంభమైంది. ఉదయం 10 గంటలకు పాదయాత్ర చిత్తూరు జిల్లా నుంచి పెళ్లకూరు మండలం పునబాక వద్ద జిల్లాలో ప్రవేశించింది. ఆపార్టీ నేతలు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున జగన్‌కు స్వాగతం పలికారు. చెంబేడు వద్ద యాత్ర ముగిసింది. దారిపొడవునా ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. టిడిపి జెడ్‌పి ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి కుమారుడు సూళ్లూరుపేట మున్సిపల్ కౌన్సిలర్, టిడిపి నేత వేనాటి సుమంత్‌రెడ్డి జగన్‌ను కలిశారు. పెళ్లకూరు మండలం పునబాక వద్ద నెల్లూరు ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆపార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఇతర ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ప్రజా ప్రతి నిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలొచ్చి స్వాగతం పలికారు. 108 ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లు, కాంట్రాక్ట్ వర్కర్లు కలిసి వినతి పత్రం సమర్పించారు.

రెండుసార్లు దాడి చేసి గాయపరిచారు

- గొట్టిపాడును సందర్శించిన న్యాయవాదుల బృందంతో దళితుల ఆవేదన



గొట్టిపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో డిసెంబరు 31, జనవరి 1న పెత్తందారులు తమపై దాడులు జరిపి గాయపరిచారని పలువురు దళితులు ఘటనపై మంగళవారం విచారణకొచ్చిన ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఎపి పౌరహక్కుల అసోసియేషన్ బృందంతో వాపోయారు. పెదగొట్టిపాడును సందర్శించేందుకు ఎనిమిది మంది వెళ్లగా అందులో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, షేక్ సయ్యద్ బాబులతోపాటు ఎపి పౌరహక్కుల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శేషగిరిరావు, న్యాయవాది చందోలు శశికుమార్, లా విద్యార్థి కిరణ్ మాత్రమే పోలీసులు అనుమతించారు. దళితవాడకు చెందిన జి.సలోమి, జె.జాన్, జె.జయభాగ్యమ్మ, రూబెన్‌లను విచారించారు. అనంతరం శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ.. డిసెంబర్ 31న పెత్తందారులు తమపై దాడి చేయడమేగాక.. రాజీ అని చెప్పి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు ట్రాక్టర్లో రాళ్లు వేసుకుని, కర్రలతో వందమందికి పైగా వచ్చి తమపై దాడికి పాల్పడ్డారని తెలిపారన్నారు. ఈ దాడిలో అయిదుగురు గాయపడ్డారన్నారని చెప్పారన్నారు. పథకం ప్రకారమే అగ్రవర్ణాలు దాడులు జరిపినట్లుగా దళితులు చెప్పారని తెలిపారు. అగ్రకులాలకు చెందిన గుంటుపల్లి సందీప్, ఆలపాటి పాండు, లక్ష్మయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ బృందం దళితులు, అగ్రకులాల నుంచి వివరాలను నమోదు చేశారు. అగ్రవర్ణాలు మాత్రం దళితులు తమను కవ్వించటం వల్లే దాడికి పాల్పడినట్లుగా చెప్పారని శ్రీనివాసరావు తెలిపారు. రూరల్ డిఎస్‌పి జి.ఎన్.మూర్తి నుంచి కూడా బృంద సభ్యులు వివరాలను సేకరించారు. రెండు రోజులపాటు గ్రామంలో జరిగిన ఘటనలపై వివరాలు నమోదు చేసి నివేదిక ప్రభుత్వానికి పంపనున్నట్టు శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. అగ్రవర్ణాలకు చెందిన 18 మందిపైన, 11 మందిపైన దళితులపైన ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

మధు అరెస్టు అక్రమం

ఖండించిన వామపక్షాల నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బుధవారం చేపట్టనున్న చలో పెదగొట్టిపాడు కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేయడానికే పోలీసులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు వి కృష్ణయ్య తదితరుల్ని అరెస్టు చేసి నిర్బంధించారని పది వామపక్షాల నేతలు విమర్శించారు. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వై సాంబశివరావు సిపిఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ), గుర్రం విజయ్ కుమార్ సిపిఐ(ఎంఎల్), ఎం వెంకటరెడ్డి(ఎంసిపిఐ(యు), బి బంగార్ రావ్ (సిపిఐ ఎంఎల్ లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ), బిఎస్ అమర్‌నాథ్ ఎస్‌యుసిఐ(సి), పివి సుందర రామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకిరాములు (రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ) మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లా పెదగొట్టిపాడులో అగ్రకుల పెత్తందార్ల దాడికి గురై, 22 రోజులుగా దళితులు సాంఘిక బహిష్కరణ ఎదుర్కొంటున్నారన్నారు. వారికి కౌలుకిచ్చిన పొలాల్ని తిరిగివ్వాలని, పాతబాకీలు వెంటనే చెల్లించాలని అగ్రకులాల వారు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. పాలకేంద్రంలో పనిచేస్తున్న దళిత యువకుడిని పనిలోంచి తీసివేయడం, కిరాణా సరకులు విక్రయించేవార్ని అడ్డుకోవడం, దళిత యువకుడి ఎలక్ట్రికల్ షాపుని ఖాళీ చేయించడం, పాఠశాలల్లో దళిత విద్యార్థుల్ని వేరేగా కూర్చోబెట్టడం లాంటి వివక్షకు పాల్పడుతున్నారన్నారు. ఇన్ని జరుగుతున్నా పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం నివారించకుండా పెత్తందార్ల కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం తాత్సారం చేస్తూ మద్దతు తెలుపుతున్న వారిని అరెస్టు చేయడం హేయమైన చర్య అని వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. చలో గొట్టిపాడు కార్యక్రమాన్ని విచ్ఛిన్నం చేయడానికి గత రెండురోజులుగా గుంటూరు జిల్లా నాయకులు, కార్యకర్తల్ని నిర్బంధించడం అమానుషమని విమర్శించారు. రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం రాజకీయ పార్టీల, దళిత సంఘాల నేతలపై నిఘా పెట్టి, వారిని ఇళ్ల వద్దే అరెస్టు చేయడం ప్రజాతంత్ర హక్కుల్ని కాలరాయడమేనన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి, గొట్టిపాడు దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్బంధ చర్యల్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా వామపక్షాల నేతలు పిలుపునిచ్చారు. మధు అరెస్టును రైతు సంఘం నాయకులు పెద్దిరెడ్డి, కేశవరావు, పి.నరసింహారావు కూడా ఖండించారు.

అప్రజాస్వామికం : రఘువీరారెడ్డి

దళితుల్ని పరామర్శించేందుకు వెళ్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధును పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. గుంటూరు జిల్లాలోని పెదగొట్టిపాడు దళితుల గ్రామాన్ని ప్రజాసంఘాలతో కలిసి ఆయన సందర్శించనున్న నేపథ్యంలో సిపిఎం నేతల్ని ఆ గ్రామానికి వెళ్లనివ్వకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా మధుతోపాటు పలువురు సిపిఎం నేతల్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఆయన ఖండించారు. గుంటూరు జిల్లావ్యాప్తంగా పలువురు నేతల్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని రఘువీరా డిమాండ్ చేశారు.



ప్రజ్ఞ

1. డ్యాముల భద్రతపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ఎక్కడ జరుగుతోంది?
2. విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ నూతన డైరెక్టర్?
3. వికలాంగులు, పేదల ఆరోగ్య హామీ కోసం మణిపూర్ ప్రారంభించిన పథకం?
4. 2018 మహిళా టీ20 ప్రపంచకప్ ఎక్కడ జరుగుతుంది?
5. 2018 స్వీడిష్ ఓపెన్ జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ విజేత?

సమాధానాలు 7లో

ఆర్‌యులో కీచకపర్వం

- అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపులు
- విచారణ కమిటీ వేయాలని ఆందోళన
- విద్యార్థులను తొక్కుకుంటూ వెళ్లిన విసి



విద్యార్థుల గొంతు పట్టి తోస్తున్న విసి నర్సింహులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాయలసీమ యూనివర్సిటీలో ఓ అసిస్టెంట్ మహిళా ప్రొఫెసర్‌పై ఇద్దరు కీచక ప్రొఫెసర్లు చేసిన లైంగిక వేధింపులు మంగళవారం ఆందోళనకు దారి తీసింది. కీచక ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులపై విసి నిర్దాక్షిణ్యంగా తోస్తూ, తొక్కుకుంటూ వెళ్లడం చర్చనీయాంశమయింది. వివరాల్లోకెళితే.. యూనివర్సిటీలో బయోటెక్నాలజీ ప్రొఫెసర్ హలీం, జువాలజీ ప్రొఫెసర్ విజయుడులు ఓ మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను గత కొంతకాలంగా వేధింపులకు గురి చేస్తున్నారు. దీంతో ఆమె మానసికంగా కుంగిపోయి తీవ్ర అస్వస్థతకు గురైంది. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె తనను వేధిస్తున్న ప్రొఫెసర్లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసేందుకు వైస్ ఛాన్సలర్ ఆర్.నర్సింహులు ఛాంబర్ వద్దకు వెళ్లారు. అప్పటికే అస్వస్థతతో ఉన్న ఆమె అక్కడ స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే సిబ్బంది ఆమెను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై విచారణ కమిటీ వేసి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విసి ఛాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. విసి రాకపోవడంతో పరిపాలన కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు.

రైతుకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు

దావోస్ నుంచి టెలికాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చేతికొచ్చిన పంటలకు అన్ని విధాలా గిట్టుబాటు ధర వచ్చి రైతే పూర్తి ప్రయోజనం పొందేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారుల్ని ఆదేశించారు. దావోస్ నుంచి ఆయన అధికారులతో మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికొచ్చిన వరి పంటకు రైతులు ప్రయో జనం పొందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారు లకు సూచించారు. పట్టిసీమ నీటి వల్ల కృష్ణా జిల్లా రైతు లకు పుష్క లంగా పంట చేతికొచ్చిందన్నారు. తద్వారా రైతు లకు చేకూరిన అదనపు ప్రయోజనానికి తగు ప్రతిఫలం దక్కాలన్నారు. వ్యవసాయ, పౌరసరఫరాశాఖ అధికారులు రైతులకు అండగా నిలవాలన్నారు. ముఖ్యంగా కృష్ణా జిల్లా కలెక్టర్ అప్రమత్తంగా వ్యవహరించి గిట్టుబాటు ధరపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, రైతులకు మేలు జరిగేలా కృషి చేయాలన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు దళారుల్ని నమ్మి మోసపోకుండా చూడాలని అధికారుల్ని ఆదేశించారు.

డి-ఫార్మసీ ఉద్యోగావకాశాలకు కమిటీ : కామినేని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డి ఫార్మసీ పూర్తి చేసిన వారికి ఉద్యోగావ కాశాల కల్ప నకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని వైద్యఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం విజయవాడలో తన నివాసంలో డి ఫార్మా విద్యార్థులు ఎమ్మెల్యేలు ప్రభాకర్ చౌదరి, జితేందర్‌లతో పాటు కామినేనిని కలిశారు. గత ఆరు బ్యాచ్‌ల నుంచి తమకు సరైన ఉద్యోగావకాశాలు లేవని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థులతో సమావేశం అనంతరం కామినేని విలేకరులతో మాట్లాడుతూ వారి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తరఫున కమిటీ వేస్తున్నామని తెలిపారు. వైద్య విద్య (అకడమిక్) డిఎంఇ కమిటీకి కన్వీనర్‌గా, వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి, డిజి డ్రగ్స్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కమిటీలో సభ్యులుగా ఉన్నారన్నారు. వివిధ రాష్ట్రాలలో అమలుచేస్తున్న విధానాల్ని పరిశీలించి కమిటీ 45 రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందన్నారు.

సదావర్తి భూములపై జోక్యం చేసుకోం : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

చెన్నైలోని అత్యంత ఖరీదైన ఏపీ దేవాదాయ,ధర్మాదాయ శాఖకు చెందిన సదావర్తి సత్రం భూముల కేసులో జోక్యం చేసుకోబోమని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఈ భూముల కేసు తమ పరిధిలోకి రాదని, తమిళనాడులోనే పరిష్కరించుకోవాలని స్పష్టం చేసింది. ఈ కారణంగా సదావర్తి భూబాగోతంపై కేసుకు తెర దించుతున్నట్లు బెంచ్ వెల్లడించింది. సదావర్తి సత్రానికి చెందిన 83 ఎకరాలు చెన్నైలో ఉన్నాయి. వీటిని ఏపీ ప్రభుత్వం కారు చౌకగా అమ్మేసిందన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ మంగళగిరి వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

పలువురు ఐఎఎస్ అధికారుల బదిలీ

దుర్గగుడి ఇఒగా పద్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పనిచేస్తున్న పలువురు ఐఎఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌కు అదే శాఖ అదనపు బాధ్యతలు అప్పగించడంతో పాటు రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి గోపాల్ కృష్ణ ద్వివేదికి అదే శాఖ అదనపు బాధ్యతల్ని అప్పగించడంతో పాటు పశుసంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండి ఎం.పద్మకు అదే శాఖ అదనపు బాధ్యతల్ని అప్పగించడంతో పాటు విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానం ఇఒగా నియమించారు. సెలవు కాలం పూర్తయ్యాక సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాల్సిందిగా జెవిస్వీ ప్రసాద్‌ను కోరారు.

సిసి కెమెరాలపై నివేదికివ్వండి : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

మార్కులు ఎక్కువ రావాలని పెద్దలు.. ర్యాంకులే ప్రధానంగా విద్యాసంస్థలు.. ఫలితంగా మాస్ కాపీయింగ్ జరుగుతోందని.. వీటి దుష్పరిణామాల వల్ల విద్యా వ్యవస్థ భ్రష్టు పడుతోందని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ ఆందోళన వెలిబుచ్చింది. మాస్‌కాపీయింగ్, పుస్తకాలు పెట్టి పరీక్షలు రాసే దుష్ట విధానాన్ని అడ్డుకునేందుకు పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు బెంచ్ మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. పరీక్షలు ఒకదారికి రావాలంటే మండల, జిల్లా స్థాయి విద్యాధికారులను బాధ్యుల్ని చేయడమే సరైన విధానం అవుతుందనే అభిప్రాయాన్ని బెంచ్ వ్యక్తం చేసింది.

ప్రత్యేకం

సూర్యలంకలో చేప, పీత పిల్లల ఉత్పత్తి కేంద్రం

- టైగర్ వనామీ రొయ్యలకు ప్రత్యామ్నాయం
- దశలవారీగా నిధుల విడుదల



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లాలోని తీరప్రాంతమైన సూర్యలంకలో రూ.40 కోట్లతో పండుగప్ప చేప పిల్లలు, పచ్చ పీతల పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. టైగర్ వనామీ చేప పిల్లలకు ప్రత్యామ్నాయంగా దీన్ని కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. దీని కోసం ప్రభుత్వం ఇప్పటికే 10 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఒప్పందం ప్రకారం దశలవారీగా రూ. 40 కోట్లు విడుదల చేశాయి. రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంది. మత్స్య రంగం ద్వారా రాష్ట్రానికి ప్రస్తుతం రూ. 20 వేల కోట్ల ఆదాయం వస్తుండగా మరో ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలకు పెంచాలనే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం ఇప్పటికే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా బాపట్ల సమీ పంలో దీన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇక్కడ ఉత్పత్తి చేసే పిల్లల్ని రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేయాలని ప్రణాళికలు రచించింది. దేశంలో ఇప్పటి వరకు ఈ తరహా ఉత్పత్తి కేంద్రం తమిళనాడులోని కరైకల్‌లో ఉంది. బాపట్ల తీరంలో ఏర్పాటు చేయనున్న పండుగప్ప చేప పిల్లలు, పచ్చ పీతల పిల్లల ఉత్పత్తి కేంద్రానికి రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ (ఆర్‌జిసిఎ) సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేస్తోంది.

వ్యాధి నిరోధక శక్తి కలిగిన నాణ్యమైన పీతలు, పండుగప్ప చేప పిల్లల్ని ఏడాది పొడవునా ఇక్కడ ఉత్పత్తి చేస్తారు. హేచరీలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రయోగశాలను ఏర్పాటు చేసి, సుమారు 50 మంది నిపుణులైన ఉద్యోగుల్ని తొలిదశలో ఇక్కడ నియమించను న్నారు. ఈ కేంద్రం కోసం సూర్యలంకలో గతేడాది భూమిని గుర్తించిన రెవెన్యూ శాఖ అధికారులు అనంతరం మత్స్య శాఖకు బదలాయించారు. ఇందులో హేచరీల ఏర్పాటుకు ప్రాథమిక పరిశీలన పూర్తయ్యింది. మత్స్య రంగంలో వనామీ రొయ్యలసాగులో ఇహెచ్‌పి, ఇఎంఎస్ వైట్‌స్పాట్ వంటి వ్యాధుల వల్ల ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. రొయ్యలసాగు ఒడిదొడుకులు ఎదుర్కొనే సమయంలో రైతులకు ప్రత్యామ్నాయంగా పీతలు, పండుగప్ప చేపల పిల్లల్ని అందించి ఆదుకోవాలని నిర్ణయించింది.

సంక్షిప్తం

లోకేశ్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంత్రిగా తొలి పుట్టినరోజును జరుపుకుంటున్న ఐటి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి లోకేశ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ' తెలుగు యువతకు అసలైన ప్రతినిధి, ప్రజాకర్షక నేత నారా లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవచేయడానికి మీకు గొప్పబలం, సంకల్పం సిద్ధించాలని కోరుకుంటున్నా ' అని ట్వీట్ చేశారు.

వారిద్దరినీ ఒకే వేదికపై చూడలేం : కామినేని

ప్రధాని మోడీతో ప్రతిపక్షనేత జగన్‌ను ఒకే వేదికపై చూడలేమని మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. విజయవాడలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడీకి, జగన్‌కు పోలికలేదన్నారు. అవినీతి పరుడైన జగన్‌తో బిజెపి పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు.

గన్నవరం విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ చెక్..!

రాజధాని అమరావతికి కీలకమైన గన్నవరం విమానాశ్రయంలో ఆథరైజ్డ్ ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీనికి సంబంధించి హోం శాఖ కార్యదర్శి అనురాధ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వివరాలు ఇవ్వకుంటే భూ సేకరణ చేయనీయం : హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

భూసేకరణ వివరాలు అందజేయడంలో అశ్రద్ధ వహిస్తే భూసేకరణ చేయకుండా ఉత్తర్వులు ఇవ్వాల్సివస్తుందని తెలుగు రాష్ట్రాలను హైకోర్టు హెచ్చరించింది. తెలంగాణ ప్రభుత్వం పూర్తి వివరాలు ఇవ్వకపోడంపై మండిపడింది. ఏపీ ప్రభుత్వం వివరాలే ఇవ్వకపోడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.

పునరావాసం ప్రశ్నార్థకమే

మొదటి పేజీ తరువాయి

మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు కాఫర్‌డ్యాంకు అనుమతి తీసుకున్నారు. వాటిని పూర్తి చేస్తే దాదాపు నీటిని నిల్వ చేస్తారు. దీనివల్ల ముంపు ఏర్పడుతుంది. అనివార్యంగా ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. పులిచింతల ప్రాజెక్టు విషయంలోనూ, వంశధార ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరించింది. సరైన విధంగా పరిహారం ఇవ్వకపోవడం, బలవంతంగా ఖాళీ చేయించడం, పొక్లెయినర్లతో ఇళ్లను కూల్చివేయడం వంటి చర్యలకు దిగింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేడుతున్న పోలవరం ప్రాజెక్టు విషయంలో పునరావాసం అత్యంత సమస్యాత్మకంగా మారింది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఇక్కడ మొత్తం 1,01,532 కుటుంబాలుంటే ఇప్పటి వరకూ 4069 కుటుంబాల్ని మాత్రమే తరలించారు. ఈ నివేదికను కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా అంగీకరించారు. కాఫర్ డ్యాం కట్టిన తరువాత అనివార్యంగా నీరు నిలబడితే ప్రజలే తరలివెళ్లిపోవాల్సి ఉంటుంది. ఒక్కసారి నీరు నిలిచిన తరువాత ఎన్నిరోజులకు తగ్గుతాయనేది ఎవరూ చెప్పలేరు. వంశధార ప్రాజెక్టు విషయంలో గ్రామాల్లో ఉన్న ఇళ్లను కూల్చేశారు. పోలీసుల సాయంతో ప్రజల్ని తరిమేశారు. అక్కడ పూర్తిస్థాయిలో పునరావాసాన్ని పూర్తి చేశారని నివేదిక ఇచ్చారు. అది వాస్తవం కాదని బాధితులు చెబుతున్నారు. తోటపల్లి బ్యారేజీ విషయంలోనూ ఇప్పటికీ 3507 కుటుంబాల్ని తరలించాల్సి ఉంది. ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ ప్రాజెక్టు విషయంలోనూ 3704 కుటుంబాల్ని తరలించాల్సి ఉంది.

తరిమేశారు : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి

ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వాసితులకు పునరావాసాన్ని కల్పించే విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కృష్ణమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార ప్రాజెక్టు విషయంలో పునరావాసాన్ని కల్పించామని చెప్పడం అబద్ధమనీ, అక్కడ ప్రజల్ని బలవంతంగా తరలించడం నిజమనీ ఆయన పేర్కొన్నారు. ఇళ్లను కూల్చివేసి, పోలీసులతో బెదిరింపులకు దిగారని ఆయన చెప్పారు.

లోకేశ్ అంకిత భావం కలిగిన వ్యక్తి

ప్రజాశక్తి – గుంటూరు సిటీ ప్రతినిధి

లోకేశ్ అంకిత భావం కలిగిన వ్యక్తి అని, పార్టీలోనూ, తాను నిర్వహిస్తున్న ఐటి, పంచాయతీ రాజ్ శాఖల్లోనూ విప్లవాత్మక మార్పులు తెచ్చారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు అన్నారు. గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలేశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కళా వెంకట్రావు కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఇంటింటికీ కుళాయి నీటిని అందుబాటులోకి తెచ్చారని, తన పనితీరుతో నూరుమార్కులూ సాధించారని పేర్కొన్నారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. ఏ రాజకీయ పార్టీకీ లేనంతగా సభ్యత్వాన్ని టిడిపికి లోకేశ్ అందించారని చెప్పారు.



ప్రదానం

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జెఎన్‌టియుకె ఆరో స్నాతకోత్సవంలో భాగంగా మంత్రి గంటా శ్రీనివాసరావు పలువురు విద్యార్థులకు పిహెచ్‌డి పట్టాలను ప్రదానం చేశారు.

మార్పునకు మనమే నాంది

జెఎన్‌టియుకె స్నాతకోత్సవంలో ఫైంట్ లిమిటెడ్ చైర్మన్ బివిఆర్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి – కాకినాడ

మార్పునకూ మనమే నాంది కావాలని, ప్రతి పారిశ్రామిక విప్లవం అభివృద్ధి పథం వైపు దూసుకుపోయి దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశిస్తుందని ఫైంట్ లిమిటెడ్ చైర్మన్ బివిఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ జెఎన్‌టియుకె ఆరో స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ముందు తరంలో లేనంత వేగం నేటితరంలో ప్రస్ఫుటమవుతుందని తెలిపారు. సాంకేతిక రంగంలో వచ్చే మార్పు ఊహించనంతగా దేశాల ఆర్థిక వ్యవహారాలపై ప్రభావం చూపుతుందన్నారు. రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందన్నారు. నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యనందించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. జెఎన్‌టియు కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ విఎస్ఎస్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపి పండుల రవీంద్రబాబు తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి బంగారు పతకాలు, పిహెచ్‌డిలను ప్రదానం చేశారు.

ఫిర్యాదుల పరిష్కారం ఇలాగేనా?

- మాటలకూ ఆచరణకూ పొంతనేది?
- ఆఫీసుల చుట్టూ జనం ప్రదక్షిణలు
- బెజవాడలో రేషన్ కార్డుల కోసం పాట్లు
- కార్డుల్లో పొరపాట్ల సవరణకు ఇంటి పట్టాల మార్పిడికి నమోదు
- డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్లకు వృద్ధుల అవస్థలు

ప్రజాశక్తి – విజయవాడ అర్బన్ ప్రతినిధి

ప్రభుత్వం ఈ–కార్యాలయాల ఏర్పాటు, ఫిర్యాదులపై తక్షణమే నిర్దేశిత గడువులోగా పరిష్కారం అని చెబుతున్న మాటలకూ, ఆచరణకూ పొంతన కుదరడం లేదు. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో జరుగుతున్న పొరపాట్లతో ప్రజలు నానా తిప్పలు పడాల్సి వస్తోంది. విజయవాడ నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు ఒకటికి పదిసార్లు ప్రదక్షిణలు చేస్తున్న తీరు పరిస్థితికి అద్దం పడుతోంది.

గుణదల ప్రాంతానికి చెందిన మదాల కోటయ్య వయస్సు 75 సంవత్సరాలు. నాలుగు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి నాలుగు విడతలుగా జన్మభూమి కార్యక్రమాల్లో వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తు చేశారు. పింఛను మంజూరు కాకపోవడంతో నడవలేని స్థితిలో ఉన్న ఆయన తన కుటుంబ సభ్యుల సహాయంతో వాహనంలో నగరంలోని అసిస్టెంట్ సివిల్ సప్లయ్ (ఎఎస్‌వో) కార్యాలయానికి వచ్చారు. రేషన్ కార్డులో 50 సంవత్సరాలుగా నమోదు కావడంతో పింఛను మంజూరు కాలేదని తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. మీ–సేవా కేంద్రానికి వెళ్లి సరి చేయించుకోవాల్సిందిగా అధికారులు సూచించడంతో అక్కడ నుంచి మళ్లీ మీ–సేవా కేంద్రానికి వెళ్లారు. పింఛను మంజూరుకు సంబంధించి దరఖాస్తు చేసిన వారిలో ఎక్కువ మంది ఇదే తరహా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమంలో విజయవాడ నగరంలో 8 వేల మందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీటి విభజన, పంపిణీ సరైన పద్ధతిలో జరగలేదు. ఈ కార్డులు ఎక్కడున్నాయో అర్థంకాక తెలుసుకునేందుకు ఎఎస్‌వో కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఈ తరహా సమస్యలతో ఎఎస్‌వో కార్యాలయాల వద్ద గత కొన్ని రోజులుగా రద్దీగానే ఉంటోంది. రాబోయే ఎన్నికల నేపథ్యంలో నగరంలోని కొండ ప్రాంతంలోని గృహాలకు రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీకి, తాజాగా వారసుల పేరుతో ఇవ్వడం, అలాగే క్రయ, విక్రయాలు జరిగిన వాటిని పరిశీలించి నివాసం ఉండే వారికి పట్టాలు మంజూరు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేయనున్నట్లు సమాచారం. దీనికి సైతం మీ–సేవా కేంద్రంలో రూ. 500లు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంది. మీ- సేవా కేంద్రంలో పేర్ల నమోదు కోసం క్యూ కడుతున్నారు.



డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లకు వృద్ధుల అవస్థలు

ప్రభుత్వ ఉద్యోగ విరమణ పొందిన పింఛనుదారులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. సర్వీసు పింఛనుదారులు, కుటుంబ పింఛనుదారులందరూ లైఫ్ సర్టిఫికెట్ల (తాము బతికే ఉన్నట్లు తెలిపే) కోసం ఉపఖజానా కార్యాలయం వద్ద బారులు తీరుతున్నారు. ఆధార్ అనుసంధానంగా బయోమెట్రిక్‌లో వేలిముద్రను డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లకు అనుసంధానం చేయాల్సి ఉంది. అయితే వృద్ధాప్యంలో ఉన్న వీరి వేలిముద్రలు బయోమెట్రిక్‌లో సరిపోవడం లేదు. వేలిముద్రలు సరిపోని వారు ఒకటికి పదిసార్లు ఉప ఖజానా కార్యాలయానికి తిరగాల్సి వస్తోంది. నడవలేని స్థితిలో ఉన్న కంకిపాడుకు చెందిన 91 సంవత్సరాల శనగపాటి కమలమ్మ, ఇప్పటికి లైఫ్ సర్టిఫికెట్ల కోసం కుటుంబ సభ్యులను వెంటబెట్టుకుని మూడుసార్లు ఉపఖజానా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మొత్తం నగరంలో 13,500 డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు మంజూరు చేయాల్సి ఉండగా నవంబర్ నుంచి 8 వేలు మాత్రమే పూర్తయ్యాయి. ఎక్కువ మంది వేలి ముద్రలు పడకపోవడంతో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు మంజూరు కావడం లేదు. వేలిముద్రలు పడనివారికి త్వరలో ఐరిస్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఒకటికి పదిసార్లు తిరుగుతున్న వృద్ధులు విసిగిపోతున్నారు. ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులకు అన్యాయం

- అధికార పార్టీ నేతలు ఒప్పుకుంటే వ్యవసాయ పరికరాలు
- దరఖాస్తులు 4,360 మంజూరు 1,932

ప్రజాశక్తి – అనంతపురం ప్రతినిధి



Department of Agriculture
FARM MECHANIZATION (FY 2017-2018)
Authorized Agent Name : ESEVA-ANA
Transaction Id : TAFMQ011700248436
District : Ananthapuramu
Village : BONDANAKAL
Farmer Name : R JAYARAM NAIK
Machine Type : Rotavators
Machine Name : Rotavator 42 blades Gear drive Multi speed (HD)
Dealer : AP State agro industries development corporation
Delivered in : Within 10 working days from requested date.
Informant Name : R JAYARAM NAIK
Application No : FMQ011700248436
Mandal : Rayadurg
Khata No : 27
Father Name : R HANUMANTHA NAIK
Specification : ALL
Total Amount Paid (in Rs.) : 2020
ESEVA Ananthapur

ఆధునికతతో కూడిన వ్యవసాయాన్ని రైతులకు చేరువ చేసి అధిక దిగుబడులు సాధించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోంది. అధికారులపై అధికారపక్ష నేతలు తెస్తున్న ఒత్తిడి రోజురోజుకు అధికమవుతుండటంతో వ్యవసాయ పరికరాల పంపిణీలో అర్హులకు అన్యాయం జరుగుతోంది. సాగులో సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలకాలన్న ప్రభుత్వ నిర్ణయానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. మరోవైపు బడ్జెట్ కేటాయింపులో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో రైతులకు ఎదురుచూపులు తప్పటం లేదు. అనంతపురం జిల్లాలో వ్యవసాయ రాయితీ పరికరాల విషయంలో రాజకీయ పంచాయితీ నెలకొంది. రైతు రథంలో నెలకొన్న విధానమే సబ్సిడీ పరికరాల విషయంలోనూ అమలవుతున్నది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో రూ.7.30 కోట్ల విలువ చేసే వ్యవసాయ యాంత్రాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. మరో నెలలో ఆర్థిక ఏడాది ముగియనుంది. కరువు నేపథ్యంలో అవసరం వున్న సమయంలో దరఖాస్తు చేసుకున్న రైతులకు యంత్రాలను పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. జిల్లావ్యాప్తంగా సబ్సిడీ యంత్రాల కోసం 4,360 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకూ రూ.3.33 కోట్లతో 1,932 మందికి యూనిట్లు మంజూరు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఎప్పుడు పంపిణీ చేస్తారనేది మాత్రం చెప్పడం లేదు. ప్రభుత్వం సబ్సిడీ పరికరాలను ఎస్‌సి, ఎస్‌టి రైతులకు 70 శాతం, బిసి, ఒసి రైతులకు ఐదు ఎకరాలలోపు 50 శాతం, ఆపై వారికి 40 శాతం సబ్సిడీ ఇస్తోంది. వ్యవసాయంలో యంత్రాల అవసరం ఎక్కువగా వుండడంతో ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. మరోవైపు అధికార పార్టీ నేతల సిఫార్సులుంటేనే సబ్సిడీ పరికరాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు తెగేసి చెబుతున్నారు. అలా కాకుండా స్వయంగా మంజూరు చేస్తే అధికారులపై రాజకీయ ఒత్తిడి తప్పటం లేదు. దీంతో రైతు బతుకులపై పెత్తనం హెచ్చు మీరుతున్నది. అత్యుత్తమ ఆశయాలతో ప్రవేశ పెట్టిన పథకంలో ఆధిపత్య పోరు వెంటాడుతోంది. సొంతంగా నిర్ణయాలు తీసుకోని నిస్సహాయ స్థితిలో వ్యవసాయశాఖాధికారులు ఉన్నారు. ఒకవేళ ఎవరికీ తెలియకుండా ఫైలు కదిపితే అధికారులపై పాలకులు చిర్రుబుర్రులాడుతున్నారు. జిల్లాలోని వ్యవసాయ శాఖ పరిధిలో సబ్సిడీ యంత్రాల విషయంలో ప్రస్తుతం ఇలాంటి పరిస్థితులు వుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులపై అధికారపక్షం తెస్తున్న ఒత్తిడి కారణంగా అర్హులకు న్యాయం చేయలేకపోతున్నామని వ్యవసాయ శాఖ అధికారులు మనసులో మాట చెప్పటం హాస్యాస్పదంగా వుంది.

మూడు నెలలుగా ఎదురుచూస్తున్నా



అక్టోబరులో రోటావేటర్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. మూడు నెలలుగా ఎదురుచూస్తున్నా ఫలితం లేదు. ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి రైతులకు మేలు చేస్తామని చెబుతోంది. దరఖాస్తు చేసుకున్న పది పనిదినాల్లోనే యంత్రాలు వస్తాయని పాలకులు చెప్పారు. మూడు నెలలు గడిచినా అతీగతి లేదు.

– జయరాం నాయక్, బొందనకల్లు, రాయదుర్గం మండలం

ఎమ్మెల్యే కలమటకు నాన్‌బెయిలబుల్ వారెంట్

ప్రజాశక్తి– హిరమండలం (శ్రీకాకుళం జిల్లా)



శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకట రమణకు కొత్తూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు మంగళవారం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఎమ్మెల్యేతో పాటు మరో ముగ్గురికి ఈ వారెంట్ జారీ అయింది. వైసిపి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆ పార్టీ ఆందోళన కార్యక్రమంలో భాగంగా 2015 జూన్ తొమ్మిదో తేదీన హిరమండలం మండలంలోని అలికాం–బత్తిలి ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. దీనిపై 341, 143, 283, 285 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణకు కలమటతో పాటు మెళియాపుట్టికి చెందిన సలాన మోహనరావు, కొత్తూరు మండలానికి చెందిన పాలక రవి, ఎల్ఎన్‌పేట మండలానికి చెందిన ఎస్.కిషోర్‌బాబు గైర్హాజరు కావడంతో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. గత ఎన్నికల్లో వైసిపి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కలమట 2015వ సంవత్సరం ఆఖరిలో టిడిపిలో చేరారు.

దేశంలో తీవ్రంగా పౌష్టికాహార సమస్య

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ జెఆర్.పుష్పరాజ్

ప్రజాశక్తి–జిల్లాపరిషత్ (విశాఖ)



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పుష్పరాజ్

పౌష్టికాహార సమస్య దేశాన్ని తీవ్రంగా కలచివేస్తోందని, అత్యంత వెనుకబడిన ఉగాండా దేశం కన్నా భారతదేశం వెనుకబడి ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ జెఆర్.పుష్పరాజ్ అన్నారు. విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల విద్య, పౌరసరఫరాలు, తూనికలు కొలతలు, జిసిసి, ఆహార సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఉగాండాలో పౌష్టికాహార సమస్య 33 శాతంగా ఉంటే మన దేశంలో 39 శాతంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో పౌష్టికాహార లోపం ఉన్నవారు 69,139 మంది ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఈ సమస్యను అదిగమించాల్సి ఉందని, దీనిని నివారించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. మల్టీప్లెక్స్ థియేటర్లలో అత్యధిక ధరలకు అమ్మకాలు చేపడుతున్నారని, అసలు ధరలకు, అమ్మకం ధరకు తీవ్ర వ్యత్యాసం ఉందని తెలిపారు. త్వరలో దేశవ్యాప్తంగా ఉన్న స్టార్‌హోటళ్లు, మల్టీప్లెక్స్‌ల్లో ఒకే రకమైన ధరకు అమ్మకాలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ కార్యదర్శి జి.రవిబాబు, సభ్యులు ఎన్.విజయకుమార్, శ్రీనివాస్, ఎల్‌పి.వెంకటరావు, జి.కృష్ణమ్మ, డాక్టర్ స్వర్ణగీత, ఆయా జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం

ప్రజాశక్తి–నల్లజర్ల, ఆకివీడు(పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఓ కారును లారీ ఢీకొట్టిన సంఘటనలో ఓ చిన్నారి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఆకివీడు మండలం అజ్జమూరు గరువు వద్ద ద్విచక్రవాహనాన్ని నరసాపురం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయలపల్లికి చెందిన జోషుల సురేష్(38) భార్య ఇటీవల మృతి చెందింది. ఆమె అస్తికలను కాశీలోని గంగానదిలో కలపాలంటూ విజయవాడలో తన తండ్రి వీరవెంకట సత్యసూర్య రామజోస్వరశర్మ, తల్లి, మామయ్యలకు అందజేసి, వారిని కాశీ వెళ్లే రైలు ఎక్కించారు. తన చెల్లెలు పొన్నాల సత్యసుధాదేవి(32), బావమరిది రఘునాథకుమార్ శర్మ, తన కుమార్తెలు సువర్చల (18నెలలు), చిన్న కుమార్తె నిశ్చల(ఐదునెలలు)తో కలిసి నానో కారులో స్వగ్రామానికి బయలుదేరారు. అనంతపల్లి వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో సత్యసుధాదేవి, చిన్నారి నిశ్చల అక్కడికక్కడే మృతిచెందారు. సురేష్, రఘునాథకుమార్‌లను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో సురేష్ చనిపోయారు. రఘునాథకుమార్ చికిత్స పొందుతున్నాడు. సురేష్ చిన్న కుమార్తె నిశ్చల ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడింది. మరోవైపు ఆకివీడు మండలం అజ్జమూరు గరువు వద్ద ద్విచక్ర వాహనాన్ని నరసాపురం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఢీకొని తెలంగాణ నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల కేంద్రానికి చెందిన ఎమ్‌డి షకీల్(18), ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం రాజంపాలేనికి చెందిన ఊడా నాగార్జున(18) మృతి చెందారు. వీరిద్దరూ కృష్ణా జిల్లాలోని వేర్వేరు ఆక్వా కంపెనీల్లో టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. సోమవారం ఉండిలో నిర్వహించిన ఆక్వా సదస్సులో పాల్గొని, మంగళవారం ఒకే ద్విచక్ర వాహనంపై తిరిగెళ్తుండగా బస్సు ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మౌనిక అంతిమయాత్ర (ఇన్‌సెట్లో) మల్లంపల్లి జయమ్మను ఓదారుస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

మౌనికకు అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి – గన్నవరం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్లంపల్లి మౌనిక భౌతికకాయానికి అంత్యక్రియలు మంగళవారం కృష్ణాజిల్లా గన్నవరం మండలం ముస్తాబాదలో జరిగాయి. ఆమె సిపిఎం కృష్ణాజిల్లా (తూర్పు) కమిటీ సభ్యులు మల్లంపల్లి జయమ్మ, ప్రజానాట్యమండలికృష్ణాజిల్లా (తూర్పు) సహాయ కార్యదర్శి ఆంజనేయులు పెద్ద కుమార్తె. మౌనిక అంతిమ యాత్ర ముస్తాబాద నుండి ప్రారంభమైంది. ఈ యాత్రలో తూర్పు కృష్ణాకు చెందిన సిపిఎం, మహిళా, ప్రజా నాట్యమండలి నాయకులు, సిఐటియు తదితర ప్రజా సంఘాల నేతలు, ముస్తాబాద గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని మౌనికకు కన్నీటి వీడ్కోలు పలికారు. అడుగడుగునా పూలు జల్లుతూ ఆమెకు జోహార్లర్పించారు. దారి పొడవునా అశ్రునయనాలర్పించారు. తల్లిదండ్రులు మల్లంపల్లి జయమ్మ, ఆంజనేయులు, సోదరి క్రాంతి శ్మశాన వాటిక వద్ద ఆమె భౌతికకాయంపై పూలు వేసి కడసారి వీడ్కోలు పలికారు. ఆ తర్వాత మౌనిక భౌతిక కాయాన్ని ఖననం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి), సిహెచ్.బాబూరావు, జిల్లా కార్యదర్శి ఆర్.రఘు, గన్నవరం ఎంఎల్ఎ డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్, ఎంపిపి పట్రా కవిత తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో ఆసియా బ్యాంక్ బృందం పర్యటన

ప్రజాశక్తి–తిరువూరు (కృష్ణా)

కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రి నుంచి కృష్ణా జలాలను తాగునీటి సరఫరా నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లతో మంజూరు చేసిన నేపథ్యంలో సాధ్యాసాధ్యాలపై చైనాకు చెందిన అసియా బ్యాంక్ ప్రతినిధుల బృందం మంగళవారం తిరువూరులో పర్యటించింది. రాజుపేట, పాత తిరువూరు, నడింతిరువూరులోని వాటర్‌ట్యాంక్‌లను, పంపింగ్ స్కీమ్‌లను పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంది. అనంతరం బృందం సభ్యులు డిఎం.మోహన్, ప్రకాష్ బజోరియా, జకారియన్‌లతో ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక వసతుల సదుపాయల సంస్థ కార్యాలయం ఇఇ అమరయ్య, చీఫ్ ఇంజినీర్ రాజేంద్రప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ నాగేంద్రకుమార్, ప్రజా రోగ్య శాఖ ఎస్ఇ ఏడుకొండలు, ఇఇ గణేష్‌బాబు, స్థానిక కమిషనర్, జి.రఘుకుమార్ ఎఇ వెంకటేశరరావులతో సమావేశం నిర్వహించారు. ఎఇ నుంచి కొంత సమాచారం సేకరించారు. అన్నీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ బృందం ప్రాజెక్టు నిర్మాణానికి రుణమిచ్చేందుకు ఆసక్తి కనబర్చినట్లు వారి మాటల ద్వారా వ్యక్తమైందని అధికారులు తెలిపారు.

ప్రత్యేకం

పట్టాదారు పాసుపుస్తకాల కోసం తిప్పలు

- భారీగా లంచాలు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

ప్రజాశక్తి–గుంటూరు జిల్లా ప్రతినిధి

తహశీల్దార్ కార్యాలయాల్లో పట్టాదారు పాసుపుస్తకాల కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ అధికారుల అవినీతి అక్రమాలతో తమ భూమి రికార్డులకు భద్రత ఉందా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఉన్న మాన్యువల్ రికార్డుల స్థానంలో కంప్యూటరీకరణ చేసిన తర్వాత వాటిలో అనేక తప్పులు బయటపడ్డాయి. దీంతో సమస్యలు పెరిగాయి. రికార్డుల్లోనే భూముల వివరాలను తేడాగా నమోదు చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకరి భూమి మరొకరి పేరున చూపడంతో అనేక మంది పాసుపుస్తకాలను సకాలంలో తీసుకోలేకపోతున్నారు.

కొన్నేళ్లుగా గుంటూరు జిల్లాలో భూముల ధరలు గణనీయంగా పెరగడం వల్ల సెంటు భూమి తేడా చూపినా వాటిని సరిచేయించుకోవడానికి రూ.లక్షల్లో లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. ఒకసారి వివాదం ఏర్పడితే మళ్లీ సర్వే చేసి అధికారులు క్షుణ్ణంగా



గుంటూరు జిల్లా కారంపూడి మండలం లక్ష్మీపురంలో పొలం సర్వే వివరాల సేకరణలో అధికారులు (ఫైల్)

నివేదిక ఇస్తేగాని పాసుపుస్తకాలొచ్చే పరిస్థితి లేదు. జిల్లాలోని 57 మండల రెవెన్యూ కార్యాలయాల్లో 2,41,582 పాసుపుస్తకాల కోసం దరఖాస్తులు రాగా వేర్వేరు కారణాలతో ఇప్పటివరకూ 81,418 దరఖాస్తులను తిరస్కరించారు. 1,54,357 దరఖాస్తులు అధికారులు ఆమోదించి పాసుపుస్తకాలు జారీ చేసినట్టు అధికారులు చెబుతున్నారు. 5,513 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారులు తెలిపారు. పాసుపుస్తకాల కోసం ఇప్పటికీ విఆర్‌ఒలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్థాయిలోనే కొన్ని మండలాల్లో పెద్దఎత్తున లంచాలివ్వాల్సిన పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యను ఎన్ని ప్రభుత్వాలు ఉన్నా పరిష్కరించలేకపోతున్నారు.

పట్టాదారు పాసుపుస్తకాల రికార్డులలో తప్పులను సరిచేసేందుకు ప్రభుత్వం గతంలోనే 'మీఇంటికి మీ భూమి' పథకాన్ని రెండు విడతలుగా నిర్వహించింది. ఈ సందర్భంగా మ్యుటేషన్, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీకి ప్రభుత్వం అవకాశం కల్పించినా వేలాది మంది రైతులు మీ–సేవ ద్వారా దరఖాస్తులు చేస్తూనే ఉన్నారు. జిల్లాలో 14 లక్షల ఎకరాల సాగు భూమికి సంబంధించి 16 లక్షల మంది పేర్లను అడంగల్ వివరాలను కంప్యూటీకరించారు. జిల్లాలో ఆరున్నర లక్షల మంది రైతులకు గాను ఇప్పటివరకూ 30 శాతం మంది కూడా ఎలక్ట్రానిక్ పాస్‌పుస్తకాలు అందుకోలేకపోయారు. లంచం ఇవ్వనిదే పాసుపుస్తకం ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే రైతు పాసుపుస్తకం ఇవ్వకపోతే సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. ఆ తర్వాత తహశీల్దార్‌ను బదిలీ చేశారు. తాజాగా కారంపూడి మండలం లక్ష్మీపురంలో ఇదే తరహాలో పాస్ పుస్తకం ఇవ్వడం లేదని ఒక యువ రైతు ఆత్మహత్య చేసుకుంటానని వీడియోను జిల్లా అధికారులకు పంపడం కలకలం రేపింది. ఇలా ఎంతో మంది రైతులు లంచాలివ్వలేక, వివాదాలు పరిష్కారం కాక ఇబ్బంది పడుతున్నారు.

సంక్షిప్తం

జగన్‌ది దివాళా కోరుతనం : రామకృష్ణ

ప్రజాశక్తి–నందిగామ (కృష్ణా)

కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటిస్తే 2019 ఎన్నికల్లో బిజెపికి మద్దతిస్తానని వైసిపి అధ్యక్షులు జగన్ ప్రకటించటం దివాళా కోరుతనానికి నిదర్శనమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సిపిఐ కృష్ణాజిల్లా 24వ మహాసభలు నందిగామ రైతుపేటలోని కామ్రేడ్ సూర్యదేవర నాగేశ్వరరావు ప్రాంగణంలో మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. విభజన బిల్లు పార్లమెంటులో ఆమోదింపజేసే సమయంలో ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏపికి ఐదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇదే సందర్భంగా ఐదేళ్లు కాదు పదేళ్లు ఇస్తామని చెప్పిన బిజెపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఇంతవరకు హామీని అమలు చేయకుండా దగా చేసిందన్నారు.

భార్య హింసిస్తోందని భర్త ఫిర్యాదు

ప్రజాశక్తి – విజయవాడ

భర్త మోసం చేశాడని, చిత్రహింసలు పెడుతున్నాడని భార్య కోర్టు మెట్లెక్కడం సర్వసాధారణం. దీనికి భిన్నంగా భార్య తనను వేధిస్తోందంటూ ఓ భర్త ఫిర్యాదు చేశాడు. ఈ పిటిషన్‌ను విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం విచారణకు స్వీకరించింది. విజయవాడకు చెందిన గోగు రామ్‌కుమార్‌కు నాగజ్యోతితో గత ఆగస్టు 11న వివాహమైంది. పెళ్లయిన రెండు నెలలకే వివాదాలు మొదలయ్యాయి. "నన్ను చేసుకోవడానికి ముందే ఆమెకు పెళ్లయింది. సంతానమూ ఉన్నారు. విడాకులు తీసుకున్న విషయాన్ని గానీ, పిల్లలు ఉన్నారన్న విషయాన్ని గానీ నాకు చెప్పలేదు. ఆ విషయం అడిగినందుకు నన్ను చిత్రహింసలు పెడుతోంది. నాపై 498(ఎ) కేసు పెట్టి, రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. నేను సాధారణ మెకానిక్‌ను. అంత డబ్బు ఇచ్చుకోలేను. అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించాను" అని పిటిషన్‌లో సదరు భర్త వాపోయాడు. ఈ కేసులో తదుపరి విచారణను వచ్చేనెల 21వ తేదీన కోర్టు చేపట్టనుంది.

సంపాదకీయం

ఆకలి ఐశ్వర్యం

నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలును ఇంకా ఎలా ముందుకు తీసుకుపోవాలో నిర్ణయించేందుకు ప్రపంచ కుబేరులు, వారి రాజకీయ ప్రతినిధులు స్విట్జర్లాండ్‌లోని పర్వత ప్రాంత విడిది దావోస్‌లో కొలువుదీరుతున్న తరుణంలోనే అంతర్జాతీయ చారిటీ సంస్థ ఆక్స్‌ఫామ్ వార్షిక నివేదిక ఒక చేదు నిజాన్ని బయటపెట్టింది.. గడచిన సంవత్సరంలో ఈ విధానాల వల్ల సామాజిక అసమానతలు ఎంత భయానకంగా పెరిగిపోయిందీ ఆ నివేదిక కళ్లకు కట్టినట్లు వివరించింది. 2017లో పెరిగిన మొత్తం ప్రపంచ సంపదలో 82 శాతం కేవలం ఒక శాతంగా వున్న కుబేరుల వద్ద పోగుపడగా, 380 కోట్ల మంది అంటే ప్రపంచ జనాభాలో సగం దాకా వున్న పేదలకు ఒక చిల్లి గవ్వకూడా దక్కలేదు భారత్ విషయానికొస్తే గత సంవత్సరం ఉత్పత్తి అయిన సంపదలో 73 శాతం కేవలం ఒక శాతంగా వున్న కబేరులు వద్ద పోగుపడగా, దేశ జనాభాలో సగభాగంగా వున్న పేదలకు ఒక శాతం మాత్రమే దక్కింది. ఒక వైపు కోటానుకోట్ల మంది పేదలు కటిక దారిద్ర్యంతో అలమటిస్తుంటే, మరో వైపు కొద్ది మంది కుబేరుల వద్ద సంపద గుట్టలుగుట్టలుగా పోగుపడడానికి ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలే కారణమని ఆక్స్‌ఫామ్ నివేదిక స్పష్టంగా తేల్చి చెప్పింది. దేశం ఆర్థికాభివృద్ధి రేటు ఎంత పెరిగినా ఆ అభివృద్ధి ఫలాలు అట్టడుగున వున్న వర్గాలకు అందడం లేదు. పంపన్నులు మరింత సంపన్నులు కావడానికి, పేదలు మరింత పేదలుగా మారడానికి కారణమవుతున్న ఈ విధానాలను మార్చుకోవడానికి బదులు అవే విధానాలను మరింత జోరుగా అమలు చేయడానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పూనుకుంది. సంపన్నులకు బడ్జెట్‌లో పన్ను రాయితీలు, ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను తెగనమ్మడం వంటి చర్యలు చేపడుతూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తోంది. మరో వైపు కార్మికుల హక్కులను హరిస్తూ, వారి సమిష్టి బేరమాడే సామర్థ్యాన్ని దెబ్బతీసేలా చట్టాలను సవరిస్తోంది.

సంపన్నుల వద్ద సంపద పోగుపడడానికి వారికున్న అపారమైన తెలివితేటలు, కృషి, నష్టాలకు వెరవని తత్వమే కారణమని నయా ఉదారవాద విధాన సమర్థకులు చేసే వాదన ఎంత బూటకమో ఈ నివేదిక తేటతెల్లం చేసింది. శతకోటీశ్వరుల వద్ద పోగుపడుతున్న సంపదంతా వారసత్వం, గుత్తాధిపత్యం, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం (క్రోనీయిజం) ద్వారా సహజవనరులను కొల్లగొట్టడం, ప్రైవేటీకరణ ఒప్పందాల్లో అవినీతి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పేరుతో దోపిడీ మార్గాల ద్వారా చేకూరినదేనని తేల్చి చెప్పింది. 1995- 2014 మధ్య 91 సంపన్న, వర్ధమాన దేశాల వృద్ధి రేటు, ఉత్పాదకత పెరుగుదల రేటుతో పోల్చితే ఆయా దేశాల్లోని కార్మికుల వేతనాలు చాలా తక్కువగా వున్నాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ఇటీవలే కుండబద్దలు కొట్టింది. ఆక్స్‌ఫామ్ నివేదికతో దీనినే మరింత నొక్కి చెప్పింది. ఆర్థిక సంస్కరణల వల్ల సంపద పెరుగుతుందని, పెరిగిన ఆ సంపదలో కొంత భాగం అట్టడుగు వర్గాలకు చేరుతుందనేది నయా ఉదారవాద విధాన సమర్థకులు ముందుకు తెచ్చిన ట్రికిల్ డౌన్ సిద్ధాంత సారాంశం. వాస్తవానికి ఇప్పుడు దానికి రివర్స్‌లో జరుగుతున్నది. సంస్కరణలకు మానవీయ ముఖం, సమ్మిళిత భాగస్వామ్యంతో కూడిన అభివృద్ధి వంటి బూటకపు నినాదాలతో పాలకులు ప్రజలను ఇంకెంతో కాలం మోసపుచ్చలేరు. నయా ఉదారవాద విధానాలు అనుసరిస్తున్న చోటల్లా ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీటికి ప్రతిఘటన కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. యూరపులో గత మూడేళ్లుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే నయా ఉదారవాద విధానాలను అమలు చేసిన పార్టీలను ప్రజలు మట్టి కరిపించి కొత్త శక్తులకు పట్టం గట్టారు. భారతదేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల నిరుద్యోగం, సామాజిక అసమానతలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ విధానాల పుణ్యమాని భారతీయ కుబేరుల సంఖ్య 84 నుంచి 101కి పెరిగింది. అంబానీ, ఆదానీలతో దేశంలో ఒక శాతంగా వున్న సంపన్నుల వద్ద పోగుపడిన సంపద రూ.20 లక్షల 91 వేల కోట్లు. అంటే ఇది ఒక సంవత్సరం కేంద్ర బడ్జెట్‌కు సమానమన్న మాట! అలాగే ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక సంస్థలుగా వున్న వాల్ మార్ట్, షెల్, యాపిల్ వంటి పది బహుళజాతి కంపెనీల ఆదాయం ప్రపంచంలోని 180 దేశాల్లో ప్రభుత్వాలకు వచ్చే రాబడితో సమానం.

ఈ సంపదనంతా ప్రభుత్వాలు స్వాధీనం చేసుకుని ప్రజల సంక్షేమానికి వెచ్చిస్తే ఈ భూమండలంపై పేదరికాన్ని ఏడు సార్లు పారద్రోలవచ్చు. ప్రపంచ ప్రజలందరికీ ఉచితంగా విద్య,, వైద్యం, తాగు నీరు అందించవచ్చు. కార్పొరేట్ ప్రయోజనాలే పరమార్థంగా భావించే ఈ ప్రభుత్వాలు ఆ పనిచేస్తాయని ఆశించడం అత్యాశే అవుతుంది. ఈ పరిస్థితి మారాలంటే అసమానతలకు మూలకారణమైన నయా ఉదారవాద విధానాలను తిప్పికొట్టాలి. ప్రత్యామ్నాయ విధానాలకు పట్టం కట్టాలి.



అందరి కంచాలు లాగి
కొందరికే విందులు ...
దారిద్ర్యం పెరిగిపోయి
జనం కడుపు చిల్లులు!

తేలుకుట్టి ఎరగనట్టు
అబద్ధాల ఆరాటం...
దావోస్ వేదిక వెల్లడి
భారత్ కొక గుణపాఠం!

- కొల్లూరు వెంకట్

విశ్లేషణ

అభివృద్ధి మాటున అవినీతి!



బి తులసీదాస్



రాష్ట్ర ముఖ్యమంత్రి పదేపదే జపం చేస్తున్న అభివృద్ధి మంత్రం వెనుక గల అవినీతి కోణం రోజురోజుకు స్పష్టమవుతున్నది. శనివారం (20.1.2018) జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశ నిర్ణయాలు ఇందుకు తాజా తార్కాణం. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి అర్హత పొందిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎ.ఎ.ఐ.) టెండర్‌ను రద్దు చేశారు. భావనపాడు ఓడరేవు నిర్మాణాన్ని మోడీ అనుంగు మిత్రుడైన అదానీ సంస్థకు అప్పగించాలని నిర్ణయించారు. పోలవరం ప్రాజెక్టులో కాంట్రాక్టర్‌ను మార్చి నవయుగ కంపెనీకి కొన్ని పనులు అప్పగిస్తున్నారు. ఇలాంటి నిర్ణయాల వెనుక గల మర్మాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు.

ముడుపుల కోసమే టెండర్ రద్దు!

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పిలిచిన టెండర్‌ను పోటీ బిడ్డింగ్‌లో ఎ.ఎ.ఐ సాధించుకుంది. ఎ.ఎ.ఐతో పాటు రాష్ట్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త జి.ఎం.ఆర్ గ్రూప్ దాఖలు చేసింది. చాలాకాలం తాత్సారం చేసిన ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో టెండరును 2017 ఆగస్టులో తెరిచారు. రెవెన్యూ వాటాగా 30.2 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తా మని ఎ.ఎ.ఐ పేర్కొనగా జి.ఎం.ఆర్. 21.6 శాతం మాత్రమే ఇస్తామంది. ఐదవ తరగతి చదివిన పిల్లవాడికైనా ఎ.ఎ.ఐ ప్రతిపాదన సబబుగా ఉందని తెలుస్తుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణ పనిని ఎ.ఎ.ఐ చేపడితే అంతా పారదర్శకంగా జరుగు తుంది. ప్రాజెక్టు వ్యయాన్ని పెంచుతూ అనుబంధ ప్రతిపాదనలు చేయడం, వాటిని సర్కారుతో ఆమోదింప జేసుకోవడం ప్రయివేటు కంపెనీలకు వెన్నతో పెట్టిన విద్య. తద్వారా ప్రభుత్వంలోని పెద్దలకు, అధికార పార్టీ అనుయా యులకు అనేక 'ప్రయోజనాలు' లభిస్తాయన్నది జగద్విదితం. కాబట్టి భోగాపురం టెండరును ఎ.ఎ.ఐ నుంచి తప్పించడానికి ఈ ఐదు నెలల్లో ప్రభుత్వం సాకులు వెదికినా ఏదీ దొరకక చివరకు దాన్ని రద్దు చేసింది.

మీడియా సమాచారాన్ని బట్టి కేవలం ఎయిర్‌పోర్టుకు మాత్రమే కాక అనుబంధ పరిశ్రమలను, ఇతర వాణిజ్య కార్య కలాపాలను కలిపి కొత్త టెండరును పిలుస్తారు. అంటే టెండరు పిలిచినప్పుడే ప్రభుత్వ రంగ సంస్థలను పాల్గొన నీయకుండా సాంకేతిక ఆటంకాలను సృష్టించే అవకాశం పుష్కలంగా ఉంది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును నిర్మించి సకాలంలో అప్పగించడంలో ఎ.ఎ.ఐ సమర్థతపై అనుమానా లున్నాయని పత్రికలకు మరో లీకునిచ్చారు. దేశంలోనే అత్యాధునికమైన ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయాల విస్తరణ, ఆధునీకరణ పనులను ఎ.ఎ.ఐ స్వతంత్రంగాను, కొన్నింటిని జాయింట్ వెంచర్‌గాను చేపడుతున్నది. అంతేగాక మాల్దీవులు, యెమెన్, లిబియా, అల్జీరియా, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల్లో విమానాశ్రయాల నిర్మాణాన్ని, ఆధునీకరణను ఎ.ఎ.ఐ నిర్వహిస్తోంది. వీటన్నింటికీ సమర్థత గలిగిన సంస్థ రాష్ట్ర పాలకులకు ఎందుకు నచ్చలేదో వేరుగా చెప్పనవసరం లేదు.

> **పరిశ్రమలు, థర్మల్ ప్లాంట్లు పేరిట వేలాది ఎకరాలను ప్రయివేటుకు ధారాదత్తం చేయడం రాష్ట్రంలో కొత్త కాదు. కేవలం నెల్లూరు జిల్లాలోనే థర్మల్ విద్యుత్ కేంద్రాల కోసం అంటూ పది వేల ఎకరాలకు పైగా రిలయన్స్, లాంకో, నవయుగ తదితర కంపెనీలకు అప్పగించారు. కానీ భూముల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడం తప్ప వారు ఒక్క యూనిట్ కరెంటు కూడా ఉత్పత్తి చేయలేదు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరించిన భూమిని సంబంధిత కార్యకలాపాల కోసం అయిదేళ్ల లోపు ఉపయోగించనట్టైతే రైతులకు తిరిగి అప్పగించాలి. కాని, ప్రభుత్వం అందుకు పూనుకోవడం లేదు.**

అప్పనంగా అదానీకి....

శ్రీకాకుళం జిల్లా భావనపాడులో ఫిషింగ్ హార్బరు నిర్మాణం ప్రజల చిరకాల వాంఛ. ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో కొన్ని పనులు జరిగినా ఆ తరువాత అది ముందుకు పోలేదు. ఈ ప్రభుత్వం అక్కడ నాన్ మేజర్ పోర్టును ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యం కింద అదానీ సంస్థకు అప్పగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. తొలి 30 ఏళ్లలో 2.3 శాతం, 31 నుండి 40 ఏళ్ల మధ్య 4.6 శాతం, 41 నుండి 50 ఏళ్ల వరకు 9.2 శాతం రెవెన్యూ వాటాను ప్రభుత్వానికి చెల్లించడానికి అదానీ సంస్థ ప్రతిపాదించింది. ఆ వాటాను కొంత పెంచడానికి అంగీకరిస్తే వారికే కట్టబెట్టాలని సర్కారు నిర్ణయించింది. కొన్ని ప్రయివేటు దుకాణాలు అధిక ధరను ప్రకటించి దాంట్లో 40-50 శాతం డిస్కౌంట్ ఇస్తామని చెప్పి ప్రజలను మభ్యపుచ్చినట్లే ఈ తంతు కూడా నడుస్తుంది. పోర్టు నిర్మాణం పేరిట రెండున్నర వేల ఎకరాలను ప్రభుత్వం అదానీ సంస్థకు అప్పగిస్తుంది.

అదానీ సంస్థ అనతికాలంలోనే వేల కోట్ల రూపాయల సామ్రాజ్యాన్ని నిర్మించి విస్తరించుకున్న తీరు అందరికీ తెలిసిందే. మోడీ హయాంలో గుజరాత్ అభివృద్ధి నమూనా పేరిట వేల ఎకరాల ప్రభుత్వ భూములను చేజిక్కించుకుని వాటిలో రకరకాల వెంచర్స్ వేసి అడ్డగోలుగా కోట్లు గడించారు. ఆస్ట్రేలియాలో బొగ్గు గనుల కోసం ఎస్.బి.ఐ నుండి భారీ రుణం పొందడానికి యత్నించిన తీరు జుగుప్సాకరమైనది. ఆర్థిక అవకతవకలకు పాల్పడినందుకు అదానీ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈ.డి) నమోదు చేసిన నాలుగు కేసులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. రాజకీయ ఉపన్యాసాల్లో ఈ.డి కేసులను గురించి పదేపదే ప్రస్తావించే ముఖ్యమంత్రికి అదానీ సంస్థపై ఉన్న కేసులు ఎందుకు గుర్తుకు రావడం లేదో మరి!

పోలవరం పల్టీలు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల కాంట్రాక్టును నవయుగ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద కసరత్తు చేసినట్లు కనిపిస్తోంది. ప్రాజెక్టుకు కాఫర్‌డ్యాం అవసరమా కాదా, లేదా ఎంత ఎత్తున నిర్మించాలి వంటివి ఇంజనీర్లు తేల్చవల్సిన అంశాలు. అలాగే కాంట్రాక్టు సంస్థలు చేసిన పని, వాటికి చెల్లించవలసిన నిధులను గురించి పరిపాలనా యంత్రాంగం నిర్ణయిస్తుంది. కానీ ఈ రెండు అంశాల చుట్టూనే రాష్ట్ర ప్రభుత్వం చాలా చర్చ నడిపింది. పోలవరం ప్రాజెక్టుకు మొత్తం అయ్యే ఖర్చును చెల్లించవలసిన కేంద్ర ప్రభుత్వం దాగుడు మూతలాడుతుంటే ఆ విషయాన్ని వదిలి 'కాంట్రాక్టరును మార్చుకునే స్వేచ్ఛ మాకివ్వండి' అనే రీతిలో సాక్షాత్తూ ముఖ్యమంత్రే కేంద్ర మంత్రితో చర్చించడం అవమానకరం. ట్రాన్స్ ట్రాయ్ సంస్థ చేసిన పనుల్లో నాణ్యత లేకపోయినా, గడువులోగా చేయకపోయినా టెండర్ షెడ్యూల్‌లోని నిబంధనల మేరకు చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చు. ఇందుకు ఎవరైనా ఇంజనీర్లు, ఉన్నతాధికార్లు సంశయిస్తే ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆ చర్యలను వేగవంతం చేయాలి. కానీ ఈ సందర్భంలో అలా జరగలేదు.

ట్రాన్స్‌ట్రాయ్‌ని కొనసాగించడానికి కేంద్ర మంత్రి ప్రయత్నించారన్నది అందరికీ అర్థమవుతున్న విషయం. కేంద్రం ట్రాన్స్‌ట్రాయ్‌కి, రాష్ట్రం నవయుగకు మద్దతుగా నిలిచాయి. అందుకే పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుండి నిధులు రాబట్టడంకన్నా కాంట్రాక్టరును మార్చడమే ప్రాధాన్యతగా ముఖ్యమంత్రి 'కృషి' చేశారు. పోలవరం ప్రాజెక్టు పనులను ప్రతి వారం సమీక్షిస్తానని సిఎం ప్రకటిస్తే, కేంద్రమంత్రి రెండు వారాలకొకసారి పరిశీలనకొస్తారని మరోవైపు ప్రకటించారు. ఇలాంటి గంభీర ప్రకటనల వెనుక మర్మం కాంట్రాక్టులదే తప్ప ప్రజల ప్రయోజనాలు ఎంత మాత్రమూ కాదన్నది స్పష్టం.

ప్రజల సంపదను కొల్లగొట్టి ....

అధికారాన్ని ఉపయోగించి భూములను, ప్రజాధనాన్ని కొల్లగొట్టి సంపన్నులకు కట్టబెట్టడం, అందుకు ప్రతిఫలంగా పాలకులు ముడుపులు స్వీకరించడం గత పాతికేళ్ళుగా రాష్ట్రంలో, దేశంలో సాగుతున్న తంతు. ప్రపంచ బ్యాంకు విధానాల సారం ఇదే. పరిశ్రమలు, థర్మల్ ప్లాంట్లు పేరిట వేలాది ఎకరాలను ప్రయివేటుకు ధారాదత్తం చేయడం రాష్ట్రంలో కొత్త కాదు. కేవలం నెల్లూరు జిల్లాలోనే థర్మల్ విద్యుత్ కేంద్రాల కోసం అంటూ పది వేల ఎకరాలకు పైగా రిలయన్స్, లాంకో, నవయుగ తదితర కంపెనీలకు అప్పగించారు. కానీ భూముల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించడం తప్ప వారు ఒక్క యూనిట్ కరెంటు కూడా ఉత్పత్తి చేయలేదు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరించిన భూమిని సంబంధిత కార్యకలాపాల కోసం అయిదేళ్ల లోపు ఉపయోగించనట్టైతే రైతులకు తిరిగి అప్పగించాలి. కాని, ప్రభుత్వం అందుకు పూనుకోవడం లేదు.

ప్రజల సంపదను ప్రయివేటుకు కట్టబెట్టిన ప్రభుత్వ క్రూర పరిహాసానికి శ్రీకాకుళం జిల్లా కాకరాపల్లి థర్మల్ ప్లాంట్ మరో నిదర్శనం. రైతుల సాగులోని 2,400 ఎకరాల భూమిని ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ లిమిటెడ్‌కు గత ప్రభుత్వం అప్పగించింది. భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన ప్రజలపై కాల్పులు జరిపి మూడు ప్రాణాలను బలి తీసుకుంది. భూములను కుదువ పెట్టి ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన ఎస్.బి.ఐ. నుండి ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ అప్పు తీసుకుంది. వెయ్యి కోట్ల రూపాయలు బాకీ. అలాగే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.1400 కోట్లు బాకీ. రైతుల భూములు, ప్రజలు దాచుకున్న డబ్బు, చెల్లించిన పన్నులను ప్రయివేటు వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మళ్లించాయి. మొత్తం రూ. 2400 కోట్లు బకాయి పడిన కంపెనీపై ఇప్పుడు ఆ ప్రభుత్వ రంగ సంస్థలు దివాళా పిటిషన్ వేశాయి.

భావనపాడు పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు ఏదైనా చివరికి నెల్లూరు థర్మల్ ప్లాంట్లు లేదా కాకరాపల్లి ఈస్ట్‌కోస్ట్ కథలానే ముగిసే అవకాశం ఉంది. పోలాకి, కాకరాపల్లి విద్యుత్ కేంద్రాలు లేనందున భావనపాడు పోర్టు ప్రధాన కార్యకలాపంగా చెప్పబడిన బొగ్గు దిగుమతి జరగదు. ఇప్పటికే పెద్ద ఎయిర్‌పోర్టు, రాష్ట్రంలోనే పెద్ద నగరం విశాఖపట్నం ఉండగా భోగాపురం అభివృద్ధికి అవకాశాలు తక్కువ. కానీ రైతుల వేలాది ఎకరాల భూములు మాత్రం అదానీ, జి.ఎం.ఆర్, రిలయన్స్ వంటి వారి చేతుల్లోకి పోతాయి. ఈలోగా కోట్ల రూపాయలు చేతులు మారుతాయి. కార్పొరేట్లు - అధికార పార్టీ నాయకులు - ఉన్నతాధికార్ల కుమ్మక్కుతో జరిగే ఆశ్రిత పెట్టుబడిదారీ విధాన మర్మమిదే!

సందర్భం

నేటికీ మారని రాత



నేడు జాతీయ బాలికా దినోత్సవం

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడచినా మన దేశంలో స్త్రీల అక్షరాస్యత నేటికీ 65 శాతంగానే వుంది. భ్రూణ హత్యల దురాగతాలు ఇప్పటికీ సమాజంలో చూస్తూనే వున్నాం. ఒక గండం గడిచి తల్లి గర్భం నుండి బయటపడినా, శిశు మరణాల రూపంలో మరో గండం పొంచి వుంటోంది. నాలుగేళ్లలోపు శిశుమరణాల రేటు బాలికలలో 61 శాతం ఎక్కువగా వుంటోంది. దేశంలో సగం మంది బాలికలు యుక్త వయసుకు ముందే పెళ్లి కూతుర్లు అవుతున్నారు. ఇలా ఎన్నో రకాలుగా భారత స్త్రీలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను రూపుమాపేందుకు 2008 నుండి జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం.

ప్రపంచంలో జరుగుతున్న మొత్తం బాల్య వివాహాలలో 40 శాతానికి పైగా మన దేశంలోనే జరుగుతున్నాయని ఐక్యరాజ్య సమితి బాలల నిధి సంస్థ (యునిసెఫ్) వెల్లడించింది. దేశంలోని 19 ఏళ్ల బాలికల్లో 41 శాతానికి పైగా ఇప్పటికే బాల్య వివాహాల కోరల్లో చిక్కుకున్నారు. తెలుగు రాష్ట్రాలలో కూడా ఇలాగే వుంది. పదిహేనేళ్లు దాటిన బాలికలలో 15.47 శాతం వధువులుగా మారిపోతున్నారు. పేదరికం, అవిద్య తాండవించే రాష్ట్రాలతో పాటు, అత్యధికంగా విద్యావంతులు వుండే కేరళ రాష్ట్రంలోనూ బాల్య వివాహాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ స్థితికి రావడానికి ఆర్థిక, సామాజిక స్థితులే ముఖ్య కారణాలుగా చెప్పవచ్చు. బాల్య వివాహాలను కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణతో కదలాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఏనాడో 1872 నాటి బాల్య వివాహ నిరోధక చట్టం మొదలు పలురకాల చట్టాలు మన దేశంలో వచ్చాయి. సమగ్ర బాలల సంరక్షణ పథకం, జాతీయ శిశు పరిరక్షణ పథకాల నుంచి ఇటీవల కళ్యాణ లక్ష్మి వరకు అనేక కార్యక్రమాలు బాలికల కోసం రూపుదిద్దుకున్నాయి. గ్రామాల నుండి రాష్ట్ర స్థాయి వరకు పోలీసు, రెవిన్యూ, స్త్రీ శిశు సంక్షేమం వంటి వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు కొన్ని స్వచ్ఛంధ సంస్థలు, బాలికలను ఆదుకునేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నాయి. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు కనపడటం లేదు. మన దేశంలో బాల్య వివాహాలను రూపుమాపటానికి మరో అయిదు దశాబ్దాలు పడుతుందని యునిసెఫ్ నివేదికలు తెలుపుతున్నాయి. రెండు దశాబ్దాలుగా దేశంలో బాల్య వివాహాలు ఏటా ఒక్కో శాతం తగ్గడమే అందుకు దాఖలా అని ఆ సంస్థ చెబుతోంది. ఈ దురాచార నిర్మూలనకు బాలికలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్థితిపై వాస్తవిక అంచనాలతో పాలకులు ఇప్పటికైనా సరైన కార్యాచరణను చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం బడిలో చేరుతున్న ప్రతి పది మంది బాలికలలో ముగ్గురు మాత్రమే ఎనిమిదవ తరగతి వరకు చదువుకోగల్గుతున్నారు. కొన్నేళ్లుగా పాఠశాలలో పేర్లు నమోదు చేసుకుంటున్న ఆడపిల్లల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అదే సమయంలో మధ్యలో చదువు మానేస్తున్న బాలికల సంఖ్య ఆందోళనకర స్థాయికి చేరింది. 45 శాతం బాలికలు అయిదో తరగతికి ముందే బడి మానేస్తున్నారు. పదో తరగతి పూర్తి చేసుకుంటున్న ఆడపిల్లల సంఖ్య పది మందిలో ఒక్కరైనా ఉండటం లేదని 'టాటా సామాజిక శాస్త్రాల సంస్థ' (టిస్) అధ్యయనం చెప్తుంది. ఒక బాలికకు చదువు చెప్పడం అంటే దేశానికి విద్యా బుద్ధులు నేర్పడమే. అందుకే బాలికా విద్యకు ఎదురవుతున్న అవరోధాలు తొలగించడం ఎంతో అవసరం. మహిళ స్థితిగతులను బట్టి ఒక దేశ పరిస్థితిని అంచనా వేయవచ్చు. వివిధ ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు భారత్ పరిస్థితి దయనీయంగా వుంది. ప్రపంచంలోని శక్తిమంతమైన దేశాలలో భారత్‌ను ఒకటిగా చెప్పుకుంటారు. కాని మానవాభివృద్ధి సూచిలో భారత్ ఎక్కడో అట్టడుగున నిలిచింది. దేశంలో ఆదాయాలు పెరుగుతున్నాయి. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరుగుతోంది. కానీ దేశంలో ఇప్పటికీ భ్రూణ హత్యలు, మాతా శిశు మరణాలు మాత్రం తగ్గడం లేదు. అందుకే వ్యవస్థలో మార్పు తీసుకురావాల్సిన అవసరం పాలకులకు ఎంతైనా వుంది. వచ్చే దశాబ్దానికైనా మన దేశంలో మార్పు వస్తుందని ఆశిద్దాం.

జొన్నల నాగిరెడ్డి,
(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
సెల్ : 9290092575)

జన వాక్యం

వైద్యులు సరే, పరికరాల మాటేంటి?



ప్రభుత్వ వైద్యశాలల్లో అనుభవజ్ఞులైన డాక్టర్లు అందుబాటులో వున్నా వ్యాధి నిర్ధారణకు వాడవలసిన లాబొరేటరీ పరికరాలు తగినన్ని వుండడం లేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లోని రోగులకు కూడా రక్త పరీక్షలు, ఎక్స్-రేలు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈ సౌకర్యాల లేమి వల్లే ప్రభుత్వాసుపత్రులంటే ప్రజలకు భయం పట్టుకుంది. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి. అప్పుడే రాష్ట్ర, దేశ స్థితిగతులు మార్పు చెందుతాయి.

ఎస్ ఎస్ కుమార్,
ఇమెయిల్ ద్వారా


వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

లౌకికత్వం అంటే ఎందుకంత కోపం?

ఆర్ రాజేశమ్

కేంద్రమంత్రి అనంత్ కుమార్ హెగ్డే ఇటీవల కర్నాటకలో ఒక సమావేశంలో రాజ్యాంగం పట్ల, రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకికత్వం పట్ల అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ అధికారం లోకి వచ్చిందే రాజ్యాంగాన్ని మార్చడానికి. కాబట్టి ఖచ్చితంగా రాజ్యాంగాన్ని మార్చి తీరుతామని వ్యాఖ్యానించారు. దేశ ప్రజల మధ్య మతపరమైన వైషమ్యాలను రెచ్చగొట్టి.. తమ స్వార్థ రాజకీయాలు కొనసాగించడమే పనిగా పెట్టుకున్న సంఘ పరివార్ నేతలు.. ఇలా రాజ్యాంగం గురించి, రాజ్యాంగ మౌలిక విషయాల గురించి అభ్యంతరకరంగా మాట్లాడటం.. ఇది మొదటిసారి కాదు. చివరిసారీ కాబోదు. ప్రజల్లో తాము ఎక్కించదలుచుకున్న మతోన్మాద భావజాలం ఎంతమేరకు ఎక్కిందోనని అప్పుడప్పుడు పరిశీలించడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపికి చెందిన నేతలందరూ ఇలా బాధ్యతారహితంగా వ్యాఖ్యలు చేసి.. ప్రజలు నిలదీస్తే అప్పుడు సమయా నుకూలంగా పైపై క్షమాపణలతో తప్పించుకునే కళలో సిద్ధహస్తులే. రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తూ గద్దెనెక్కిన ఒక కేంద్రమంత్రి.. రాజ్యాంగం గురించి, రాజ్యాంగ మౌలిక అంశాల గురించి ఇంత హీనంగా మాట్లాడడం సంఘ పరివార్ రాజకీయాల్లోనే సాధ్యం. నిజానికి కాషాయ నేతలకు రాజ్యాంగంలో నచ్చని వాటిల్లో ప్రధానాంశం సెక్యులరిజమే. తమ మతోన్మాద రాజకీయాలకి అడుగడుగునా అడ్డంకి కల్పిస్తున్నది సెక్యులరిజమే కాబట్టి.. దాని మీదే విరుచుకుపడుతున్నారు వీళ్లంతా.

మోడీ ప్రభుత్వం గద్దెనెక్కాక జరిగిన మొట్టమొదటి గణతంత్ర దినోత్సవాల సందర్భంగా.. 2015 జనవరి 26న ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో చూపెట్టిన రాజ్యాంగ పీఠికలో 'సోషలిజం, సెక్యులరిజం' అనే పదాలను మాయం చేశారు. గణతంత్ర దినోత్సవం రోజునే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన మోడీ ప్రభుత్వ తీరును.. దేశ ప్రజలందరూ నిరసించారు. మోడీ తరపున వకాల్తా పుచ్చుకున్న వారు.. 1956లో స్వీకరించిన రాజ్యాంగ పీఠికలో సోషలిజం, సెక్యులరిజం పదాలు లేవంటూ దబాయించారు. 1976లో రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పదాలను ఇరికించారని.. సెక్యులరిజాన్ని రాజ్యాంగంలో చేర్చడం అంబేద్కర్ కి కూడా ఇష్టం లేదని సంఘ పరివార్ నేతలు ప్రచారం చేస్తుంటారు. రాజ్యాంగ పీఠికలో మార్పులు తీసుకొచ్చింది.. ఇందిరాగాంధీ హయాంలో జరిగిన 42వ రాజ్యాంగ సవరణేనన్నది వాస్తవమే. అయితే..నేడు మనువాదులు ప్రచారం చేస్తున్నట్లుగా రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశంలో సెక్యులరిజం అనే భావన నిజంగా లేదా?



లౌకికవాదపు ఆదర్శాల పరిధిలో భారత దేశం నడుచుకోవాలని నాటి నేతలు తలపోయలేదా?

భారత రాజ్యాంగం పౌరులకు అందించిన ప్రాథమిక హక్కుల్లో మొట్టమొదటి హక్కే సమానత్వపు హక్కు. ఆర్టికల్ 15 ప్రకారం.. కుల, మత, ప్రాంత, లింగ భేదాలు లేకుండా.. దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు ఉంటాయని స్పష్టీకరించినపుడు అది సెక్యులరిజం కాక మరేమవుతుందో.. ఆరెస్సెస్ నేతలే తేల్చి చెప్పాలి. రాజ్యాంగ పీఠికలో.. మొదట్లో సెక్యులరిజం అనే పదం చేర్చక పోవడానికి ప్రధాన కారణం.. రాజ్యాంగంలోని అన్ని నిబంధనల్లోనూ సెక్యులరిజం స్ఫూర్తి నిండి ఉండడమే. రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకున్న నెహ్రూ, పటేల్, అంబేద్కర్ అందరి ఏకాభిప్రాయమది. దురదష్టవశాత్తు స్వాతంత్ర్యోద్యమ నేతల రాజ్యాంగ స్ఫూర్తి నేడు గద్దెనెక్కిన మతోన్మాద నాయకుల తలకెక్కడం లేదు. అది విషాదం!

నరేంద్రమోడీ దేశ ప్రధానిగా మొదటి సారి 2015 లో ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రసంగంలో 'వసుధైవ కుటుంబకం అనే భావన జన్మించిన దేశం నుండి నేనొచ్చాను..' అని గొప్పగా ప్రసంగించారు. మోడీని మెచ్చుకుంటూ ప్రపంచ నేతలందరు చప్పట్లు కొట్టారు. మరోవైపు ఆయన అనుచర గణం దేశంలో కుల సమావేశాలకు ముఖ్య అతిథులుగా హాజరవుతూ 'ప్రజలందరూ ఐకమత్యంతో ఉండకండి.. కులాలవారీగా ..మతాల వారీగా విడిపోండి.. అదే మీ ఐడెంటిటీ' అంటూ బోధిస్తారు. ఇదేం తమాషా?

మొన్న ఢిల్లీ వీధుల్లో "యువ హుంకార్ ర్యాలీ" జరిగింది. మీరు మనుస్మతిని అనుసరిస్తారా.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అనుసరిస్తారా.. తేల్చి చెప్పండంటూ.. జిగ్నేష్ మవానీ, కన్నయ్య కుమార్, షీలా రషీద్.. వంటి యువనేతలు మోడీని నిలదీశారు. 'మీరేమో అంబేద్కర్ అనుచరుడినంటూ గొప్పలు పోతారు.. మీ అనుచరగణమేమో మనుస్మ తిని పాటించండంటూ ప్రచారం చేస్తున్నారు.. ఇందులో ఏది వాస్తవం?' అంటూ మోడీని ప్రశ్నించారు. యువతకు సమాధానం చెప్పలేని మోడీ.. పోలీసులను ఉపయోగించి, హుంకార్ ర్యాలీని భగ్నం చేసి అప్పటికి తప్పించుకున్నారు.

ఆరెస్సెస్ మొదటి నుండి భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించింది. స్వతంత్ర భారత రాజ్యాంగం.. మను ధర్మ సూత్రాలకు అనుగుణంగా ఉండాలంటూ డిమాండ్ చేసింది. 26 నవంబరు 1949న దేశ రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని స్వీకరించిన తరువాత.. 30 నవంబరు 1949 సంచికలో ఆరెస్సెస్ అధికార పత్రిక ఆర్గనైజరు భారత రాజ్యాంగాన్ని తూలనాడుతూ ఇలా రాసింది: 'భారత దేశానికి ఇప్పుడు కొత్తగా రాజ్యాంగం రాయాల్సిన అవసరం లేదు. ప్రాచీన కాలంలో మనువు రాసిన సూత్రాలు ఉన్నప్పటికీ రాజ్యాంగంలో వాటి ప్రస్తావనే లేకపోవడం పెద్ద అపరాధం. ప్రపంచానికే ఉత్తేజంతో దారి చూపగల ఆరాధన పూరితమైన మను ధర్మ శాస్త్రం.. అంబేద్కర్‌కూ, రాజ్యాంగ పండితులకూ గుర్తు కూడా రాలేదు'.

భారత జాతి మతం పేరుతో చీలి పోవడమే.. బ్రిటిష్ వాడి వలసవాదానికి సహకరించి, రెండు వందల యేళ్ళ దాస్యానికి కారణమైందని గుర్తించిన స్వాతంత్ర్య ఉద్యమ నేతలు.. మొదటి నుండీ మతాతీత రాజ్యాంగ వ్యవస్థ పట్ల ఒక స్పష్టమైన దక్పథాన్ని కలిగి ఉన్నారు. 1917 లో కలకత్తాలో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభల్లో రవీంద్రనాథ్ టాగూర్ తన 'గీతాంజలి' కవితను చదివి వినిపించాడు. 'ఎక్కడ దేశ ప్రజలు సగర్వంగా తలెత్తుకుని నిలబడగలరో.. ఎక్కడ సంకుచితత్వపు గోడల కారణంగా ప్రపంచం ముక్కలు ముక్కలుగా విడిపోదో.. ఆ మహోన్నత స్వర్గంలోకి నా దేశాన్ని నడిపించు ప్రభూ..' అన్న టాగూర్ కవిత్వ భావనను నాటి రాజకీయ నాయకులందరూ తమ రాజకీయ సంకల్పం గా స్వీకరించారు. గాంధీ, నెహ్రూ, పటేల్, ఆజాద్, అంబేద్కర్ తో సహా.. స్వాతంత్రోద్యమ నేతలందరూ స్వతంత్ర భారతాన్ని లౌకికత్వపు సమైక్యతా సూత్రమే ముందుకు నడిపిస్తుందని దఢంగా విశ్వసించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనని వారికి.. బ్రిటిష్ రాణికి క్షమాభిక్ష పత్రాలు సమర్పించి లొంగిపోయిన వారికి.. 'బ్రిటిష్ వారితో పోరాడ్డం మా లక్ష్యం కాదు.. మత రాజకీయాలే మా పరమావధి' అంటూ ప్రకటించిన వారికి..నేడు గద్దెనెక్కిన వారి వారసులకి.. స్వాతంత్రోద్యమ భావనలు ఎలా ఒంటబడతాయి?!

(రచయిత సెల్ : 9440443183)



నలుగురు కూర్చున్నప్పుడు రేగిపళ్ల ప్రస్తావన తేగానే.. నోరూరిపోతూ ఉంటుంది.. చిన్నప్పటి జ్ఞాపకాలు చుట్టుముట్టేస్తాయి. బుట్టెడు పళ్లు తెచ్చి పదుగురిలో పెడితే.. క్షణాల్లో హాంఫట్ అయిపోతాయి. రేగిపళ్లలో కమ్మని రుచే కాదు; వాటిలో బోలెడు పోషకాలూ ఉన్నాయంటున్నారు ఆహార నిపుణులు. అలాంటి రేగిపళ్లతో వడియాలు పెడితే... వేగించే పనిలేకుండానే పటపటమంటూ పంటికింద నలిగిపోతాయి. ఇంకా పచ్చడి, జామ్, పట్టీ, ఊరగాయ, ఓట్స్‌మీల్స్ పాటోళీ కూడా తయారు చేయొచ్చు. రేగిపళ్లతో టీ పెట్టుకుంటే... సిప్ సిప్‌కీ సూ..పర్ అనాల్సిందే. మరి రేగిపళ్లతో చేసుకునే వెరైటీలేంటో తెలుసుకుందాం పదండి..

రేగిపండు.. రుచులు పండు





ఊరగాయ

కావల్సిన పదార్థాలు : రేగిపళ్లు – కప్పు, కారం – పావుకప్పు, మెంతులు – ఒకటిన్నర చెంచా, ఆవాలు – ఐదు చెంచాలు, శనగపప్పు, మినపప్పు – రెండు చెంచాల చొప్పున, నూనె – ముప్పావు కప్పు, ఇంగువ – అరచెంచా, ఉప్పు – తగినంత.

తయారుచేసే విధానం : పాన్‌లో రెండు చెంచాల నూనె వేడిచేసి మినపప్పు, శనగపప్పు, ఆవాలూ, మెంతులూ వేయించుకుని పెట్టుకోవాలి. ఇవి చల్లారాక మిక్సీలో వేసి, మెత్తగా పొడి చేసుకోవాలి. పాన్‌లో మిగిలిన నూనె వేడిచేసి, ఇంగువ వేసి దింపేయాలి. ఇందులోనే కారం, తగినంత ఉప్పు ముందుగా చేసిపెట్టుకున్న పొడి, కడిగి తుడిచి అక్కడక్కడా గాట్లు పెట్టుకున్న రేగుపళ్లూ వేసి కలపాలి. ఐదారుగంటలయ్యాక మరోసారి కలపాలి. దీనిని పొడి సీసాలో పెట్టి భద్రపరచుకోవాలి. ఇక నోరూరించే ఊరగాయ వేడివేడి అన్నంతో తినడమే ఆలస్యం.

రోగనిరోధకశక్తిని పెంచుతుంది

రేగిపండ్లు అధిక రక్తపోటుగలవారికి చాలా మంచివి. వీటిలో పొటాషియం అధికంగా ఉంటుంది. విటమిన్–సి కూడా ఉంటుంది. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.



డాక్టర్ జానకి బడుగు
ప్రముఖ పోషకాహార నిపుణులు



టీ


తయారు చేసే విధానం :
అరచేతి పరిమాణంలో రేగిపళ్లు తీసుకుని, వాటిని నీటిలో వేసి బాగా మరిగించాలి. పావు గంటపాటు మరిగిన తర్వాత దానిని వడకట్టాలి. దానికి రుచి కోసం తేనెగానీ, పంచదారగానీ కలపాలి. అంతే రేగుపళ్లతో టీ రెడీ!

పట్టీ

కావల్సిన పదార్థాలు : రేగిపళ్లు – రెండు కప్పులు, నెయ్యి– రెండు టేబుల్ స్పూన్లు, చక్కెర– ఆరు టీ స్పూన్లు, బాదం, జీడిపప్పు– టీ స్పూను చొప్పున.

తయారుచేసే విధానం : రేగిపళ్లల్లో విత్తనాలను తీసేసి, చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. తర్వాత పాన్‌లో నెయ్యి పోసి, వేడెక్కాక రేగిపళ్ల ముక్కలను వేసి ఐదు నిమిషాలు వేగించాలి. ఆ తర్వాత చక్కెర, నేతిలో వేగించిన బాదం, జీడిపప్పు వేయాలి. చక్కెర పూర్తిగా కరిగేదాకా వేగించి, దించేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక పెద్దప్లేటులో సమానంగా పోసి, చల్లార్చిన తర్వాత ముక్కలుగా కట్ చేసుకోవాలి.





ఓట్స్‌మీల్

కావల్సిన పదార్థాలు : 2 కప్పుల మంచినీరు, 1/2 టేబుల్ స్పూన్ సాల్ట్ (అవసరమైతే), కప్పు ఓట్స్, అరకప్పు రేగి కాయలు (ముక్కలుగా తరిగినవి), అరకప్పు కోరింద కాయలు (రాస్‌బెర్రీస్), మూడు టేబుల్ స్పూన్ల జనపనార విత్తనాలు. పావుకప్పు బాదం పలుకులు

తయారు చేసే విధానం : చిన్నపాత్రలో నీరు, ఉప్పు కలిపి మరిగించాలి. దానిలో ఓట్స్ వేసి 10–15 నిమిషాలు సిమ్‌లో ఉడకనివ్వాలి. బాగా ఉడికిన తర్వాత ముక్కలుగా తరిగిన రేగి కాయలు, కోరింద కాయలు, జనపనార విత్తనాలు వేసి కలపాలి. బయటకు తీసిన తర్వాత చివరగా బాదం పలుకులు ఓట్స్ ఆహారం పై జల్లాలి. మీకు ఇష్టమైన రేగిపళ్ల ఓట్స్‌మీల్ రెడీ !

వడియాలు

కావల్సిన పదార్థాలు : రేగిపళ్లు– పావుకిలో, పచ్చిమిర్చి– ఆరు, బెల్లం తురుము– నాలుగు టేబుల్ స్పూన్లు, జీలకర్ర– టేబుల్ స్పూన్, ఇంగువ– చిటికెడు, ఉప్పు– తగినంత.

తయారుచేసే విధానం : రేగిపళ్లల్లో విత్తనాలు తీసేసి (కావాలంటే ఉంచవచ్చు), గుజ్జు చేసుకుని పక్కనపెట్టుకోవాలి. పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు, ఇంగువ, బెల్లం తురుములను మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. దీంట్లో రేగిపండ్ల గుజ్జు కూడా వేసి బాగా కలిపి, చిన్నచిన్న అప్పాలుగా చేసుకొని రెండు రోజులు ఎండబెట్టుకోవాలి. అన్నం తినేటప్పుడు వీటిని నూనెలో వేగించుకున్నా, అలాగే తిన్నా చాలా బాగుంటాయి.



జామ్



కావల్సిన పదార్థాలు : రేగిపళ్లు – 1/4 కిలో, ఎర్రమిరప కారం – టేబుల్‌స్పూన్, బెల్లం – 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు – సరిపడా

తయారుచేసే విధానం: రేగిపళ్లని బాగా కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. ఒక పాత్రలో పైన పేర్కొన్న పదార్థాలన్నీ వేసి చేతితో బాగా కలపాలి. రేగు పళ్లు నుంచి లోపలి పదార్థం బయటకు వచ్చేలా చూడాలి. మొత్తం అంతా కలిసి జామ్‌లా మారుతుంది. దానిని గాజు సీసాలో వేసి, ఫ్రిజ్‌లో నిల్వచేయాలి. దీనిని స్నాక్‌గానూ వాడుకోవచ్చు.

రేగిపళ్లు కొంచెం పుల్లగా, వగరుగా ఉంటాయి. అందువల్ల అదనంగా అవసరాన్ని బట్టి రెండు స్పూన్ల బెల్లాన్ని కలుపుకోవచ్చు. తయారీకి కావలసిన పదార్థాల మోతాదు మీ రుచికి అనుగుణంగా మార్చుకోవచ్చు. విత్తనాలు పూర్తిగా తొలగించి జామ్‌ని ఫ్రిజ్‌లో నిల్వచేయాలి. లేకపోతే వాటి నుంచి మొలకలు రావడం, బూజుపట్టడం వంటి సమస్యలు రావొచ్చు.

పాటోళి

కావల్సిన పదార్థాలు : గింజలు తీసేసి మరీ మెత్తగా కాకుండా చేసిన రేగిపళ్ల ముద్ద – రెండు కప్పులు, కందిపప్పు – ఒకటిన్నర కప్పు, ఆవాలు – రెండు చెంచాలు, శనగపప్పు, మినప్పప్పు – ఐదు చెంచాలు, కరివేపాకు రెబ్బలు – రెండుమూడు, ఉప్పు – సరిపడా, నూనె – కప్పు, ఎండుమిర్చి – ఆరు, పచ్చిమిర్చి – ఆరు, కొబ్బరి కోరు – రెండు చెంచాలు.

తయారుచేసే విధానం : ముందుగా కందిపప్పును నానబెట్టుకుని నీటిని వంపేయాలి. తడి లేకుండానే పొడిపొడిగా మెత్తగా రుబ్బుకోవాలి. ఇప్పుడు పాన్‌లో పావుకప్పు నూనె వేడిచేసి, ఆవాలూ, మినప్పప్పూ, శనగపప్పూ, ఎండుమిర్చీ వేసి వేయించాలి. ఆ తరవాత పొడుగ్గా తరిగిన పచ్చిమిర్చీ, కరివేపాకు రెబ్బలూ వేసి వేయించాలి. రెండు నిమిషాలయ్యాక రేగిపళ్ల ముద్ద వేయాలి. కాసేపటికి అదీ మగ్గుతుంది. అందులో సరిపడా ఉప్పు, కొబ్బరికోరు వేసి, బాగా కలపాలి. ఆ తర్వాత కందిపప్పు ముద్దనూ వేయాలి. మంట తగ్గించి, మధ్యమధ్య నూనె వేస్తూ కలుపుతూ ఉండాలి. కాసేపటికి కందిపప్పు మిశ్రమం కూడా వేగి, కమ్మని వాసన వస్తుంది. అప్పుడు దింపేయాలి. ఇది అన్నంలోకీ, రొట్టెల్లోకీ చాలా బాగుంటుంది.



జీవన సౌరభం

వినడానికి కటువుగా ఉన్నా.. మీ గురించి వాస్తవాలు చెప్పేవారి సలహాలు తీసుకోండి.

ఆమె చదువుకి శ్రమే పునాది!

శ్రమించకుండా ఏదీ సాధ్యం కాదు. అలాగే చదువు కూడా. అయితే ఇక్కడ ఆమె చదువులో మాత్రమే శ్రమించడంలేదు. తన జీవనోపాధి కోసం శ్రమిస్తూనే.. మరోవైపు పిహెచ్‌డీ వంటి ఉన్నతవిద్య కోసం కష్టపడుతోంది. కష్టపడే మనస్తత్వం ఉంటే చాలు లక్ష్యసాధన దిశగా ముందుకు అడుగులు పడతాయని ఆమె రుజువు చేస్తోంది. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సరే నిర్దిష్ట లక్ష్యం కళ్ల ముందు కదులుతున్నప్పుడు ఆ అవాంతరాలూ గడ్డిపోచలుగా మారిపోతాయి. లక్ష్యసాధనకు అవి అడ్డు కావు. సరిగ్గా ఇలా అనుకుంది కాబట్టే ఆ యువతి తన లక్ష్యం కోసం చాలా కష్టపడుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్లాసులకు హాజరవుతుంది. సాయంత్రం జీవనోపాధి కోసం పరోటాలు అమ్ముతుంది. ఆమె గురించి తెలుసుకోవాలంటే కేరళ వెళ్లాల్సిందే..

ఆమె పేరు స్నేహ లింబ్గా ఓంకార్. వయసు 28 ఏళ్లు. మహారాష్ట్రకు చెందిన ఈమె కేరళ రాష్ట్రం త్రివేండ్రంలోని కేరళ యూనివర్సిటీలో బయో ఇన్ఫర్మేటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్‌గా విద్యనభ్యసిస్తోంది. ఈ క్రమంలోనే రెండేళ్లు పూర్తయ్యాయి. తనకు వచ్చే స్కాలర్‌షిప్‌తో చదువుకునేది. అయితే ఈసారి యూనివర్సిటీ ఇవ్వాల్సిన ఫెలోషిఫ్ మాత్రం ఇంకా అందలేదు. దీనికితోడు కుటుంబ ఆర్థికపరిస్థితీ అంతంత మాత్రమే. ఇంటి నుంచి డబ్బులు వచ్చే పరిస్థితి ఎంతమాత్రమూ లేదు. కానీ ఎలాగైనా రీసెర్చ్ పూర్తిచేయాలని భావించిన లింబ్గా ఓంకార్ స్వయం ఉపాధి చూసుకుంది. తనకు పరోటాలు చేయడం బాగా వచ్చు. కనుక సాయంత్రం పూట యూనివర్సిటీ వద్దే పరోటాలను చేసి, అమ్మడం ప్రారంభించింది.

తన దినచర్యలో భాగంగా ప్రతిరోజూ ఓంకార్ ఉదయం యూనివర్సిటీలో రీసెర్చ్ వర్క్ చేస్తుంది. ఇక సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకూ పరోటాలు చేసి, విక్రయిస్తుంది. ఇలా ఓ వైపు చదువు, మరోవైపు పనితో ఆమె కాలం వెళ్లదీస్తోంది. అయితే ఈమె గురించి తెలిసిన కొందరు యూనివర్సిటీ స్టూడెంట్స్ అక్కడికే వచ్చి పరోటాలను తింటూ ఆమెకు గిరాకీ పెంచుతున్నారు. ఇక స్టూడెంట్స్‌తోపాటు చుట్టుపక్కల కంపెనీల్లో పనిచేసే ఐటీ ఉద్యోగులూ ఓంకార్ పరోటా సెంటర్‌కే వస్తున్నారు. అయితే కొందరు ఆమెకు సాయం చేస్తామని ముందుకొచ్చారు. అయినా ఆమె సున్నితంగా నిరాకరించింది. తనకు ఆయాచితంగా వచ్చిన డబ్బు అక్కర్లేదని, కష్టపడి పనిచేస్తానని చెబుతోంది. అలా వచ్చిన డబ్బుతోనే ఎలాగైనా పీహెచ్‌డీ పూర్తిచేస్తానని ధీమాగా ఓంకార్ చెబుతోంది. ఆమె లక్ష్యం నెరవేరాలని మనమూ ఆశిద్దాం. ★





మీ కోసం



చికెన్ వేయించేటప్పుడు పాలపొడిలో అద్ది వేయించితే మంచి రంగు వస్తుంది.

కళ్లద్దాల మచ్చలా?

కళ్లద్దాలు పెట్టుకునే ఎక్కువమందికి ముక్కుకి ఇరువైపులా మచ్చలు పడుతుంటాయి. ముఖంలో ఆ మచ్చలు చాలా పెద్దగా కనబడతాయి. వాటివల్ల చాలామంది నలుగురిలోకి వెళ్లాలంటే ఇబ్బందిగా భావిస్తుంటారు. అందుకే వాటిని నివారించేందుకు కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

కలబంద: రాత్రిపూట కలబంద గుజ్జును ముక్కుకురాసి, మర్దన చేసి పడుకోవాలి. మర్నాడు గోరువెచ్చటి నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల ఆ మచ్చలు పోతాయి.

నిమ్మరసం: సహజ బ్లీచింగ్ గుణాలు నిమ్మరసంలో అధికం. నాలుగు చెంచాల నిమ్మరసంలో అరచెంచా నీళ్లు కలిపి అందులో దూది ఉండల్ని వేయాలి. కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి తీశాక ఆ ఉండల్ని ముక్కు మీద మచ్చలున్నచోట, కళ్ల అడుగున రాసుకోవాలి. కాసేపటికి చల్లటినీళ్లతో కడిగేసుకోవాలి.

కీరా: ఈ రసాన్ని మచ్చలున్న చోట రాసుకోవాలి. లేదంటే దూదిని ముంచి, మచ్చలున్నచోట కాసేపు పెట్టుకున్నా చాలు.. ఆ ప్రభావం మచ్చల మీద పడి త్వరగా పోతాయి.

టమాటా: కళ్లద్దాల తాలూకూ మచ్చల్ని పోగొట్టడానికి టమాటాలు చక్కగా ఉపయోగపడతాయి. ఈ ముక్కల్ని మెత్తగా చేసి ఆ గుజ్జును మచ్చల మీద పూతలా వేయాలి. తర్వాత కడిగేస్తే అవి క్రమంగా పోతాయి. అలానే టమాటారసంలో కీరా, బంగాళాదుంప రసాలు కలిపి రాసుకున్నా ఈ మచ్చల్ని పోగొట్టొచ్చు. ★



తల్లిలాంటి వెల్లుల్లి

పరగడుపునే వెల్లుల్లి తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఎప్పటికప్పుడు పరిశోధనలు రుజువు చేస్తూనే ఉన్నాయి. తల్లి తన బిడ్డలను ఏవిధంగా కాపాడుకుంటుందో వెల్లుల్లీ అలాగే అనేక రోగాలబారి నుంచి మనల్ని బయటపడేస్తుంది.

- ఇది నాచురల్ యాంటీ బయాటిక్‌గా పనిచేస్తుంది. అల్పాహారం తినకముందే రెండు వెల్లుల్లిపాయల్ని తింటే కడుపులోని చెడు బ్యాక్టీరియా నశిస్తుంది. పొద్దున్నే తినడం వల్ల వెల్లుల్లికి ఈ శక్తి ఎక్కువ.
- అధిక రక్తపోటు కలిగిన వాళ్లకు వెల్లుల్లి దివ్యౌషధం. రోజూ క్రమం తప్పకుండా తింటే హైబీపీ నియంత్రణలో ఉంటుంది.
- కాలేయం, పిత్తాశయం పనితీరును మెరుగుపరిచే రసాయనాలు వెల్లుల్లిలో ఉన్నాయి. కడుపులోని సమస్యల్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా జీర్ణప్రక్రియల్ని చురుగ్గా ఉంచడంతోపాటు వ్యర్థాలను బయటికి పంపే ప్రక్రియకు దోహదపడుతుంది వెల్లుల్లి. ఆకలినీ పెంచుతుంది.
- మానసిక ఒత్తిళ్లు, డిప్రెషన్, గ్యాస్ట్రిక్ సమస్యలకు చక్కటి విరుగుడు. కొన్నిరకాల క్యాన్సర్ల నిరోధానికీ బాగా పనిచేస్తుంది.
- న్యుమోనియా, ఆస్తమా, దగ్గు, బ్రాంకైటిస్, లంగ్ ఇన్‌ఫెక్షన్స్ వంటి వాటికి అడ్డుకట్ట వేస్తుంది. టీబీ బాధితులూ తప్పనిసరిగా వెల్లుల్లిని తింటే మంచిది.



వెల్లుల్లితో ఇన్నేసి ఉపయోగాలు ఉన్నప్పటికీ, కొందరికి ఇది తింటే పడదు. చర్మం మీద అలర్జీ వస్తుంది. ఇంకొందరికి శరీరం ఉన్నట్లుండి వేడి చేస్తుంది. తలనొప్పి వస్తుంది. ఇటువంటి వాళ్లు వెల్లుల్లిని తినకుండా ఉండటమే ఉత్తమం. ★

సెన్సెక్స్ ⬆ 342
36,139

నిఫ్టీ ⬆ 117
11,083

రూపాయి ⬇ 09 పై.
అమెరికా డాలరుకు రూ.
63.78



బిఐఎఎల్‌తో బిఎండబ్ల్యు ఒప్పందం..
బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (బిఐఎఎల్)తో బిఎండబ్ల్యు ఇండియా ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ముఖ్యమైన వ్యక్తులు ఆ ఎయిర్‌పోర్టులో టెర్మినల్-ఎయిర్‌క్రాఫ్టు మధ్య బిఎండబ్ల్యు వాహనాలను ఉపయోగించుకోవచ్చు. ఈ ఎయిర్‌పోర్టు నుంచి ప్రతీ రోజు 80,000 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.



దావోస్‌లో బాబు, జయదేవ్..
దావోస్‌లో జరుగుతున్న వాల్డ్ ఎకనామిక్ ఫోరం 48వ వార్షిక సమావేశానికి అమరరాజా గ్రూపునకు అధికారిక మెంబర్‌గా అవకాశం లభించినట్లు ఆ సంస్థ వైస్ చైర్మన్ జయదేవ్ గల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏపి సిఎం చంద్రబాబు నాయుడితో కలిసి తీసుకున్న సెల్ఫీని జయదేవ్ విడుదల చేశారు.

భారత వృద్ధి రేటు పెరుగొచ్చు

ఐఎంఎఫ్ అంచనా

న్యూఢిల్లీ : భారత వృద్ధి రేటు పుంజుకోవచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. 2017లో జిడిపి వృద్ధి 6.7 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. ఆ తర్వాత 2018లో 7.4 శాతానికి, 2019లో 7.8 శాతానికి చేరొచ్చని వాల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్‌లో తెలిపింది. దావోస్‌లో జరుగుతున్న వాల్డ్ ఎకనామిక్ ఫోరంలో భారత జిడిపిపై ఐఎంఎఫ్ ప్రకటన చేసింది. 2017లో దేశ వృద్ధి రేటు 7.2 శాతంగా, 2018లో 7.7 శాతంగా ఉండొచ్చని గతేడాది ఏప్రిల్‌లో ఐఎంఎఫ్ అంచనా కట్టింది. తాజాగా ప్రపంచ వృద్ధి రేటు కూడా ఉత్సాహకరంగా ఉండొచ్చని తెలిపింది. 2018, 2019లో 3.9 శాతానికి 0.2 శాతం అటూ, ఇటూగా ఉండొచ్చని ఐఎంఎఫ్ అంచనా వేసింది. 2017లో 0.1 శాతం పెరిగి 3.7 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. అమెరికా వృద్ధి రేటు 2017లో 2.3 శాతం, 2018లో 2.7 శాతం, ఆ తర్వాత ఏడాది 2.5 శాతంగా చోటు చేసుకోవచ్చని ఐఎంఎఫ్ తన రిపోర్టులో తెలిపింది. చైనా వృద్ధి రేటు 2017లో 6.8 శాతం, 2018లో 6.6 శాతంగా, 2019లో 6.4 శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని అంచనా వేసింది.

క్యాషియర్ లేని అమెజాన్ స్టోర్లు

సియాటెల్: అమెజాన్ స్టోర్‌కు వెళ్లి కావాల్సినవి తీసుకుని తర్వాత డబ్బు చెల్లించే విధానాన్ని ఈకామర్స్ దిగ్గజం అందుబాటులోకి తెస్తోంది. ఇలాంటి స్టోర్‌ను అమెజాన్ అమెరికాలోని సియాటెల్‌లో పరీక్ష నిమిత్తం సోమవారం ప్రారంభించింది. రిజిస్టర్లు, క్యాషియర్లు, కార్డు స్వైప్స్, ఇలాంటివేమీ ఈ స్టోర్‌లో ఉండవు. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించి కంప్యూటర్ విజన్, మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్, సెన్సార్ల సాయంతో వినియోగదారులు తీసుకునే వస్తువులను గుర్తించేలా చేశారు. వినియోగదారులు తనకు కావాల్సిన ఉత్పత్తులు తీసుకుని బయటికి వస్తుంటే తన అమెజాన్ యాప్ లేదా డెబిట్, క్రెడిట్ కార్డుల నుంచి నగదు ఉపసంహరణ ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. ఇందుకోసం వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లో 'అమెజాన్ గో' యాప్ డౌన్‌లౌడ్ చేసుకోవాలి. ఫోన్‌ను స్టోర్ ముందు స్కాన్ చేస్తే తలుపు తెరుచుకుంటుంది. అందులో సెల్ఫులో ఉన్న వస్తువులు తీసుకుంటే సెన్సార్లు గుర్తించి ఆ వస్తువును యాప్‌లోని వర్చువల్ కార్టులో చేరుస్తాయి. ఒకవేళ ఆ వస్తువు తిరిగి సెల్ఫులో పెట్టేస్తే కార్టులో నుంచి వస్తువు తొలగిపోతుంది. డబ్బు చెల్లించేందుకు ముందుగానే మన డెబిట్ లేదా క్రెడిట్ కార్డును యాప్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది.

దలాల్ స్ట్రీట్ ధగధగలు

- సెన్సెక్స్ 36వేలు
- ఐఎంఎఫ్ వృద్ధి మద్దతు
- నిఫ్టీ 11వేలకు చేరిక
- బ్యాంకింగ్ సూచీల మెరుపులు



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ల పరుగు జోరు కొనసాగుతోంది. వరుసగా ఐదో సెషన్‌లోనూ దలాల్ స్ట్రీట్‌లో ఉత్సాహం కనబడింది. మదుపర్ల కొనుగోళ్ల మద్దతుతో సరికొత్త రికార్డులను సృష్టించాయి. వివిధ సానుకూల పరిణామాల మధ్య మంగళ వారం సెన్సెక్స్ 36వేల మార్క్, నిఫ్టీ 11వేల మార్క్‌ను అధిగమించాయి. లోహ బ్యాంకింగ్ సూచీలు మెరుపులు మెరిపించాయి. 2018-19లో భారత వృద్ధి రేటు తిరిగి పుంజుకోనుందన్న అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రకటనతో మార్కెట్లపై విశ్వాసం పెరిగింది. ఈ నేపథ్యంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ మరో 341.97 పాయింట్లు లేదా 0.96 శాతం పెరిగి 36,139.98కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 117.50 పాయింట్లు లేదా 1.07 శాతం రాణించి 11,083.70 వద్ద ముగిసింది. 35,868 వద్ద మొదలైన సెన్సెక్స్ ఇంట్రా ట్రేడింగ్‌లో 35,863 కనిష్ట స్థాయికి పడిపోయినప్పటికీ అనంతరం కొనుగోళ్ల మద్దతుతో ఏకంగా 36,170.83 గరిష్ట స్థాయిని తాకింది.

2017లో భారత వృద్ధి రేటు 6.7 శాతానికి పరిమితం కానున్నప్పటికీ, 2018లో 7.4 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని ఐఎంఎఫ్ తన వాల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్‌లో అంచనా వేసింది. 2019లో వృద్ధి ఏకంగా 7.8 శాతానికి చేరొచ్చని విశ్లేషించింది. ఈ పరిణామం భారత మార్కెట్లలో విశ్వాసాన్ని నింపింది. రంగాల వారిగా కన్స్యూమర్ డ్యూరెబుల్స్ రంగం మినహా అన్నీ లాభాల్లోనే ముగిశాయి. లోహ సూచీ ఏకంగా 4.29 శాతం, పిఎస్‌యు 2.15 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 1.93 శాతం, బ్యాంకింగ్ 1.63 శాతం చొప్పున రాణించి మార్కెట్లకు ప్రధాన మద్దతునిచ్చాయి. కాగా కన్స్యూమర్ డ్యూరెబుల్స్ 0.33 శాతం తగ్గింది.

సెన్సెక్స్‌లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 3.84 శాతం, టాటా స్టీల్ 3.72 శాతం, ఒఎన్‌జిసి 3.6 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 3.06 శాతం, కోల్ ఇం డియా 3.04 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటి లో టాప్‌లో ఉన్నాయి. విప్రో 1.78 శాతం, టాటా మోటార్స్ 0.83 శాతం, ఆసియన్ పెయింట్స్ 0.76 శాతం, హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకు 0.64 శాతం, టిసిఎస్ 0.32 శాతం చొప్పున అధికంగా నష్ట పోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీలు పరుగులు పెట్టాయి. నిఫ్టీలో పిఎస బి సూచీ 3.97 శాతం, బిఒబి 5.68 శాతం, సిండికేట్ బ్యాంకు 3.95 శాతం, ఎస్‌బిఐ 3.93 శాతం, యునియన్ బ్యాంకు 3.53 శాతం, ఆంధ్రా బ్యాంకు 3.21 శాతం చొప్పున రాణించాయి.

ఆర్థికంలో మహిళల ప్రాధాన్యత పెరగాలి

ఐఎంఎఫ్ అధినేత్రి క్రిస్టిన్ లగార్డ్

దావోస్: భారత్ ఆర్థిక సేవల రంగంలో సంస్కరణల పర్వాన్ని కొనసాగించాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి అధినేత్రి క్రిస్టిన్ లగార్డ్ అభిప్రాయపడ్డారు. దీనికి తోడు భారత్ తన ఆర్థిక వ్యవస్థలో మహిళలకు తగిన నిజమైన ప్రాధాన్యతను కల్పించడంపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ప్రసంగించారు. భారత్ తన శ్రామిక శక్తిలో మగవారికి సమానంగా మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ భారీ స్థాయిలో 27శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని లగార్డ్ విశ్లేషించారు. గ్రామీణ భారతంలో మహిళలు అత్యధికంగా వివక్షను ఎదుర్కొంటుండడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలల్లో భారత్ ఒకటని ఆమె వివరించారు. భారత్ ఈ ఏడాదికి 7.4 శాతం వృద్ధిని నమోదు చేయగలదని లగార్డ్ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సంస్కరణల పర్వాన్ని భారత్ ఏవిధంగా ముందుకు తీసుకుపోతుందన్న అంశంపైనే ఆదేశ భవిష్యత్తు వృద్ధి అధారపడి ఉంటుందని వివరించారు. 2019లో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని లగార్డ్ తెలిపారు.

పన్ను పరిధి పెంచాలి : ఎస్‌బిఐ

న్యూఢిల్లీ : ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.3లక్షలకు పెంచాలని ఎస్‌బిఐ ఒక రిపోర్టులో కోరింది. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఏడో వేతన కమిషన్ తర్వాత ఉద్యోగుల ఆదాయాలు పెరిగిపోయాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలకు చేర్చాలని సూచించింది. తద్వారా దాదాపు 75 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని పేర్కొంది. ఈ నిర్ణయం తీసుకోవడం ద్వారా ప్రభుత్వానికి కేవలం 7,500 కోట్ల మేర భారం పడుతుందని పేర్కొంది. అదే విధంగా గహ రుణంపై చెల్లించే వడ్డీకి సంబంధించిన మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచాలని కోరింది. దీంతో 75 లక్షల రుణ గ్రహీతలకు ఉపశమనం లభిస్తుందని తెలిపింది. కాగా సేవింగ్స్ టర్మ్ డిపాజిట్ల కాలపరిమితిని ఐదేళ్ల నుంచి మూడేళ్లకు తగ్గించాలని సూచించింది.

రూ.249కే 'ఐకాల్' ఫోన్

హైదరాబాద్ : ఐకాల్ బ్రాండు మార్కెట్లోకి అత్యంత చౌక ఫీచర్ ఫోనును విడుదల చేసింది. ఐకాల్ కె71 మోడల్ ధర రూ.249గా నిర్ణయించింది. దీన్ని ప్రత్యేకంగా షాప్‌క్లూస్‌లో మాత్రమే విక్రయిస్తున్నట్లు ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 800 ఎంఎహెచ్ బ్యాటరీ, 1.4 అంగుళాల డిస్‌ప్లేతో తయారు చేసింది. దీంతో నాలుగు గంటల వరకు మాట్లాడుకోవచ్చు. స్టాండ్‌బై టైమ్ 24 గంటల వరకు ఉండను టార్చ్, ఎఫ్ఎం ప్లేయర్, ఏడాది పాటు వారెంటీని ఈ ఫీచర్ ఫోన్ అందిస్తోన్నట్లు షాప్‌క్లూస్ కేటగిరీస్ సీనియర్ డైరెక్టర్ రౌనక్ రహేజా తెలిపారు.

టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

జైగార్నిక్ ప్రభావం అంటే ?



ఎస్.పి. మనోహర్‌కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

సైకాలజీ (స్మృతి)

వ్యక్తిగతమైన గతానుభవాలను, ప్రత్యక్షానుభవాలను అదే క్రమంలో అదే విధంగా పునరుత్పత్తి చేయడమే స్మృతి. అంటే గతంలో నేర్చుకున్న విషయాలను జ్ఞప్తికి తెచ్చుకోవడం. ఎబ్బింగ్ హౌస్ స్మృతిమీద చేసిన ప్రయోగాల్లో అర్థరహిత అక్షరాలను మొదటిసారిగా ఉపయోగించాడు. 1885లో **"ఆన్ మెమొరి"** అనే గ్రంథాన్ని రచించాడు. ఎబ్బింగ్ హౌస్ స్మృతిలో మూడు దశలను పేర్కొన్నాడు.

1. ఒక అనుభవం లేదా ఉద్దీపన మెదడు మీద ముద్రించడం.
2. నాడీవ్యవస్థపై ఈ అనుభవాలు తెచ్చే మార్పులు.
3. నాడీ వ్యవస్థలోని మార్పుల వల్ల మన ప్రవర్తనలో మార్పురావడం.

జ్ఞానేంద్రియాలు సమాచారాన్ని సంకేత రూపంలో అనువదించి సులభంగా నిల్వ చేయగలదిగా, అవసరమైనప్పుడు పునరుక్తికి ఉపయోగపడేటట్లు చేయగల మొదటిదశ ప్రక్రియను **'ఎన్‌కోడింగ్'** అంటారు. ఏదైనా విషయం మనసులో నిలిచిపోయినప్పుడు దానికి తగినట్లుగా మెదడు భాగాల్లో కూడా కొంత మార్పు వస్తుంది. ఈ మార్పులనే **'స్మృతి చిహ్నాలు లేదా న్యూరోగ్రామ్ లేదా ఎన్‌గ్రామ్'** అంటారు. సంకేత రూపంలో భద్రపరచిన ఎన్‌గ్రామ్స్‌లోని సమాచారాన్ని తిరిగి అసలు రూపంలో పునరుత్పత్తి చేయడాన్ని **'జ్ఞప్తికి తెచ్చుకోవడం లేదా రిట్రీవల్'** అంటారు. ఈ ప్రక్రియలో ఎన్‌కోడ్ రూపంలో ఉన్న స్మృతి చిహ్నాలు డీకోడింగ్ ప్రక్రియ ద్వారా అసలు రూపాన్ని పొందుతాయి. ఇలా స్మృతిప్రక్రియలో అభ్యసన అంశాలు ఎన్‌కోడ్ అయిన తరువాత రీటెన్షన్‌లో ఉండటం డీకోడ్ అయిన తరువాత జ్ఞప్తికి తెచ్చుకుంటారు.

స్మృతికి శాస్త్రజ్ఞుల నిర్వచనాలు

స్మృతి అంటే గతంలో నేర్చుకున్న విషయాలను జ్ఞప్తి తెచ్చుకోవడం **- ఉడ్‌వర్త్**

అభ్యసించిన దానిని తిరిగి చేయగల సామర్థ్యమే స్మృతి **- స్కోల్‌బర్గ్**

ఇంతకుముందు జరిగిన విషయాన్ని అది ఎలా జరిగిందో అలాగే జ్ఞాపకం తెచ్చుకోవడమే స్మృతి **- స్టౌట్**

గత అనుభవాలను మెదడులో స్థిరీకరింపజేసి, మనకు అవసరమైనప్పుడు వాటిని చేతనంలోకి తీసుకురాగలిగిన శక్తే స్మృతి **- రైబర్**

స్మృతిలో అంశాలు

స్మృతిలో ముఖ్యాంశాలు ఐదుంటాయి. అవి..

1. అభ్యసనం : స్మృతి అనేది అభ్యసనానికి పునాదిమెట్టు. స్మృతి లేనిదే అభ్యసనం జరగదు. స్మృతికి ముఖ్యకారకం అభ్యసనంగా చెప్పుకోవచ్చు. ప్రేరణ అధికంగా ఉండటం, అవధానంతో నేర్చుకోవడం, అర్థవంతంగా నేర్చుకోవడం, విరామ, నిర్విరామ పద్ధతి, సంపూర్ణ – విభాగాల పద్ధతి, పునఃపఠనం అనేవి ఉపయోగించినప్పుడు స్మృతి ఎక్కువకాలం ఉంటుంది.

2. ధారణ : ఏ విషయాన్ని అయినా గుర్తుంచుకోవడం అంటే ఆ విషయాన్ని మన మనసులో కొంతకాలం నిలిచి ఉండటాన్ని 'ధారణ' అంటారు. వ్యక్తియొక్క ధారణను తెలుసుకోవడానికి మూడు పద్ధతులను ఉపయోగిస్తారు.

ఎ. పునఃస్మరణ
బి. గుర్తింపు పద్ధతి
సి. పునరభ్యాసనం.

ధారణ వక్రరేఖలను రూపొందించిన శాస్త్రవేత్త ఎబ్బింగ్‌హౌస్.

3. పునఃస్మరణ : ఏ విషయమైనా గుర్తుకు తెచ్చుకోవడాన్ని పునఃస్మరణ అని అంటారు. పరీక్షల్లో ఖాళీలు పూరించండి, వ్యాసరూప ప్రశ్నలు, సంక్షిప్త ప్రశ్నలు మొదలైన ప్రశ్నలు పునఃస్మరణకు చెందినవే. పునఃస్మరణ రెండు రకాలు...

ఎ. అశాబ్దిక పునఃస్మరణ జంతువుల్లో, అక్షరజ్ఞానంలేని వారిని ధారణు పరీక్షించడానికి అశాబ్ధిక పునఃస్మరణను ఉపయోగిస్తారు. ఇందులో విలంబిత ప్రతిచర్య ముఖ్యమైనది. ధారణ ఎంతవరకూ ఉంటుందో పరీక్షించే పరికరం విలంబిత ప్రతిచర్య పరికరాన్ని 'హంటర్' ప్రతిపాదించాడు.

బి. శాబ్ధిక పునఃస్మరణ అక్షరరూపాల్లోనూ, అంకెల రూపాల్లోనూ ఉన్న అంశాలను పునఃస్మరణ చేయడమే శాబ్ధిక పునఃస్మరణ. దీనిని కొలిచేందుకు స్మృతి విస్తృతి, ద్వంద్వ విసర్గలు, కథనాలు, ఆకృతుల పునరుత్పాదన, శబ్ద ప్రమాణాలను ఉపయోగిస్తారు. స్మృతి, విస్మృతులను ప్రయోగశాలలో కనుక్కోవడానికి ఉపయోగించే పరికరం **'టాచిస్టోస్కోప్'.** దీనిని కనుగొన్న శాస్త్రవేత్త **'విలియం హామిల్‌టన్'.** అర్థరహిత అక్షరాలను పునఃస్మరణ చేసుకోవడానికి ఉపయోగించే పరికరం **'స్మృతి పేటిక'.** కథనాలపై ప్రయోగం చేసిన శాస్త్రవేత్త **'బార్ట్‌లెట్'.** ఈయనే ఆకృతుల పునరుత్పాదన గురించి పేర్కొన్నాడు.



4. గుర్తింపు : ఇంతకుముందు అభ్యసించిన, చూసిన, విన్న అంశాలను తిరిగి చూసినప్పుడు, విన్నప్పుడు గుర్తించగలగడమే గుర్తింపు. పునఃస్మరణ కంటే గుర్తింపు తేలిక. గుర్తింపు సరిగా జరగకపోవడానికి కారణం **'డెజావూ'.** డెజావూ అనేది ఫ్రెంచ్ భాషా పదం. డెజావూ అంటే? మిథ్యా పరిచయం. అనగా ప్రస్తుతం చూసినది ఎప్పుడో చూసినట్లు అనుకోవడం. ఇప్పుడు చూస్తున్నదానికి, మనం ఇంతకు ముందు చూసినదానికి గల పోలికలే మిథ్యాపరిచయ భావన కలగడానికి కారణం. ఒక్కొక్కసారి స్మృతి విరూపన వల్ల కూడా డెజావూ కలుగుతుంది.

గుర్తింపు సూత్రం : ఒప్పులు – తప్పులు x 100 / మొత్తం.

5. పునరభ్యాసనం : నేర్చుకున్న ఒక విషయాన్ని మరలా మరలా నేర్చుకోడాన్ని **'పునరభ్యాసనం'** అంటారు. దీనిని పొదుపు పద్ధతి అనీ అంటారు. దీనిని వివరించేది ఎబ్బింగ్‌హౌస్.

పొదుపు గణనకు సూత్రం R 100 (అసలు ప్రయత్నాలు – పునరభ్యాసన ప్రయత్నాలు) / అసలు ప్రయత్నాలు.

సగంలో ఆపిన పనులు పూర్తిగా నేర్చుకున్న పనుల కంటే బాగా గుర్తుంటాయని రష్యాకు చెందిన మనోవిజ్ఞాన శాస్త్రవేత్త నిరూపించాడు. ఇలా గుర్తుండటాన్ని **'జైగార్నిక్ ప్రభావం'** అంటారు.

స్మృతిని పెంపొందించే పద్ధతులు

ఎ. ప్రేరణ
బి. తక్కువ భావోద్రేకత కలిగి ఉండటం
సి. అవధానం, అభిరుచి
డి. భావాల సంసర్గం
ఇ. వైషమ్యం
ఎఫ్. అతి అభ్యాసనం
జి. వల్లె వేయడం
హెచ్. కొండ గుర్తులు (నిమోనిక్స్)

స్మృతి రకాలు

1. రెడెన్టెగ్రేటివ్ స్మృతి : సంకేతాలు, ఉద్దీపనల ద్వారా విషయాలను జ్ఞప్తికి తెచ్చుకోవడాన్ని రెడెన్టెగ్రేటివ్ స్మృతి అంటారు.
ఉదా : ఇసుకను చూడగానే చిన్నప్పటి గుజ్జనగూళ్ళు గుర్తుకురావడం.

2. బట్టీ స్మృతి : ఒక విషయాన్ని యథాతథంగా, అర్థంతో సంబంధం లేకుండా, అవగాహన లేకుండా నేర్చుకోవడం.
ఉదా : చిన్నప్పుడు నేర్చుకునే ఎక్కాలు, ఇంగ్లీషు రైమ్స్

3. తార్కిక స్మృతి : ఒక విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని, తార్కికంగా ఆలోచన చేసి నేర్చుకోవడమే తార్కిక స్మృతి. అమూర్త ప్రచాలక దశలో కనిపించే స్మృతి.
ఉదా : కొంచెం పెద్దపిల్లలు తార్కికంగా అంశాలను గుర్తుపెట్టుకుని చెప్పగలగడం.

4. స్వల్పకాలిక స్మృతి : దీనిని తక్షణ స్మృతి అంటారు. విషయాలను తక్కువ కాలం గుర్తుంచుకుంటే, దానిని స్వల్పకాలిక స్మృతి అంటారు. దీనిని ప్రవేశపెట్టినది **'విలియం జేమ్స్'.**
ఉదా : అనౌన్స్‌చేసిన రైలు నెంబరు,
మనం ఎక్కే బస్సు నెంబరు వంటివి

5. దీర్ఘకాలిక స్మృతి : దీనిని శాశ్వత స్మృతి అంటారు. నేర్చుకున్న అంశాలు జీవితాంతం ఉంటాయి.
ఉదా : సైకిల్ తొక్కడం, ఈత కొట్టడం.

6. నిష్క్రియాత్మక స్మృతి : ప్రయోగపూర్వకంగా కాకుండా తక్కువ ప్రయత్నాల్లో చదవడం లేదా వినడం ద్వారా గుర్తుంచుకోవడం. అంటే ప్రయత్నం లేకుండా నేర్చుకున్న విషయాలు జ్ఞప్తికి రావడమే నిష్క్రియాత్మక స్మృతి.
ఉదా : బాల్యమిత్రుడు కనిపించగానే బాల్యానికి చెందిన అంశాలు జ్ఞప్తికి రావడం.

7. క్రియాత్మక స్మృతి : వ్యక్తి ప్రయత్నంలో విషయాలను జ్ఞాపకం చేసుకోవడమే క్రియాత్మక స్మృతి. దీనిని యత్నపూర్వక స్మృతి అనీ అంటారు.
ఉదా : పరీక్షల్లో సమాధానాలు గుర్తుంచుకొని రాయడం.

8. సంసర్గ స్మృతి : ఒక విషయాన్ని నేర్చుకొని, దానిని ఇతర అంశాలతో సంధానం చేయడాన్ని సంసర్గ స్మృతి అంటారు.
ఉదా : తాజ్‌మహల్ బొమ్మను చూడగానే షాజహాన్ గుర్తుకు రావడం, బల్బుని చూడగానే ఎడిసన్ గుర్తుకు రావడం.

★

తెలుసుకోండి మీ నాలెడ్జ్

1. నేర్చుకున్న విషయాలు తిరిగి అదే క్రమంలో గుర్తుకు తెచ్చుకోవడమే **- స్మృతి**
2. గతం స్మృతి అనీ, వర్తమానం అవధానం అనీ, భవిష్యత్తు ప్రతీక్షణ అని భావించిన శాస్త్రవేత్త **- అరిస్టాటిల్**
3. స్మృతి మీద విస్తృత ప్రయోగాలు చేసి ధారణా వక్రమాలను ప్రతిపాదించినది **- ఎబ్బింగ్‌హౌస్**
4. స్మృతి, విస్మృతిలపై ప్రయోగాలు చేసి ఎబ్బింగ్‌హౌస్ 1885లో రచించిన పుస్తకం **- ఆన్‌మెమొరీ**
5. స్మృతి స్వభావం తెలుసుకోవడం కోసం ఆత్మావలోకన పద్ధతిని ఉపయోగించి, ప్రయోగాలు చేసిన అనువంశికవాది **- గాల్టన్**
6. స్మృతి ప్రక్రియలో భాగంగా మెదడులో ముద్రలుగా ఏర్పడి, నాడీవ్యవస్థలో సంభవించే మార్పులు **- స్మృతి చిహ్నాలు**
7. స్మృతి, విస్మృతిలను కొలిచే పరికరం **- టాచిస్టోస్కోప్**
8. టాచిస్టోస్కోప్‌ను తయారుచేసినది **- విలియం హామిల్టన్**
9. ద్వంద్వ విసర్గలపై ప్రయోగాలు చేసినవారు **- ఎబ్బింగ్ హౌస్**
10. కథనాలపై ప్రయోగాలు చేసినవారు **- బార్ట్‌లెట్**
11. విలంబితా ప్రతిచర్యా పరికరాన్ని రూపొందించినవారు **- హంటర్**
12. 1857 అనగానే సిపాయిల తిరుగుబాటు గుర్తుకురావడం **- సంసర్గ స్మృతి**
13. ఛందస్సులోని 'యమాతారజభానసలగం' ను గుర్తుపెట్టుకోవడం **- కొండ గుర్తులు (నిమోనిక్స్)**

ఉద్యోగాలు

సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో 18 ఖాళీలు

సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీఆర్ఐ).. 18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. సీపీఆర్ఐ ప్రధాన కార్యాలయం బెంగళూరులో ఉండగా, హైదరాబాద్, భోపాల్, నాగ్‌పూర్, నోయిడా, కోల్‌కతా, గువాహటి, బినా (మధ్యప్రదేశ్)లో యూనిట్స్ ఉన్నాయి.

పోస్టు-ఖాళీలు : ఇంజనీరింగ్ ఆఫీసర్ గ్రేడ్ (1)–9, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్(2)–2, టెక్నీషియన్ గ్రేడ్(1)–2, అసిస్టెంట్ గ్రేడ్(2)–3, అసిస్టెంట్ లైబ్రేరియన్–2.

అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి బీఈ/ బీటెక్ (ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) + గేట్ (2016/ 17)/ డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్)/ ఐటీఐ (ఎలక్ట్రిక్)/ డిగ్రీ (కామర్స్/ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ బిజినెస్ మేనేజ్‌మెంట్) + టైపింగ్/ డిగ్రీ + డిప్లొమా (లైబ్రరీ సైన్స్)/ బి.లైబ్రరీ సైన్స్. వీటితోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.

వయస్సు : దరఖాస్తు గడువు ముగిసే నాటికి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు 35ఏళ్లు, టెక్నీషియన్‌కు 28ఏళ్లు, మిగిలిన పోస్టులకు 30ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : ఎంసీక్యూ టెస్ట్/ స్కిల్ టెస్ట్/ ట్రేడ్ టెస్ట్/ డాక్యుమెంట్ వెరిఫికేషన్/...

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : జనవరి 29, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.cpri.in

టీహెచ్‌డీసీ ఇండియా లిమిటెడ్‌లో 40 ఖాళీలు

తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (టీహెచ్‌డీసీఐఎల్).. 40 ఇంజనీర్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. టీహెచ్‌డీసీఐఎల్.. కేంద్రం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల జాయింట్ వెంచర్.

పోస్టు : ఇంజనీర్ ట్రైనీ.

విభాగాల వారీ ఖాళీలు : సివిల్–15, ఎలక్ట్రికల్–15, మెకానికల్–10.

అర్హతలు : సంబంధిత విభాగాలను బట్టి కనీసం 65 శాతం మార్కులు/ తత్సమాన గ్రేడ్‌తో బీఈ/ బీటెక్/ బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణత. అలాగే గేట్–2018 స్కోర్. పదోతరగతి, ఇంటర్మీడియెట్‌లోనూ 65 శాతం మార్కులు పొంది ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/వికలాంగులు/ మాజీ సైనికోద్యోగ అభ్యర్థులకు పాస్ మార్కులు చాలు.

వయసు : 2018, జనవరి 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : గేట్–2018 స్కోర్ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు : రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మాజీ సైనికోద్యోగ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ : జనవరి 31, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.thdc.gov.in

త్వరలో టెట్‌పై నిర్ణయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

టెట్‌కు సంబంధించి ఇప్పటికే మూడుసార్లు వాయిదా వేశామని, విద్యార్థులతో చర్చించామని మంత్రి గంటాశ్రీనివాసరావు తెలిపారు. మళ్లీ వాయిదా అడుగుతున్న నేపథ్యంలో తుది నిర్ణయం త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి అల్లు రామలింగయ్య హోమియోపతి కాలేజీలో మీడియా సమావేశంలో మాట్లాడారు.రాష్ట్రంలో 45 వేల పాఠశాలల్లో రూ.4,850 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మౌలిక వసతుల కల్పనకు సంబంధించి టెండర్లు పిలిచామని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు.తూర్పుగోదావరి జిల్లాలో రూ.288 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఒక్కో నియోజక వర్గానికి 30 కోట్ల వరకూ నిధులు కేటాయించామన్నారు.



దీక్షలవ రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కడప జిల్లా కోర్టు ఎదుట మంగళవారం రిలేదీక్షలు చేస్తున్న న్యాయవాదులు

'సీమ'లో హైకోర్టు ఏర్పాటయ్యే వరకూ ఉద్యమాలు

ప్రజాశక్తి యంత్రాంగం

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేసేంత వరకూ ఉద్యమం ఆపేది లేదని న్యాయవాదులు స్పష్టం చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాయలసీమ వ్యాప్తంగా ఆందోళనలు మొదలయ్యాయి. నిరహార దీక్షలు, మౌనప్రదర్శనలు, ధర్నాలు వంటి కార్యక్రమాలను చేపట్టారు. కడపలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మస్తాన్‌వలి, మాజీ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి, ఐలు జిల్లా అధ్యక్షులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట రిలేనిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలో హైకోర్టు స్థాపన కోసం న్యాయవాదులు చేయనున్న భవిష్యత్ ఉద్యమాలకు అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, విద్యార్థి, ప్రజా సంఘాలు మద్దతు తెలియజేయాలని కోరారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను స్థాపించాలనే డిమాండ్‌తో ఈ నెల 25న ఉక్కు సాధన ఐక్య వేదిక కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే జిల్లా బంద్‌కు న్యాయవాదులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు.

కర్నూలు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మూడో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని న్యాయవాదులు స్థానిక శ్రీకృష్ణదేవరాయల సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు మౌనప్రదర్శన నిర్వహించారు. అనంతపురంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్‌క్లాక్ వరకు సాగింది. కార్యక్రమంలో అనంతపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తరిమెల భరత్‌భూషన్‌రెడ్డి, న్యాయవాదులు ఎల్.కె.సుదీంద్రనాథ్, నరసింహులు, అబ్దుల్ రసూల్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

- సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులకు నిరసనగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
- దళిత, ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధుతో పాటు వామపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళనలు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని విమర్శించాయి.

విజయవాడ లెనిన్ సెంటర్లో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రామారావు, న్యూడెమోక్రసీ నాయకులు పోలారి పాల్గొన్నారు. మధు అక్రమ అరెస్టును నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కంకిపాడు పార్టీ కార్యాలయం నుండి బందరు రోడ్డు వరకూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో సిపిఎం కార్యాలయం నుండి పోలీస్‌స్టేషన్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహానాడు, సుందరయ్య నగర్ తదితర ప్రాంతాల నుండి నిరసన తెలిపేందుకు వస్తున్న వారిని పోలీసులు ఎక్కడికక్కడ నిలువరించారు. అయినా ముగ్గురోడ్డు, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్, రామయ్య కాలనీ తదితర ప్రాంతాల నుండి కార్యకర్తలు తరలివచ్చారు. సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు వి.దుర్గారావు, రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి మాట్లాడారు. కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌లోకి రాకుండా పోలీసులు గేట్లు మూసేశారు. పోలీస్‌స్టేషన్‌లో మధును వైసిపి పట్టణ కన్వీనర్ బి.వేణుగోపాలసోమిరెడ్డి, గుండిమెడ ఎంపిటిసి పి.కృష్ణమూర్తి, కె.రాజ్యలక్ష్మి రాఘవరావు, కౌన్సిలర్ చింకా గంగాధరరావు పరామర్శించారు. రేపల్లెలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. సాగర్‌హోటల్ సెంటర్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు టి.షడ్రక్, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విశాఖలో సిపిఎం కార్యాలయం నుంచి లేపాక్షి జంక్షన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం మాట్లాడుతూ పెదగొట్టిపాడు దళితులపై పెత్తందారులు అన్యాయంగా, తీవ్రంగా దాడి చేశారు. పెత్తందారులకు కొమ్ముకాస్తూ దాడిలో గాయపడ్డ దళితులపై పోలీస్ యంత్రాంగాన్ని వినియోగించి ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని విమర్శించారు. దాడిచేసిన ప్రధాన నిందుతుల్ని ఇప్పటికీ అరెస్టు చేయలేకపోవడంతో బాధితులకు న్యాయం చేయాలని ఈనెల 24న చలో పెదగొట్టిపాడు కార్యక్రమానికి పిలుపునిచ్చాయన్నారు. బాధితులకు సంఘీభావం తెలియజేయడానికి వెళ్ళినవారందర్నీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టులకు పాల్పడ్డం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రేటర్ విశాఖనగర కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎం.జగ్గునాయుడు, బి.జగన్, నగర కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, నాయకులు డి.అప్పలరాజు, కె.సత్య నారాయణ, సింహాచలం పాల్గొన్నారు.పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సిపిఎం, సిపిఐ, ఎంసిపిఐ ఆధ్వర్యాన పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.



విజయవాడ లెనిన్ సెంటర్‌లో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నందం గనిరాజు సెంటర్లో రాస్తారోకో చేపట్టారు. బాధితుల పక్షాన పోరాడేవారిని అరెస్టు చేయడం తగదని సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కమిటీ కార్యదర్శి అరుణ్ అన్నారు.

వామపక్ష నాయకులను వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చలో గొట్టిపాడు నేపథ్యంలో పోలీసుల ముందస్తు అరెస్టుల్ని వామపక్షాలు ఖండించాయి. అరెస్టు చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు,ఇతర నాయకుల్ని వెంటనే విడుదల చేయాలని వామపక్షాలు, దళిత, ప్రజా సంఘాలు విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల్ని ప్రభుత్వం కాలరాస్తోందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. బాధితుల్ని పరామర్శించేందుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదన్నారు. అరెస్టు చేసిన నాయకుల్ని రికార్డుల్లో చూపకుండా పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పోలారి మాట్లాడుతూ దళితుల భూముల్ని లాక్కొనేందుకు ప్రయత్నిసోందన్నారు. దోనేపూడి కాశీనాథ్ సిహెచ్ బాబూరావు, రామారావు, దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, స్వరూపరాణి, నత్తా యోహను, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, కె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ మళ్లీ గెలిస్తే దేశానికి ప్రమాదం

మాజీ ఎంపీ ఉండవల్లి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు దేశానికి ప్రమాదమని, ఆ పార్టీతో కలిసే ఏ పార్టీకీ తాను ఓటెయ్యనని రాజమహేంద్రవరం మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శత్రువులను సంహరించడం ప్రధాని మోడీ విధానమని, ఆయన మళ్లీ గెలిస్తే దేశానికి ప్రమాదమన్నారు. మోడీ మళ్లీ అధికారంలోకొస్తే 2024లో పార్లమెంటుకు ఎన్నికలే ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పాలనో, మరో విధంగానో మోడీ పాలన చేస్తారని విశ్లేషించారు. మోడీ నటనలో దిలీప్ కుమార్‌ను మించిపోయారని అన్నారు. జగన్, చంద్రబాబు మోడీకి భయపడుతున్నారని, తనకు సరెండ్ కాని వారిని మోడీ పాలన చేయనివ్వరని చెప్పారు. దీనికి ఢిల్లీ, తమిళనాడు పరిణామాలే ఉదాహరణన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే బిజెపితో పొత్తుపెట్టుకుంటామని చెప్పిన వైసిపి అధినేత జగన్ ప్రకటనపై స్పందిస్తూ ప్రత్యేక హోదా ఇవ్వనని మోడీ ఇప్పటికే ప్రకటించారన్నారు. మోడీ ఎలాగూ హోదా ఇవ్వరు కనుక బిజెపితో వైసిపికి పొత్తు ప్రసక్తే ఉండకపోవచ్చునని అన్నారు. టిడిపి ఇప్పటికే బిజెపితో జతకట్టి ఉన్నందున జగన్ బాగా ఆలోచించి ఈ ప్రకటన చేసి ఉంటారని ఉండవల్లి అన్నారు. తాను 21 ఏళ్లు వచ్చేవరకూ ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్నానని, తన పరిశీలనలో దేశానికి వారి విధానాలు సరిపోవని గ్రహించానని తెలిపారు. బిజెపి వల్ల దేశానికి చెడు జరుగుతుందనేది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు.

31న పాడేరులో గిరిజన గర్జన

ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు (విశాఖ)

ఈ నెల 31న విశాఖ జిల్లా పాడేరులో జరిగే గిరిజన గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు కుడుముల కాంతారావు పిలుపునిచ్చారు. మంగళవారం పాడేరులోని స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన హక్కులను, చట్టాలను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే వాటికి తూట్లు పొడిచే విధంగా బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు నిర్ణయం తీసుకుందని, దీనిని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని కోరారు. బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొండకుమ్మర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజన గర్జనలో గిరిజనులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేతనాలు పెంచాలని మిడ్ డే మీల్స్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (విజయవాడ)

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం తహశీల్దారు కార్యాలయం ఎదుట కార్మికులు మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం మండల నాయకురాలు జి.రాజేశ్వరి మాట్లాడుతూ.. పాఠశాలల్లో శ్రమించి వంట చేస్తుంటే ప్రభుత్వం తమకు రావాల్సిన కమీషన్లలో కోతలు విధించడం బాధాకరమన్నారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఆర్‌వి నరసింహారావు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేశాక బడి మానివేసే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. సిఐటియు జిల్లా నాయకులు పి.శంకర్ మాట్లాడుతూ.. ధరలకనుగుణంగా బడ్జెట్ పెంచి కార్మికులకు రూ.ఐదు వేలు చొప్పున వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారుకు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

బిజెపిని గద్దె దింపడమే కర్తవ్యం

- మతతత్వ పార్టీల కొమ్ముకాస్తున్న ప్రాంతీయ పార్టీలు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ వెల్లడి

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి

మతోన్మాద దాడులకు కేంద్రంగా ఉన్న బిజెపిని గద్దె దించడమే సిపిఎం ప్రధాన కర్తవ్యమని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. కడప జిల్లా మహాసభలు రెండోరోజు ఉత్సాహభరింతంగా ముగిశాయి. సభకు కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఓబులు, నారాయణ పరిశీలకులుగా పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధిపై ఫలవంతమైన చర్చలను నిర్వహించి పలు తీర్మానాలను సభ ఆమోదించింది. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ దేశంలో మతతత్వ రాజకీయాలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు మతతత్వ శక్తుల చుట్టూ తిరుగున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని విమర్శించరాదని, జగన్ ప్రత్యేక హోదా ఇస్తే మద్దతిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. మతతత్వ రాజకీయాన్ని సమర్ధించే ఏపార్టీయైనా ప్రజాద్రోహులుగానే భావించాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతిస్తే మంచిదన్న అభిప్రాయాన్ని పార్టీ తిరస్కరించిందని స్పష్టం చేశారు. నిత్యం స్వదేశీ విధానాన్ని గురించి మాట్లాడే బిజెపి చేసేదంతా విదేశీ సేవలేనని ఎద్దేవా చేశారు. పాకిస్థాన్ కంటే హీనంగా దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించిందని ఆక్స్‌ఫాం నివేదిక ఇటీవల వెల్లడించిన ఫలితాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తాయని పేర్కొన్నారు. దాదాపు 73 శాతం సంపద కేవలం 1 శాతం మంది చేతిలో కేంద్రీకృతం కావడం దేశ ఆర్థిక వ్యవస్థలో ఉన్న డొల్లతానాన్ని బట్టబయలు చేశాయన్నారు. గోరక్షకుల పేరుతో దళితులు, మైనార్టీలపై దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. అంబేద్కర్ విధానాలను వల్లిస్తూనే మరో వైపు దళితులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. 'మొరిగే కుక్కలకు భయపడం' అంటూ దళితులనుద్దేశించి కేంద్ర మంత్రి అనంత్‌కుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను మోస్తోందని ఎద్దేవా చేశారు. దాదాపు 44 రకాల చట్టాలను సవరిస్తూ కార్మిక హక్కులను కాలరాసేందుకు పూనుకుంటోందన్నారు. పార్టీలు అధికార మార్పు వల్ల ప్రయోజనం లేదని, విధానాల్లో మార్పు రావాలని పేర్కొన్నారు. అందుకోసం బలమైన పార్టీ నిర్మాణంపై పార్టీ దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా సిపిఎం ఎదగాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లాలో ఉక్కుతో పాటు పలు సమస్యలపై క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.



కడప జిల్లా ముగింపు సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, వేదికపై వి.ఉమామహేశ్వరరావు తదితరులు

ఢిల్లీ నుంచే ఏమీ తేలేకపోయారు

విదేశాల నుంచి బాబు ఏం తెస్తారు..?

వైసిపి అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ నుంచే ఏమీ తేలేకపోయిన చంద్రబాబు విదేశాల నుంచి ఏం తీసుకొస్తారని వైసిపి అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. సిఎం చంద్రబాబు విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విదేశీ పర్యటనలతో ఇప్పటి వరకు రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయో స్పష్టం చేయాలన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలపై తక్షణం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు చంద్రబాబు 17 సార్లు విదేశీ పర్యటనలు చేశారని గుర్తు చేశారు. విదేశాల్లో బాబాయ్ హోటల్‌లో మాదిరిగా భోజనాలు చేసి, నచ్చింది తినటం తప్ప నాలుగేళ్లుగా ఏమీ సాధించలేకపోయారన్నారు. చంద్రబాబు విదేశీ పర్యటనల్లో టిడిపి ఎంపీ సీఎం రమేష్‌కు ఏంపని అని, ఆయన ఎందుకు వెళ్లాల్సి వచ్చిందని నిలదీశారు. నాలుగేళ్లలో విభజన చట్టంలోని ఒక్క హామీని కూడా సాధించలేక పోయారని విమర్శించారు. రాష్ట్రంలో దోచుకున్న డబ్బును దాచుకోవడానికే విదేశీ యాత్రలు చేస్తున్నారన్నారు.

సమాజ గమనానికి చిత్ర కళ అద్దం పట్టాలి

ప్రముఖ చిత్రకారుడు కుమార్ వికాస్ సక్సేనా

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)

సమాజ పోకడలు, గమనానికి చిత్రకళ అద్దం పట్టాలని, ఆ దిశగా చిత్రకారులు తమను తాము ఆవిష్కరించుకోవాలని ఢిల్లీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు కుమార్ వికాస్ సక్సేనా అన్నారు. విజయవాడలోని కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతిలో మంగళవారం జరిగిన 'ఆధునిక చిత్రకళ పోకడలు' అన్న అంశంపై ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని భిన్న చిత్ర ధోరణులను వివరించారు. మన దేశంలో సంతరించుకుంటున్న మార్పులను, సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, ప్రాకృతిక రంగాల నేపథ్య ప్రభావం ఎలా ఉంటుందో వివరించారు. ఈ కార్యక్రమాన్ని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డి.విజయ్ భాస్కర్ ప్రారంభించి మాట్లాడుతూ.. పాశ్చాత్య దేశాల చిత్రకళతో మన దేశ చిత్రకళను పోల్చకూడదన్నారు. విలక్షణ సాంస్కృతిక నేపథ్యమున్న చిత్రకళ ప్రపంచంలో ఒక విశిష్ట గుర్తింపునకు నోచుకుందన్నారు. యువ చిత్రకారులు సమాజ పోకడలను అధ్యయనం చేసి సామాజిక రుగ్మతలను నిర్మూలించే సందేశాత్మక చిత్రాలను రూపొందించాలన్నారు. అనంతరం చిత్రకారులతో సక్సేనా ముఖాముఖి మాట్లాడారు. కల్చరల్ సెంటర్ సిఇఒ ఈమని శివనాగి రెడ్డి పాల్గొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. తిరువనంతపురం
2. ఎస్.సోమనాథ్
3. చీఫ్ మినిస్టర్-గి హక్సెల్గి తెంగ్‌బాంగ్
4. వెస్టిండీస్‌లో (నవంబర్)
5. సిద్ధార్థ ప్రతాప్ సింగ్ (భారత్)

సమ్మె విచ్ఛిన్నానికి బెదిరింపులు

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సమ్మెకు దిగిన స్కీం వర్కర్లను నయానా, బయానా బెదిరించి లొంగ దీసుకోవటానికి ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. కేంద్ర కార్మిక సంఘాలిచ్చిన పిలుపులో భాగంగా సర్వశిక్ష అభియాన్, అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం, ఐకెపి, 108, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్మికులు ఈ సమ్మెలో పెద్దఎత్తున పాల్గొన్నారు. కృష్ణాజిల్లాలో దాదాపుగా అన్ని మండలాల్లో ఈ సమ్మె విజయవంతమైంది. పైన పేర్కొన్న అన్ని విభాగాల అధికారుల నుంచి సంబంధిత ఉద్యోగులకు బెదిరింపులు వచ్చాయి. సమ్మెలో పాల్గొంటే విధుల నుంచి తొలగిస్తామంటూ కలెక్టర్ నుండి ఆర్‌డిఒ, తహశీల్దార్, ఐసిడిఎస్ సిడిపిఒ వరకూ బెదిరించారు. సోమవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్‌లోనూ ఈ విషయాన్ని కృష్ణాజిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం ప్రస్తావించారు. ఉదయం నుంచి అధికారులు ఫోన్లు చేసి మరీ సమ్మెకు వెళ్లనివ్వకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి. సిడిపిఒలు అయితే అంగన్వాడీ ఉద్యోగులను మరింతగా బెదిరించినట్లుగా సమాచారం. కేంద్రాల తాళాలిచ్చి సమ్మెకు వెళ్లండి అంటూ గుడివాడ సిడిపిఒ హుకుం జారీచేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంగతి కూడా ఇలాగే కొనసాగిందని కార్మికులు వాపోయారు.

కేసుల కోసమే బాబు, జగన్ రాజీ పడ్డారు

- జనసేన ఒక భజన బృందం
- ఎపిసిసి ఉపాధ్యక్షులు తులసిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేసుల కోసం చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలు కేంద్రంతో రాజీ పడ్డారని విమర్శించారు ఎపిసిసి ఉపాధ్యక్షులు ఎన్.తులసిరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల్ని కాపాడటంలో అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు సూర్యా నాయక్, జంగా గౌతమ్, సుందరరామశర్మ, రామచంద్రారెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.. బిజెపి చేతిలో రెండు పార్టీలూ కీలు బొమ్మగా మారాయన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఇరు పార్టీల నేతలూ రాష్ట్ర హక్కుల్ని తాకట్టు పెడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, వైసిపికి ఓట్లేస్తే మోడీకి వేసినట్లేనన్నారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే 2019లో టిడిపి ,వైసిపి ,బిజెపి కలిసి పోటీచేసేలా ఉందన్నారు.

ప్రత్యేకహోదా ఇస్తే బిజేపితో పొత్తు పెట్టుకుంటామని వైఎస్ జగన్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. క్విడ్‌ప్రోకో కేసు నుంచి బయట పడేందుకు బిజెపి దయాదాక్షిణ్యాల కోసం తాపత్రయ పడుతున్నటుగా ఉందన్నారు. జగన్ పరిభాషలో లౌక్యం అంటే లొంగిపోవడం, దౌత్యం అంటే దాసోహమా అని ఆయన ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడటం దండగని, జనసేన పూర్తిగా భజన బృందంగా మారిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్, చంద్రబాబులకు భజన చేసేందుకే ఆయన ప్రజా యాత్ర చేపట్టినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు.

అత్యవసర మందులపై ఐదు శాతం జిఎస్‌టి రద్దు చేయాలి

ప్రజాశక్తి -వన్‌టౌన్ (విజయవాడ)

ట్రామా, యాక్సిడెంట్ వంటి సమయాల్లో ఉపయోగించి ప్రాణాలను కాపాడే మందులపై ఐదు శాతం జిఎస్‌టిని రద్దు చేయాలని, దేశ వ్యాప్తంగా రోగులు, బాధితుల అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం పున:పరిశీలించాలని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఎస్.పట్నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ వన్‌టౌన్‌లోని భావన్నారాయణ వీధిలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే దేశం ఒకే పన్ను అమలు పరచాలనే ప్రభుత్వ యోచనకు భిన్నంగా జిఎస్‌టి విధానం కొనసాగుతుండటం విచారకరమన్నారు. వేలాది రకాలైన బ్రాండెడ్, జనరిక్ మందులపై ఐదు రకాల పన్నులు విధిస్తుండటంతో మందుల అమ్మకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

భావనపాడు పోర్టుకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు (శ్రీకాకుళం జిల్లా)

తమ పొట్ట కొట్టే భావనపాడు పోర్టును నిర్మించొద్దంటూ శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ మత్స్యకారులు ఆ గ్రామంలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ సీదిరి చిరంజీవి, భావనపాడు పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు లండ దానేషు మాట్లాడుతూ పోర్టు ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదని, పంచాయతీ నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోలేదని తెలిపారు. ఇక్కడి ప్రజల, మత్స్యకారుల జీవన స్థితిగతులపై సర్వే చేయకుండా, కార్పొరేట్ల ప్రయోజనం కోసం ప్రభుత్వం పాకులాడుతూ పోర్టు నిర్మాణానికి పూనుకుంటోందన్నారు.

నిరాహార దీక్షలు

నాలుగోరోజుకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన రాష్ట్రవ్యాప్త రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాలుగో రోజుకు చేరాయి. కార్మికులను తెలంగాణా ప్రభుత్వం మాదిరిగా రెగ్యులరైజ్ చేయాలని, పీస్‌రేట్ పద్ధతి రద్దు చేయాలనే డిమాండ్లతో దీక్షలు చేపట్టారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్థలో పని చేస్తున్న 23 వేల మంది కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు.

విజయవాడలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల రిలేదీక్షలను ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఓబులేసు, సిఐటియు పశ్చిమ కృష్ణా జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపరాణి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబి రాణి, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ అధ్యక్షులు ఎల్.రాజు సంఘీభావం తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలను జెఎసి ఆఫ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్, వర్కర్స్ జిల్లా ఛైర్మన్ వై.నేతాజీ ప్రారంభించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. నాగబ్రహ్మాచారి మాట్లాడారు. ఒంగోలు కలెక్టరేట్ వద్ద దీక్షలు చేశారు. జిల్లా జెఎసి ఛైర్మన్ లక్ష్మణ్ మాట్లాడారు. కర్నూలు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన దీక్షలకు సిపిఎం పశ్చిమ ప్రాంత కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, వైసిపి కర్నూలు అధ్యక్షులు బివై.రామయ్య సంఘీభావం తెలిపి మాట్లాడారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలను ఎస్‌ఎస్‌ఎ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ అండ్ టీచర్స్ జెఎసి కార్యదర్శి జెవి.ప్రసాదరావు ప్రారంభించారు. విశాఖ పట్టణం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్ష శిబిరాన్ని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ సందర్శించి మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిపిఐ నగర కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు సంఘీభావం తెలిపి మాట్లాడారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులోని కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు కొనసాగాయి. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

బిసి(ఎఫ్)గా గుర్తిస్తేనే కాపులకు రిజర్లేషన్లు : ముద్రగడ

ప్రజాశక్తి-పొన్నూరు (గుంటూరు)

కాపులను బిసి-ఎఫ్ గ్రూప్‌గా గుర్తిస్తూ సర్టిఫికెట్లు విడుదల చేసినప్పుడే తమకు రిజర్వేషన్లు అమలైనట్లుగా భావిస్తామని కాపు రిజర్వేషన్ పోరాట ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. మంగళవారం ఆయన చీరాల వెళుతూ మార్గమధ్యలో గుంటూరు జిల్లా పొన్నూరు కాపునాడు కోశాధికారి కోటా శ్రీనివాసరావు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాపులకు రిజర్వేషన్లు అమలు చేస్తారని విశ్వసిస్తున్నామని చెప్పారు. కాపు రిజర్వేషన్లపై గవర్నర్ సంతకం అయినందున బిల్లుకు తక్షణ చర్యలు తీసుకోవాలని చంద్రబాబును కోరుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ 'ఒబిసి' రిజర్వేషన్ల కోసం కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించాల్సి ఉందన్నారు. బిసి రిజర్వేషన్లలో ఎఫ్ గ్రూప్‌గా కాపులను గుర్తించి వర్గీకరణ చేస్తే తమకు అభ్యంతరం లేదని బిసి నాయకులు స్పష్టత ఇచ్చారని ఆయన తెలిపారు. రాజకీయ రిజర్వేషన్లపై కూడా తమ డిమాండ్‌ను ప్రభుత్వం ఎదుట పెడుతున్నామని చెప్పారు. గుజరాత్‌లో పటేళ్ల రిజర్వేషన్ల పోరాటం అనంతరం 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకూడదన్న అభిప్రాయం వ్యక్తమైన అంశాన్ని విలేకర్లు లేవనెత్తగా తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు.

మి-17 విమానాల కొనుగోలుకు ఒప్పందం

న్యూఢిల్లీ : 48 మి-17 విమానాలకు సంబంధించిన ఒప్పందంపై భారత్-రష్యాలు మార్చి నాటికి సంతకాలు చేయనున్నాయని రష్యాకు చెందిన రోస్టెక్ స్టేట్ కార్పొరేషన్ సిఇఒ సెర్గి కెమెజోవ్ తెలిపారు. గత ఏడాదిలో సంతకాలు జరిగిన మి-17వి-5 హెలికాప్టర్ల ఒప్పందం కూడా త్వరలోనే ఖరారు కానున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన చర్చలు పూర్తయ్యాయని, 2018 తొలి త్రైమాసికంలో ఒప్పందం ఖరారు కాంట్రాక్టుపై సంతకాలు జరుగుతాయని భావిస్తున్నామన్నారు. ఒక ప్రముఖ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. మి-17, మి-8 విమానాలలో అత్యంత ఆధునికీకరణ సామర్థ్యాలున్నట్లు నిరూపితమైనదన్నారు.



డ్రెస్ రిహార్సల్

రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న న్యూఢిల్లీలో జరుగనున్న ప్రదర్శన కోసం రాజ్‌పథ్‌లో డ్రెస్ రిహార్సల్ చేస్తున్న ఆశ్వికదళం

బిజెపి సర్కార్ 'హయాం'లో ఇంధన ధరల 'మోత'

ఎక్సైజ్ సుంకంలో కోత విధించాలని కోరిన చమురు శాఖ

ఆర్థిక శాఖకు ప్రి బడ్జెట్ సిఫార్సులు

న్యూఢిల్లీ : బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పెట్రోలు ధరలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. పెట్రో ధరలు నేడు అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. లీటర్ డీజిల్ ధర రు.63.20 వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. దీంతో ఎక్సైజ్ సుంకంలో కోత విధించాలని చమురు మంత్రిత్వ శాకోరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు రోజూవారి ప్రకటించే ఇంధన ధరల జాబితా ప్రకారం ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర రూ.72.38గా ఉంది. 2014 మార్చి నుంచి చూస్తే ఇది అత్యధికం. గత ఏడాది డిసెంబరు నుంచి ఇంధన ధరలు లీటరుకు రూ.3.31 చొప్పున పెరిగాయి. ముంబయిలో వీటి ధరలు రూ.80 వరకు ఉన్నాయి. దేశంలోనే అత్యధిక ధరలు ఇక్కడ కొనసాగుతున్నాయి. ముంబయిలో లీటర్ డీజిల్ ధర రూ.67.30లుగా ఉంది. స్థానిక పన్ను, వ్యాట్ వడ్డింపులే దీనికి కారణమని చమురు కంపెనీలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయంగా చమురు ధరల్లో పెరుగుదలతో ఇక్కడ ఇంధన ధరలుపెరిగాయని చెబుతున్నారు. దీంతో 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ఎక్సైజ్ సుంకంపై కోత విధించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను మంగళవారం చమురు మంత్రిత్వ శాఖ కోరింది. 2018-19 సంవత్సరానికి బడ్జెట్‌ను వచ్చే వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే. బడ్జెట్ ముందు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి చమురు మంత్రిత్వ శాఖ సమర్పించిన ప్రి బడ్జెట్ మెమోరాండంలో ఈ మేరకు కోరినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

వివాహ హోదాను విచారించలేరు..

లవ్ జిహాద్ కేసులో సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ : లవ్ జిహాద్ కేసులో సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. హదియా, ఇష్రత్ జహాన్ కేసులో వారి వివాహ హోదాను ఎవరూ విచారించలేరని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా తెలిపారు. గత ఏడాది ఇష్రత్ జహాన్‌ను హదియా వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై ఆమె తల్లిదండ్రులు కేరళ హైకోర్టును ఆశ్రయించారు. నమ్మించి మతం మార్చారని పేర్కొన్నారు. దీనిని అప్పట్లో లవ్ జిహాద్‌గా పేర్కొంటూ ఎన్ఐఎ విచారణ చేపట్టింది. దీనిపై విచారించిన సుప్రీం కోర్టు పెళ్లి విషయంలో విచారించేందుకు ఎవరికీ అధికారం లేదని తెలిపింది. అలా చేస్తే తప్పుడు సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందని పేర్కొంది. వారి వివాహ హోదాను ప్రశ్నించలేమని పేర్కొంది. ఏది మంచో చెడో అలోచించే అవకాశం హదియాకు ఉందని మిశ్రా పేర్కొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తొలి రోజే రావత్‌కు చేదు అనుభవం

న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఓపి రావత్ తొలి రోజే చేదు అనుభవం ఎదురయ్యింది. ఆప్ ఆయనపై నిప్పులు చెరిగింది. లాభదాయక పదవులు నిర్వహిస్తున్నందునే ఢిల్లీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడిందని ఆయన పేర్కొనడాన్ని ఆప్ తప్పు పట్టింది. ఈ అంశంపై ఎమ్మెల్యేలను విచారించలేదని పేర్కొంది. గత ఏడాది సెప్టెంబరు 28, నవంబరు 2 తేదీలలో రెండు సార్లు నోటీసులు ఇచ్చినప్పటికి ఈ విషయమై విచారణ జరపాలని ఆప్ ఇసిని కోరలేదని ఒక వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రావత్ చేసిన వ్యాఖ్యలతో ఆప్ నేత రాఘవ్ చద్దా విబేధించారు. తమ పార్టీ రెండు సార్లు స్పందించిందని పేర్కొన్నారు. రావత్ అబద్ధాలు చెబుతున్నారన్నారు. ఎమ్మెల్యేలపై విచారణ జరపాలని కోరుతూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశామన్నారు. లిఖితపూర్వకంగా, మౌఖికంగా విజ్ఞప్తి చేసినప్పటికీ ఎన్నికల కమిషన్ స్పందించలేదన్నారు. ఎమ్మెల్యేలపై విచారణ ఎందుకు జరపలేదని ప్రశ్నించారు. చట్ట ప్రకారం నడుచుకోవలసిన అవసరం ఎన్నికల కమిషన్‌కు ఉందన్నారు. కాని తమ విషయంలో ఇంతకుముందెన్నడూ లేని విధంగా జరిగిందన్నారు. ఆప్ విషయంలో సహజ న్యాయ సూత్రాలు ఉల్లంఘనకు గురయ్యాయన్నారు. అయితే ఆప్‌కు ఇచ్చిన నోటీసు చాలా సమగ్రంగా ఉందని, నోటీసు ఇచ్చిన సందర్భంలో ఆ పార్టీ స్పందించలేదని రావత్ అన్నారు. ఈ అంశం న్యాయ వ్యవస్థ పరిధిలో ఉన్నందున, దీని గురించి ఇంతకుమించి మాట్లాడలేమని రావత్ తెలిపారు.

స్థాయి తక్కువ ఉద్యోగాలతో పెరుగనున్న పాక్షిక నిరుద్యోగం

న్యూఢిల్లీ : ఆసియా పసిఫిక్ ప్రాంతంలో 2017-2019 కాలంలో 23 మిలియన్ల ఉద్యోగాలు కల్పించబడతాయని, దక్షిణ ఆసియా దేశాల్లో ఉపాధి పెరుగుదలకు దోహదపడుతుందని ఇప్పటి వరకూ అంచనా వేశారు. అయితే తాజా వార్తల ప్రకారం 2019 నాటికి దక్షిణాసియా ఉద్యోగుల్లో 72 శాతం మంది స్థాయి తక్కువ ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటారు. స్థాయి తక్కువ ఉద్యోగాలతో నిరుద్యోగం ప్రబలుతుందని మంగళవారం విడుదల చేసిన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ప్రపంచ ఉపాధి నివేదిక హెచ్చరించింది. 'ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారీ సంఖ్యలో ఉద్యోగాలు కల్పించబడతాయి. కానీ ఇందులో ఎక్కువ శాతం స్థాయి తక్కువ ఉద్యోగాలు. ఈ ప్రాంతం ఉద్యోగుల్లో సుమారు సగం మంది ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొంటారు. భారత్‌లో ఉద్యోగాల కల్పనపై మరింత దృష్టి పెట్టాల్సి వుంటుందని నివేదిక హెచ్చరించింది. భారత్‌లో ప్రతీ ఏడాది 12 మిలియన్ల మంది ఉద్యోగాల వేటకు బయలుదేరతారని తెలిపింది. భారత్‌లో ఆర్థిక వృద్ధి కనిపించినా ప్రజలు నిరుద్యోగంతో బాధపడుతుంటారని నివేదిక వెల్లడించింది. పని చేస్తున్నా ప్రజలు పేదరికంతో బాధపడుతుంటారని తెలిపింది.

యుపి బిజెపి నేతలపై కేసుల రద్దుకు యత్నాలు

లక్నో/న్యూఢిల్లీ : తమ పార్టీ నాయకులపై కేసులను రద్దు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో ఉత్తర ప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం వెనక్కి తగ్గింది. కేసుల రద్దు విషయంలో తాము సంబంధిత ప్రక్రియను అనుసరిస్తున్నామని పేర్కొంది. ముజఫర్ నగర్‌లో 2013లో ఘర్షణలు జరగడానికి ముందు అసభ్యకర ప్రసంగాలు చేసిన బిజెపి నేతలపై కేసులు నమోదయ్యాయి. ఆ కేసులను ఉపసంహరించాలని కోరుతూ ముజఫర్ నగర్‌లోని అధికారులకు ప్రభుత్వం లేఖ రాసిందని మీడియాలో కథనాలు రావడంతో ఈ అంశం వివాదాస్పదమయ్యింది. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ కేసులు ఉపసంహరించాలని కోరుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి నాయకులలో ఒకరైన బుధన ఎమ్మెల్యే ఉమేష్ మాలిక్‌తో ఒక దరఖాస్తును పంపామని తెలిపింది. కేసులను వెనక్కి తీసుకోవాలని సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ ఆలోచిస్తున్నారా? ప్రజా ప్రయోజనాల కోసం వాటిని ఉపసంహరించుకోవాలని జిల్లా మెజిస్ట్రేట్ ఆలోచిస్తున్నారా? అని ఆ లేఖలో ప్రశ్నించారు. ఆ లేఖపై న్యాయ శాఖ స్పెషల్ సెక్రటరి రాజేష్ సింగ్ సంతకం ఉంది. మొత్తం మీద ఐదుగురు ప్రముఖ బిజెపి, సంఘ్ పరివార్ నేతలపై అసభ్యకర ప్రసంగాలు చేశారన్న అభియోగాలపై నమోదైన 9 ఎఫ్ఐఆర్‌లను ఉప సంహరించుకోవడంపై అది తన అభిప్రాయాన్ని కోరింది.

మాలిక్‌తో పాటు ముజఫత్ నగర్ బిజెపి ఎంపి సంజీవ్ బలియాన్, షమ్లీ బిజెపి ఎమ్మెల్యేల సురేష్ రాణా, బిజ్నోర్ బిజెపి ఎంపి భరతేంద్రసింగ్, విశ్వహిందూ పరిషత్ సభ్యుడు సాధ్వి ప్రాచీలపై అసభ్య ప్రసంగం చేసినట్లు అభియోగాలు నమోదయ్యాయి.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న మాణిక్ సర్కార్



మహిళలతో కరచాలనం చేస్తున్న బృందాకరత్

సమరోత్సాహంలో త్రిపుర లెఫ్ట్‌ఫ్రంట్

- అన్ని స్థానాలకూ అభ్యర్థుల ప్రకటన
- మహిళలకు ఏడు స్థానాలు
- 12 మంది కొత్తవారికి చోటు

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - అగర్తల

త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాను లెఫ్ట్‌ఫ్రంట్ మంగళవారం విడుదల చేసింది. మొత్తం 60 స్థానాలకు గాను సిపిఎం 57 స్థానాల్లోనూ, సిపిఐ, ఆర్ఎస్‌పి, ఫార్వర్డ్‌బ్లాక్ ఒక్కొక్క స్థానంలోనూ పోటీ చేయనున్నాయి. వీటిలో ఏడు స్థానాలను మహిళలకు కేటాయించారు. 12 స్థానాల్లో కొత్తవారికి చోటు కల్పించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలలో నిరంజన్ దేవ్‌వర్మ (తకర్జల), లలిత్ దేవ్‌వర్మ (అంబస్స), ఫైజుర్ రెహ్మాన్ (కడంతల-కుర్తి), సుబోధ్ దాస్ (పణిసాగర్), అరుణ్ కుమార్ చక్మా (పెఛార్తల్)లను ఈ సారి పోటీ నుంచి మినహాయించారు. త్రిపురలో ఉగ్రవాద సంస్థ ఐపిఎఫ్‌టితో చేతులు కలిపి బిజెపి హింసాత్మక దాడులకు తెగబడుతూ వస్తున్న నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాద, మతోన్మాద కూటమిని ఓడించి వామపక్ష కూటమిని తిరిగి ఎన్నుకోవాలని ప్రజలకు లెఫ్ట్‌ఫ్రంట్ పిలుపునిచ్చింది.

జనసంద్రాలుగా లెఫ్‌ఫ్రంట్ ప్రచారసభలు

వామపక్ష అభ్యర్థుల ప్రకటనతో త్రిపుర అంతటా లెఫ్ట్‌ఫ్రంట్ శ్రేణుల్లో సమరోత్సాహం కనిపించింది. త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు, సిఐటియు ప్రధానకార్యదర్శి తపన్ సేన్ తదితరుల నేతృత్వంలో నిర్వహించిన బహిరంగ సభలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సభలన్నీ అరుణ పతాకాలతో ఎర్రని జనసంద్రాలను తలపించాయి.

హపనియాలోని డుక్లీ సబ్ డివిజన్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో మానిక్ సర్కార్ ప్రసంగించారు. ఎనిమిదో వామపక్ష కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసితీరుతామని బహిరంగ సభకు తరలివచ్చిన వేలాది మంది ప్రజలు నినాదాలు చేశారు. ఆర్థికశాఖ మంత్రి బానులాల్ షా పోటీ చేస్తున్న బిషాల్‌ఘర్ నియోజకవర్గంలో బృందాకరత్ బహిరంగ సభ నిర్వహించారు. లెఫ్ట్‌ఫ్రంట్ తరపున సిపిఎం అభ్యర్థి రామేంద్ర నారాయణ్ పోటీ చేస్తున్న చరిలాం స్థానంలో నిర్వహించిన బహిరంగసభలో సుభాషిణి అలీ ప్రసంగించారు.

పెట్టుబడుల ఆకర్షణలో భారత్‌కు ఐదో స్థానం

పిడబ్ల్యుసి సర్వేలో వెల్లడి

దావోస్: పెట్టుబడుల ఆకర్షణలో ప్రపంచ దేశాలలో భారత్‌కు ఐదో స్థానం దక్కింది. పెట్టుబడుల ఆకర్షణ, ప్రపంచ ఆర్థిక ప్రగతిపై ఆశావహ దృక్పథంతో రికార్డు స్థాయిలో వృద్ధి చెందుతున్న భారత్ మార్కెట్‌కు తమ సర్వేలో ఐదో స్థానం లభించిందని గ్లోబల్ కన్సల్టెన్సీ సంస్థ ప్రైస్‌వాటర్ కూపర్స్ (పిడబ్ల్యుసి) తన అధ్యయన నివేదికలో పేర్కొంది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) వార్షిక సదస్సు నేపథ్యంలో పిడబ్ల్యుసి మంగళవారం ఈ నివేదికను విడుదల చేసింది. పెట్టుబడుల ఆకర్షణలో అమెరికా అగ్రస్థానంలో నిలిచిందని, అయితే భారత్ టాప్ ఫైవ్ జాబితాలో చేరటం విశేషమని ఈ సర్వేలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్థిక, వ్యాపార పరిస్థితులపై భారత్ సిఇఒలలో విశ్వాసం, ఆశావహ దృక్పథమే ఇందుకు కారణమని వివరించారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన వ్యాపార, వాణిజ్య సంస్థల సిఇఒలలో 46 శాతం మంది అమెరికా పెట్టుబడుల ఆకర్షణలో అగ్రభాగాన వుందని చెప్పగా చైనాకు 33 శాతం మంది, జర్మనీకి 20 శాతం మంది, బ్రిటన్‌కు 15 శాతం మంది మొగ్గు చూపారు. భారత్ వైపు 9 శాతం మంది దృష్టి సారించగా తరువాతి స్థానం దక్కించుకున్న జపాన్‌వైపు 8 శాతం మంది సిఇఒలు సానుకూలత వ్యక్తం చేశారని ఈ నివేదికలో పేర్కొన్నారు. గత ఏడాదికాలంగా భారత్ అనుసరిస్తున్న వ్యవస్థాగత సంస్కరణలు దేశాన్ని మెరుగైన స్థానానికి చేర్చాయని పిడబ్ల్యుసి ఇండియా ఛైర్మన్ శ్యామ్‌లాల్ ముఖర్జీ చెప్పారు. 54 శాతం మంది తమ ఉద్యోగుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా కేవలం 18 మంది మాత్రమే సిబ్బందిని తగ్గించుకోవటంపై దృష్టి పెట్టారని ఈ సర్వే వెల్లడించింది.



సోహ్రాబుద్దీన్ కేసులో అమిత్‌షా విముక్తిపై పిల్

కోర్టులో వ్యతిరేకిస్తామన్న సిబిఐ

ముంబయి: గుజరాత్‌లో జరిగిన సోహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో ప్రధాన నిందితుడైన బిజెపి ప్రస్తుత అధ్యక్షుడు అమిత్‌షాను నేరారోపణల నుండి విముక్తి చేయటానికి వ్యతిరేకంగా దాఖలైన ప్రజా ప్రయోజనవ్యాజ్యాన్ని తాము కోర్టులో వ్యతిరేకిస్తామని కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) వెల్లడించింది. సోహ్రాబుద్దీన్ కేసులో అమిత్‌షాను విముక్తి చేస్తూ దిగువ కోర్టు వెలువరించినతీర్పును సవాలు చేయరాదన్న సిబిఐ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముంబయి హైకోర్టులో పిల్ దాఖలైన విషయం తెలిసిందే. అమిత్‌షాను కేసు నుండి విముక్తిచేస్తూ సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం 2014 డిసెంబర్ 30న వెలువరించిన తీర్పును ఎగువ కోర్టులో సవాలు చేయరాదన్న సిబిఐ నిర్ణయం చట్ట వ్యతిరేకం, ఏకపక్షం, దురుద్దేశ పూరితమని ఈ పిటిషన్ దాఖలు చేసిన ముంబయి లాయర్స్ అసోసియేషన్ విమర్శించింది. దీనిపై సిబిఐ తరపు న్యాయవాది అనిల్ సింగ్ మాట్లాడుతూ ఈ పిటిషన్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని, అసలు ఈ పిటిషన్ విచారణార్హతపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని చెప్పారు. దీనిపై సిబిఐ తరపు న్యాయవాది గడువు కోరటంతో ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేస్తూ న్యాయమూర్తులు ఎస్‌సి ధర్మాధికారి, భారతి డాంగ్రేతో కూడిన ధర్మాసనం నిర్ణయం వెలువరించింది. ఇంతకు ముందు ఈ కేసు విచారణను గుజరాత్ హైకోర్టు నుండి ముంబయి హైకోర్టుకు మారుస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.



న్యాయం చేయండి...లేక పోతే ఆత్మహత్యే!

ప్రధాని మోడీకి, యోగి ఆదిత్యనాథ్‌కు రక్తంతో బాధితురాలు లేఖ

రాయ్‌బరేలి : తనకు న్యాయం చేయాలని కోరుతూ ఒక అత్యాచార బాధితురాలు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు రక్తంతో లేఖ రాసింది. తన ఆ స్థితికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. "నిందితులు పోలీసులపై చర్యలు తీసుకో లేదు. పోలీసులకు, నిందితులకు సంబంధాలున్నా యి. కేసు ఉపసంహరించు కోవాలని నిందితులు నాపై ఒత్తిడి తెస్తున్నారు. నాకు న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకుంటాను" అంటూ ఇంజనీరింగ్ విద్యార్థిని అయిన బాధితురాలు ఈ నెల 20న త న లేఖలో పేర్కొంది.బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్చి 24, 2017న ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎఎస్‌పి శశి శేఖర్ సింగ్ తెలిపారు. నిందితులు దివ్య పాండే, అంకిత్ వర్మలపై అత్యాచార అభియోగాలను కూడా నమోదు చేసినట్లు సింగ్ తెలిపారు. నిందితులు తన కుమార్తెపై అత్యాచారం జరపడమే కాకుండా బ్లాక్‌మెయిల్‌కు కూడా పాల్పడుతున్నారని బాధితురాలి తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.రాయబరేలిలో గుర్తు తెలియని వ్యక్తులపై మరొక ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. బాధితురాలి పేరుతో ఫేస్‌బుక్ ఖాతాను ప్రారంభించి అశ్లీల ఫొటోలను పోస్ట్ చేసిన సంఘటనపై ఈ కేసు నమోదు చేసినట్లు సింగ్ తెలిపారు.

యుపిలో దళిత బాలిక సజీవ దహనం

లక్నో : 19 సంవత్సరాల దళిత బాలికను సజీవ దహనం చేసిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌ఘర్ జిల్లా, లాల్‌గంజ్ ప్రాంతంలో జరిగింది. పాత కక్షలతో అదే ప్రాంతానికి చెందిన ఒక తండ్రీకొడుకులు ఈ దారుణానికి పాల్పడ్డారు. లాల్‌గంజ్ ప్రాంతానికి చెందిన మైథిలిలాల్ కుమార్తె అంజు. ఈమె ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో కిరోసిన్ పోసి మంటలు వెలగించారు. ఈ కేసులో తండ్రికొడుకులు కల్లూ, దీపూలను అరెస్టు చేశారు.

అనంత్‌కుమార్ వ్యాఖ్యలపై అథవాలే అభ్యంతరం

ముంబయి: తన విమర్శకులను 'మొరిగే కుక్కలు' అంటూ కేంద్ర మంత్రి అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలపై ఆయన సహచర మంత్రి, దళిత నేత రామదాస్ అథవాలే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'హెగ్డే ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియటం లేద'ని అథవాలే మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇంతకు ముందు రాజ్యాంగాన్ని తిరగరాస్తామన్నారని, ఇప్పుడు కొరేగావ్‌భీమా ఘటనపై విమర్శలు చేస్తున్న వారిని మొరిగే కుక్కలంటున్నారని మండిపడ్డారు. తరచు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న మంత్రి అనంత్‌కుమార్‌పై వెంటనే చర్య తీసుకోవాలని ఆయన ప్రధానిని కోరారు. దళితులపై హెగ్డే అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని, అవి ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని అథవాలే తన ప్రకటనలో స్పష్టం చేశారు. కాగా హెగ్డే మాత్రం తాను దళితులను కించపరుస్తూ ఎటువంటి వ్యాఖ్యలూ చేయలేదని, తన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు ఉద్దేశపూర్వకంగానే వక్రీకరిస్తున్నారని విమర్శించారు.

హిందూత్వ నేత మిలింద్‌కు బెయిల్ నిరాకరణ

పుణే : భీమా-కొరేగావ్ హింసాకాండ కేసులో హిందూత్వ నేత మిలింద్ ఎక్బోతేకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి పుణే కోర్టు మంగళవారం నిరాకరించింది. భీమా-కొరేగావ్ యుద్ధం ద్విశాతాబ్ది వేడుకల సందర్భంగా ఈ నెల 1 జరిగిన హింసాకాండ కేసులో మిలింద్ నిందితుడుగా వున్నాడు. ముందస్తు బెయిల్ కోసం కోర్టులో మిలింద్ దాఖలు చేసి పిటిషన్‌ను జిల్లా జడ్జి పి.సి. భాగురే తిరస్కరించారు.

ఈ ఘటనకు సంబంధించి మిలింద్‌తోపాటు, హిందూ ఎక్తా అజాది అధ్యక్షుడు సాంభాజీపైనా కేసులు నమోదయ్యాయి. వీరు ప్రేరేపించిన ఆ హింసాకాండ ఒక వ్యక్తి మృతికి కారణమైందని పుణేకు చెందిన బహుజన్ రిపబ్లికన్ సోషలిస్టు పార్టీ సభ్యుడు ఫిర్యాదు చేశారు. పేష్వా సైనికులతో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ సైన్యం విజయం సాధించింది. బ్రిటిష్ సైన్యం తరుపున దళితులు ఈ యుద్ధంలో పాల్గొన్నారు. తమ యోధులకు గుర్తుగా దళిత సంఘాలు ఈ వేడుకలను జరుపుకుంటాయి. ఈ వేడుకలను హిందుతత్వవాదులు వ్యతిరేకిస్తూ వారిపై దాడికి దిగారు. ఈ హింసాకాండలో ఒక వ్యక్తి మృతి చెందాడు.

బిజెపిని వీడనున్న అశీష్ దేశ్‌ముఖ్

ముంబయి : నాగపూర్‌కు చెందిన మరో బిజెపి ఎమ్మెల్యే అశీష్ దేశ్ ముఖ్ పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైన, ప్రత్యేక రాష్ట్రం కావాలని ఎంతోకాలంగా ప్రజలు చేస్తున్న డిమాండ్‌పైన ప్రభుత్వానికి నిబద్ధత కొరవడిన నేపథ్యంలో పార్టీకి రాజీనామా చేయాలనుకుంటున్నట్లు అశీష్ దేశ్‌ముఖ్ తెలిపారు. ఈ విషయమై ఆయన ద వైర్ పత్రికతో మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీల మేరకు వారు బిజెపిని అధికారంలో కూర్చోబెట్టారన్నారు. ప్రత్యేక విదర్భ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కూడా మద్దతు తెలిపారన్నారు. కాని పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ విషయమై ఆయన మౌనంగా ఉన్నారని విమర్శించారు.

మహిళపై భర్త ముందే అఘాయిత్యం

గురుగ్రామ్: మహిళలు ఒంటరిగా వెళున్నప్పుడే కాదు.. సొంతవారితో ఉన్నప్పుడు కూడా వారికి రక్షణ లేకుండా పోతోంది. భర్త, తండ్రి, సోదరుడి కళ్ల ముందే వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. హరియాణాలోని గురుగ్రామ్‌లో భర్త, బావ కళ్లముందే ఓ మహిళపై లైంగిక దాడి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురుగ్రామ్‌కు చెందిన 22ఏళ్ల మహిళ తన భర్త, బావతో కలిసి ఓ వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా, రెండు కార్లలో వచ్చిన నలుగురు యవకులు వారిని అడ్డుకున్నారు. అందులోని ఓ వ్యక్తి మహిళను కారు నుంచి బయటకు లాగి సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళ భర్త, బావను మిగతా ముగ్గురు యువకులు తుపాకీ పెట్టి బెదిరించారు. ఘటన అనంతరం నలుగురు యువకులు అక్కడి నుంచి పారిపోయారు. మహిళ భర్త నిందితుల కారు నంబరును నోట్ చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. కాగా గతంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌షహార్ ప్రాంతంలో కారులో వెళ్తున్న ఓ కుటుంబాన్ని దుండగులు అడ్డుకుని తల్లీకూతుళ్లపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే.

రెడ్ కార్పెట్ పరిచాం.. రండి!

మొదటి పేజీ తరువాయి

చరమగీతం పాడటంతో పాటు ఆంక్షలన్నీ ఎత్తివేశామని, 'రెడ్ టేప్ తొలగించి, రెడ్ కార్పెట్ పరిచామ'ని మోడీ చెప్పారు. ఏ దేశానికి ఆదేశం స్వీయ కేంద్రీకరణ అభివృద్ధి పంథాలను అనుసరించడం వల్ల ప్రపంచీకరణ కుచించుకు పోతోందని, దీనివల్ల ప్రపంచానికి నష్టం జరగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాదం, పర్యావరణ మార్పులు, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలపైనా ప్రధాని ప్రసంగించారు.

పర్యావరణ మార్పులు, ఉగ్రవాదం, స్వీయ కేంద్రీకరణే పెను సవాళ్లు

పర్యావరణ మార్పులు, ఉగ్రవాదం, స్వీయ కేంద్రీకరణ ధోరణులు ప్రస్తుతం ప్రపంచం ముందు నిలిచిన అతి పెద్ద సవాళు అని, వీటిని ఐక్యంగా ఎదుర్కొనాలని ప్రపంచ నేతలకు, సిఇఒలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు నిచ్చారు. ఉగ్రవాదం ప్రమాదకరమైనదని, 'మంచి' ఉగ్ర వాదానికి, 'చెడు' ఉగ్రవాదానికి తేడా ఉంటుందంటూ కొందరు చెబుతుంటారని, అది చాలా అధ్వాన్నమని మోడీ అన్నారు.

కొంతమంది యువత తీవ్రవాదానికి ఆకర్షితు లవ్వడం బాధ కలిగిస్తోందన్నారు. సమగ్ర అంచనా, స్థిరత్వం, పారదర్శకతతోనే భారత్ ముందుకెళ్తుందని, లేదంటే అనిశ్చితి పరిస్థితులు ఎదుర్కొవాల్సివస్తుందని మోడీ చెప్పారు.

ఆరు రెట్లు పెరిగిన జిడిపి

ఇదే ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆఖరి సారిగా భారత ప్రధానమంత్రి 21 ఏళ్ల కిందట పాల్గొన్నారని, అప్పటికీ ఇప్పటికీ భారత్ ఎంతో ప్రగతి సాధించిందని మోడీ చెప్పారు. 1997లో భారత జిడిపి 400 బిలియన్ డాలర్ల కంటే కాస్త ఎక్కువ ఉండేదని, అదిప్పుడు ఆరింతలు పెరిగిందని వివరించారు.

బహుళత్వంలో ఏకత్వమే మా బలం

బహుళత్వమే భారత్ బలమని మోడీ చెప్పారు. ప్రజాస్వామ్యం, వైవిధ్యం కలిగియున్న భారత్ తమకెంతో గర్వకారణమన్నారు. భారత్ ఎప్పుడు కూడా ఏ ఒక్కరి భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేయలేదని చెప్పారు. సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పేందుకే తాము అనేక దేశాలతో పనిచేస్తున్నామని చెప్పారు. బహుళ సంస్కృతులనే తాము విశ్వసిస్తామని, బహుళత్వ ప్రపంచంలోనూ ప్రజ లంతా ఐక్యంగా ఉండగలరని తమ దేశం నిరూపించిందని మోడీ చెప్పారు. బేటీ బచావో..బేటీ పడావో, జన్ ధన్ యోజన, డిజిటల్ ఇండియా తదితర పథకాల గురించి కూడా మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించారు.

గత శతాబ్దం రెండు ప్రపంచ యుద్ధాలను చవిచూసిందని, ఏ కూటమితోనూ భారత్‌కు భాగస్వామ్యం లేకున్నా భారత సైనికులు ఎంతో మంది ఆ యుద్ధాల్లో అమరులయ్యారని మోడీ చెప్పారు. నేటికీ అదే స్ఫూర్తితో ఐక్యరాజ్యసమితి శాంతిరక్షణ కార్యక్రమంలో భారత సైనికులు ఎంతో మంది సేవలందిస్తున్నారని మోడీ కొనియాడారు. ప్రకృత్తి విపత్తులు వచ్చిన తక్షణమే స్పందించే దేశాలలో భారత్ ముందుంటుందన్నారు. నేపాల్ భూకంపం, యెమెన్ సంక్షోభం వంటి సందర్భాల్లో భారత్ అందించిన సేవలను ఈ సందర్భంగా ఉదహరించారు.

సమగ్రత, ఐక్యతా విలువలపైనే మా విశ్వాసం

భారత్ ఎల్లప్పుడు సమగ్రత, ఐక్యతా విలువలనే భారత్ విశ్వసిస్తుందని మోడీ చెప్పారు. ప్రపంచంలో ఆర్థికంగానూ, రాజకీయంగానూ వేగంగా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని, శాంతి, స్థిరత్వం, భద్రత ప్రస్తుతం చాలా తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ రచించిన 'ఎక్కడైతే మనస్సు నిర్భయంగా ఉంటుందో..ఎక్కడైతే విజ్ఞానం స్వేచ్ఛగా మనగలదో..' పద్యాన్ని చదివి వినిపించిన మోడీ అలాంటి 'స్వేచ్ఛా స్వర్గానికి ప్రపంచాన్ని తీసుకెళ్లేందుకు ఐక్యంగా చేతులు కలుపుదా'మంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

మన స్వరం పెరిగింది : చంద్రబాబు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగానికి ముందు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఓ జాతీయ వార్తా సంస్థతో మాట్లాడారు. గతంలో కంటే ప్రస్తుతం మన స్వరం పెరిగిందని ఆయన చెప్పారు. 'మన స్వరాన్ని పెంచుతున్నాం. అది కూడా బిగ్గరగా. గతంలో మన వాళ్లు కాస్త జంకుతో ఉండేవాళ్లు. ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై మన ప్రధాని కీలక ప్రసంగాలు చేస్తున్నారు. గతంలో ప్రధానమంత్రులు, ఇతర రాజకీయ నాయకులు వివిధ కారణాలతో జంకుతో ఉండేవాళ్లు' అని చంద్రబాబు చెప్పారు.

భారత విందుకు అతిరథ, మహారథులు

సోమవారం రాత్రి భారత్ ఆతిథ్యమిచ్చిన విందుకు మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల, రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ, ఎయిర్‌బస్ సిఇఒ డిర్క్ హోకే సహా 18 దేశాల నుంచి దాదాపు 40 మంది ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు హాజరయ్యారు. ప్రధాని వీరందరినీ పేరుపేరునా పలకరిం చారు. ఒక్కొక్కరితో విడివిడిగా సమావేశమై భారత్‌లో పెట్టు బడులను ఆకర్షించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సింది గా కోరారు. అంతకుముందు ఆయన స్విట్జర్లాండ్ అధ్యక్షులు అలయిన్ బెర్సెట్‌తో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబం ధాలు మరింత బలోపేతం కావడానికి ఇరువురి నేతల సమావేశం దోహదం చేస్తుందని భారత విదేశాంగ శాఖ ట్విట్టర్‌లో పేర్కొంది.

సైడ్‌లైన్స్

- 1997లో హెచ్‌డి దేవేగౌడ తర్వాత డబ్ల్యుఇఎఫ్ సదస్సు లో భారత ప్రధానమంత్రి పాల్గొనడం ఇదే తొలిసారి.
- డబ్ల్యుఇఎఫ్ సదస్సు ప్లీనరీ సమావేశంలో భారత ప్రధాని కీలక ప్రసంగం చేయడం కూడా ఇదే మొదటిసారి.
- 48 ఏళ్ల ప్రపంచ ఆర్థిక వేదిక చరిత్రలో ఈ సారి భారత్ నుంచి అత్యధిక మంది హాజరవ్వడం విశేషం.
- ప్రధాని మోడీ హిందీలో ప్రసంగించారు. 'నమస్తే' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించగానే సభలో హర్షద్వానాలు మార్మోమోగాయి.
- మోడీ తన ప్రసంగంలో విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ కవితలను ఉదహరించారు. స్వేచ్ఛా స్వర్గంగా భారత్‌ను టాగూర్ అభివర్ణించారని పేర్కొన్నారు.

జపాన్‌లో పేలిన అగ్ని పర్వతం

టోక్యో : సెంట్రల్ జపాన్‌లోని అగ్నిపర్వతంపై వాలు ప్రాంతాల్లో స్కీయింగ్ (మంచుపై నడవడం) చేస్తున్న 16 మంది ఆకస్మికంగా అగ్నిపర్వతం పేలడం, ఆ వెనువెంటనే మంచుపెళ్ళలు విరిగిపడిన ఘటనలో గాయపడ్డారు. అనంతరం వారిలో ఒకరు తీవ్ర గాయాలతో మరణించారని అధికారులు తెలిపారు. మరణించిన వ్యక్తితో సహా ఆరుగురు వ్యక్తులు, మరో 30మంది జపాన్ సైనికులు స్కీయింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. ముందుగా అగ్నిపర్వతం పేలిందని, ఆ తర్వాత అరగంట లోపునే మంచుపెళ్ళలు విరిగిపడ్డాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు.



ప్రమాణం

అధ్యక్ష ఎన్నికలలో విజయం సాధించిన జార్జ్‌వా లైబీరియా అధ్యక్షునిగా జనవరి 23న పదవీస్వీకార ప్రమాణం చేశారు.

వన్ బెల్ట్, వన్ రోడ్ ప్రాజెక్టుతో చేతులు కలపండి

సెలాక్ సభ్య దేశాలకు చైనా పిలుపు

శాంటియాగో : వన్ బెల్ట్, వన్ రోడ్ ప్రాజెక్టులో చేరాల్సిందిగా లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలను చైనా ఆహ్వానించింది. చారిత్రకంగా చూసినట్లైతే అమెరికా ప్రభావం అధికంగా వుండే ఈ ప్రాంతంలో దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ సహకారాన్ని మరింత విస్తృతం చేసే ఒప్పందంలో భాగంగా ఇందులో చేరాలని చైనా సోమవారం కోరింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మాట్లాడుతూ, ఈ చొరవ చేపట్టడానికి ఈ ప్రాంతం సహజసిద్ధంగా అనువైనదని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టు కారణంగా అభివృద్ధి చెందుతున్న దేశాలతో ఆర్థిక, ద్రవ్య సహకారం పెంపొందించుకోవాలన్నది చైనా లక్ష్యంగా వుంది. శాంతియుత అభివృద్ధి పంథాకే చైనా ఎప్పుడూ కట్టుబడి వుంటుందని వాంగ్ పేర్కొన్నారు. అన్ని దేశాలతో అభివృద్ధి ఫలాలను పంచుకునేందుకు, సమాన అవకాశాలు అందిపుచ్చుకునేందుకు చైనా సుముఖంగా, సంసిద్ధంగా వుందని అన్నారు. లాటిన్ అమెరికా, కరేబియా దేశాల సమాఖ్య (సెలాక్) కి చెందిన 33 సభ్య దేశాలతో జరిగిన సమావేశంలో వాంగ్ ప్రసంగించారు. చైనా, సెలాక్ ప్రతినిధుల మధ్య సంబంధాల విస్తరణకు స్థూల ఒప్పందం కుదిరింది. దీన్నే శాంటియాగో డిక్లరేషన్‌గా పిలుస్తున్నారు. ట్రంప్ సర్కార్ మరింత రక్షణవాద వైఖరిని తీసుకుంటున్న తరుణంలో చైనా, లాటిన్ అమెరికాలో సంబంధాలు పెంచుకోవడంతో కూడిన విదేశాంగ వైఖరిని తీసుకుంటోంది.

లాటిన్ అమెరికా దేశాల మధ్య పటిష్ట సంబంధాలు

హవానా : లాటిన్ అమెరికా దేశాల ప్రజల మధ్య సంబంధాలు సమగ్రంగా వుండేలా, మరింత బలోపేతమయ్యేలా చూడడం కొత్త ఏడాదిలో బొలివారియన్ విప్లవం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్ళలో ఒకటని క్యూబాలో వెనిజులా రాయబారి అలీ రొడ్రిగెజ్ సోమవారం పేర్కొన్నారు. అవకాశం దొరికితే అమెరికా సామ్రాజ్యవాదం విభేదాలు సృష్టించేందుకు వెనుకాడబోదని, అందువల్ల లాటిన్ అమెరికా దేశాల మధ్య సంబంధ బాంధవ్యాలు పటిష్టంగా వుండడం ఎంతైనా ముఖ్యమని ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో ఆయన పేర్కొన్నారు. దేశ ఆర్థిక, రాజకీయ సుస్థిరతకు హామీ కల్పించడం, ఈ ప్రాంత దేశాలతో పరస్పర మార్పిడులు, సంబంధాలు కొనసాగించడం ప్రస్తుతం అధ్యక్షుడు నికొలస్ మదురో ముందున్న కర్తవ్యమని చెప్పారు.

ఆఫ్రికాలో ఐక్య వైమానిక రవాణా మార్కెట్

అడిస్ అబాబా : ఆఫ్రికాలో ఐక్య వైమానిక రవాణా మార్కెట్(ఎస్ఎఎటిఎం)ను ఏర్పాటు చేయాలనేది ఆఫ్రికన్ యూనియన్ (ఎయు) లక్ష్యంగా వుంది. పౌర విమానయాన రంగాన్ని మరింత సరళీకరించడం, ఆఫ్రికన్ ఆర్థిక సమగ్ర ఎజెండాకు మరింత ఊతమివ్వడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ వారంలో ఇక్కడ జరగబోయే ఉన్నత స్థాయి సదస్సులో ఎస్ఎఎటిఎంను అధికారికంగా ప్రకటించనున్నట్లు ఇథియోపియా మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రాంతీయ వైమానిక రంగం ఎదుర్కొంటున్న పలు సవాళ్ళను పరిష్కరించడం, ఆఫ్రికా దేశాల మధ్య వాణిజ్యం ఈ చొరవ లక్ష్యంగా వుంది. అవినీతిపై పోరు సల్పడమే ప్రధాన లక్ష్యంగా మంగళవారం నుండి శనివారం వరకు సదస్సు జరుగుతుంది. ఈ నెల 25, 26 తేదీల్లో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరుగుతుంది.

సెనేటర్ల మధ్య కుదిరిన అంగీకారం

వాషింగ్టన్ : అమెరికన్ కాంగ్రెస్‌లో ఆర్థిక బిల్లుపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య అవగాహన కుదరటంతో గత కొద్దిరోజులుగా తలెత్తిన ప్రతిష్టంభనకు తెరపడింది. సెనేట్ మెజారిటీ పక్ష నేత మిచ్ మెక్ కానెల్‌తో ఈ మేరకు అవగాహన కుదిరిందని సెనేట్ డెమొక్రాటిక్ పార్టీ నేత చుక్ స్కమ్మర్ చెప్పారు. వలస వ్యవహారాలు, సరిహద్దుల రక్షణపై అధికార రిపబ్లికన్, ప్రతిపక్ష డెమొక్రాటిక్ పార్టీల మధ్య ఏర్పడిన విభేదాలతో ఆర్థిక బిల్లును సెనేట్ తిరస్కరించటం తో అమెరికా ప్రభుత్వం గత మూడు రోజులుగా మూత పడిన విషయం తెలిసిందే. ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిత్వా నికి ప్రయత్నించిన సెనేటర్లు బిల్లుపై తలెత్తిన విభేదాల విషయంలో ఇరు పార్టీల సెనేటర్ల మధ్య అవగాహన కుదిరి నట్లు సోమవారం రాత్రి ప్రకటించారు. దీనితో సెనేట్‌లో ఈ బిల్లు ఆమోదం పొందటానికి మార్గం సుగమమైంది. తద్వారా ప్రభుత్వం తన దైనందిన కార్యకలాపాలను పున: ప్రారంభించేందుకు వీలు ఏర్పడింది. వారం మొదటి రోజునే ప్రభుత్వ కార్యకలాపాలు నిలిచిపోవటంతో లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ నిధులు అందక తమ కార్య కలాపాలను నిలిపివేశారు. అయితే భద్రత, రక్షణ వంటి అత్యవసర విభాగాలు మాత్రం తమ కార్యకలాపాలను యధావిధిగా కొనసాగించాయి. వలస వచ్చిన స్వాప్నికుల (డ్రీమర్స్) విషయంలో డెమొక్రాటిక్ పార్టీ వ్యక్తం చేసిన ఆందోళనతో దీనిపై దిద్దుబాటుచర్యలు చేపట్టేందుకు రిపబ్లికన్ పార్టీ నేతలు హామీ ఇచ్చారని సెనేట్‌లో మెజార్టీ పక్షనేత మిచ్ మెక్ కానెల్ వివరించారు. ఇదే విషయాన్ని సెనేట్‌లో డెమొక్రాటిక్ పక్ష నేత చుక్ స్కమర్ కూడా మీడి యాకు వివరించారు. ఆర్థిక బిల్లులపై అవగాహన కుదరక ప్రభుత్వ కార్యకలాపాలు అనేక సందర్భాలలో నిలిచిపోయి నప్పటికీ స్వల్పకాలిక ప్రతిష్టంభనంతో ముగిసింది.



ప్రతిష్టంభనకు తెర

ఆర్థిక బిల్లుపై ట్రంప్ సంతకం

వాషింగ్టన్ : స్వాప్నికుల (డ్రీమర్స్) విషయంలో అధికార, విపక్షాల మధ్య విభేదాలు తలెత్తటంతో ఆగిన బిల్లుకు ఇరుపక్షాల మధ్య కుదిరిన అవగాహన నేపథ్యంలో సెనేట్ ఆమోద ముద్ర లభించింది. దీనిపై అధ్యక్షుడు ట్రంప్ వెంటనే సంతకాలు చేయటంతో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ఆర్థిక ప్రతిష్టంభనకు తెరపడింది. ఫిబ్రవరి 8వ తేదీతో ముగియనున్న తాత్కాలిక కేటాయింపుల బిల్లును సెనేట్ సోమవారం రాత్రి ఆమోదించింది. అంతకు ముందు డ్రీమర్స్ విషయంలో డెమొక్రాట్స్ అభ్యంతరాలతో ఆగిన బిల్లుకు ఆమోదం పొందేందుకు అధికార పార్టీ నేతలు జరిపిన మంతనాలు ఒక కొలిక్కి రావటంతో ఇరువర్గాల మధ్య అంగీకారం కుదిరింది. దీనితో బిల్లు ఆమోదానికి మార్గం సుగమం కావటంతో సెనేట్ బిల్లుకు ఆమోదముద్ర వేసింది. ప్రతినిధుల సభ 266–155 ఓట్ల తేడాతో ఇప్పటికే ఆమోదించిన ఈ బిల్లుకు సెనేట్ కూడా 81–18 ఓట్ల తేడాతో ఆమోదం తెలపటంతో అధ్యక్షుడు ట్రంప్ వెంటనే దీనిపై సంతకాలు చేశారు.

మైక్ పెన్స్ ప్రసంగానికి పాలస్తీనా ఖండన

గాజా : ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ చేసిన ప్రసంగాన్ని పాలస్తీనియన్లు సోమవారం తీవ్రంగా నిరసించారు. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తించడానికి తమ దేశానికి గల నిబద్ధతను పెన్స్ ఆ ప్రసంగంలో వ్యక్తం చేశారు. 'పెన్స్ చేసిన ప్రసంగం తీవ్రవాదులకు ఒక బహుమతి ఇచ్చినట్లు వుంది. సమస్యకు పరిష్కారం కనుగొనడంలో కన్నా సమస్యను సృష్టించడంలోనే అమెరికా ప్రభుత్వానికి ఆసక్తి వున్నట్లు రుజువైంది." అని పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పిఎల్‌ఓ) కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి సాయెబ్ ఎరెకట్ వ్యాఖ్యానించారు. సోమవారం ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో పెన్స్ ఇజ్రాయిల్ అనుకూల ప్రసంగం చేశారు. అమెరికా ఎంబసీని టెల్ అవీవ్ నుండి జెరూసలేంకు తరలిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ళలోనే ఈ తరలింపు పూర్తవుతుందని చెప్పారు. జెరూసలేంపై డిసెంబరు 6న ట్రంప్ ప్రకటనతో ఉద్రిక్తతలు చెలరేగిన నేపథ్యంలో పెన్స్ పర్యటన జరిగింది. ట్రంప్ ప్రకటనను అటు పాలస్తీనియన్లు ఇటు ఇతర దేశాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. పెన్స్ పర్యటన, ఇజ్రాయిల్ ఆక్రమణలు, వివక్షతతో కూడిన విధానాల పట్ల అమెరికా పక్షపాత వైఖరిని ప్రతిబింబిస్తోందని గాజాలోని పాలస్తీనా కమిటీ వ్యాఖ్యానించింది.

ట్రంప్ వ్యాఖ్యలను నిరసిస్తూ హైతీలో ప్రదర్శన

పోర్ట్ అవు ప్రిన్స్ : హైతీ, ఆఫ్రికన్ దేశాలను చెత్త దేశాలుగా పేర్కొంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం హైతీ రాజధానిలో వేలాదిమందితో ప్రదర్శన జరిగింది. ట్రంప్ వ్యాఖ్యలపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి 'ట్రంప్ అసభ్యకరమైన జాత్యాహంకారి. అనాలోచిత వ్యక్తి." అని మార్వెల్ జోసెఫ్ అనే వ్యక్తి విమర్శించారు. హైతీ పతాకంతో ప్రదర్శనలో పాల్గొన్న ఆ వ్యక్తి, అమెరికన్ల పట్ల తమకు ఎలాంటి అసంతృప్తి, కోపం లేదని కానీ ట్రంప్ వ్యవహార శైలితో తాము పూర్తిగా విభేదిస్తున్నామని వ్యాఖ్యానించారు. ట్రంప్‌ను వ్యంగ్యంగా చిత్రీకరించిన పోస్టర్లను ప్రదర్శనలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో హైతీ ప్రతిపక్ష గ్రూపులు కూడా పాల్గొన్నాయి. హైతీ అధ్యక్షుడు జోవెనల్ మొయిస్ తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఆయన వల్లనే ట్రంప్ అంత చెత్తగా మాట్లాడుతున్నారని ప్రతిపక్ష పార్టీ మద్దతుదారు స్టీఫెన్ కాంబ్రే వ్యాఖ్యానించారు. కాగా ట్రంప్ వ్యాఖ్యలను హైతీ ప్రభుత్వం కూడా ఖండించింది. వాషింగ్టన్‌లో హైతీ రాయబారి ట్రంప్ వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. అమెరికా ఎంబసీ వరకు ప్రదర్శన నిర్వహించాలని తొలుత భావించినా పోలీసులు ఘర్షణలను నివారించే ఉద్దేశ్యంతో అక్కడివరకు ప్రదర్శకులను అనుమతించలేదు.

సంస్కరణల బాటలో సవాళ్లు

చైనా అధిగమించాల్సి వుందన్న ప్రధాని లీ కెకియాంగ్



బీజింగ్ : ఆర్థిక సంస్కరణల అమలులో ఎదురవుతున్న పేదరిక నిర్మూలన, కాలుష్య నియంత్రణ, ముప్పుల నివారణ వంటి మూడు ప్రధాన అవరోధాలను తమ ప్రభుత్వం అధిగమించాల్సి వుందని చైనా ప్రధాని లీ కెకియాంగ్ అభిప్రాయపడ్డారు. చైనా ప్రభుత్వం ఈ ఏడాది వినూత్న పరిశోధనల ప్రోత్సాహానికి, సంస్కరణల అమలుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సోమవారం ఇక్కడ జరిగిన కేబినెట్ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది దేశ ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించినప్పటికీ ఆర్థిక వ్యవస్థలో కొనసాగుతున్న లొసుగులను సరిచేసుకుంటూ ఎదురయ్యే ముప్పులను నివారించటంపైనే ప్రధానంగా దృష్టి సారించామని ఆయన చెప్పారు. దీనితో పాటు గత కొన్నేళ్లుగా దేశాభివృద్ధికి అవరోధంగా మారుతున్న వాతావరణ కాలుష్యాన్ని అదుపు చేయటం కూడా ప్రభుత్వానికి ప్రాధాన్యతాంశంగా మారిందని ఆయన వివరించారు. సరఫరాల రంగంలో సంస్కరణల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి వుందన్న లీ ఇది ఆర్థిక ప్రగతిని మరింత వేగవంతం చేయగలదని భావిస్తున్నామన్నారు.

మొదటి పేజీ తరువాయి

కృష్ణపట్నంలో ఆయిల్ రిఫైనరీ లాభదాయకం

హద్రమీకి చంద్రబాబు వివరించారు. పెట్రోలియం, రసాయన పరిశ్రమల ఏర్పాటుకు ఏపిలో సానుకూల పరిస్థితులున్నాయని తెలిపారు. హెచ్‌పిసిఎల్, గెయిల్ కార్యకలాపాలకు ఏపి ఆయువుపట్టుగా ఉందన్నారు. రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీను స్థాపించామన్నారు. దీంతో నైపుణ్యంగల మానవ వనరులుంటాయన్నారు. గతంలో సిఎం తో భేటీ అయిన సౌదీ ఆర్మ్ కో కంపెనీ కృష్ణపట్నంలో రిఫైనరీ ఏర్పాటుకు ఇప్పటికే ఆసక్తి చూపింది. ఈ మేరకు ఈ నెలాఖర్లో ముంబైలో ఆ సంస్థ ప్రతినిధుల్ని ఏపి బృందం మరోసారి కలవనుంది. ఏపిలో 640 చదరపు కిలోమీటర్ల మేర చముదు, రసాయనాలు, పెట్రోకెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌తోపాటు ఆరు సెజ్‌లు ఉండటంతో కృష్ణపట్నాన్ని పెట్టుబడులకు ప్రాధాన్యతా కేంద్రంగా సౌదీ సంస్థ ఎంచుకుంది. ఈ సందర్భంగా ఫిబ్రవరిలో నిర్వహించనున్న సిఐఐ పెట్టుబడిదారుల సదస్సుకు రావాల్సిందిగా హద్రమీని చంద్రబాబు ఆహ్వానించారు. విమానాశ్రయాల్లో గ్రౌండ్ ఆపరేషన్స్ నిర్వహణ పట్ల ఏజిల్ లాజిస్టిక్స్ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. చంద్రబాబుతో ఆ సంస్థ సిఇఒ తరక్ సుల్తా అల్ ఎస్సా సమావేశమయ్యారు. ఇప్పటికే తమ సంస్థ భారత్‌లో ముంబై, ఆఫ్రికాలోని కొన్ని నగరాల్లోని విమానాశ్రయాల్లో గ్రౌండ్ ఆపరేషన్స్ నిర్వహిస్తోందని సిఎంకు తరక్ తెలిపారు. ఏపి అవసరాలెలా ఉన్నాయో అధ్యయనం చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం మిడ్‌టెక్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రతినిధులతో చంద్రబాబు సమావేశమ య్యారు. గతేడాది ఆసంస్థతో ఏపి ఇడిబి ఒప్పందం చేసుకుంది. చంద్రబాబును ఎస్‌బిఐ ఛైర్మన్ రజ్నీష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో ప్రాంతీయ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించాలని రజ్నీష్‌కు సిఎం సూచించారు. ఫ్యూచ రిస్టిక్ క్యాంపస్‌ను ఏర్పాటు చేస్తామని రజ్నీష్ తెలిపారు.

రాయలసీమలో పరిశ్రమలకు అవకాశాలు : మంత్రి నారా లోకేష్

రాయలసీమ జలవనరులతో కళకళలాడుతోందని, పరిశ్రమల స్థాపనకు అపార అవకాశాలున్నాయని ఐటి, పంచాయతీరాజ్ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. అనంతపురంలో కియా మోటార్స్ కార్ల ఫ్యాక్టరీని నెలకొల్పడమే అందుకు నిదర్శనమన్నారు. మంగళవారం 'ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్ ఇండియా' బిజినెస్ సెషన్‌లో ఆయన పాల్గొన్నారు. ఏపికి రెండు పారిశ్రామిక కారిడార్లు రావడం మంచి పరిణామమన్నారు. ఈ కారిడార్లను వ్యూహాత్మకంగా పారిశ్రామికాభివృద్ధికి వినియోగించుకుంటామని ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో వనరులు, మౌలిక సదుపాయాల లభ్యత ఆధారంగా క్లస్టర్లవారీగా పారిశ్రామికాభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి అనువైన పరిస్థితుల్ని సృష్టించేందుకు ఉత్పాదక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుపతి క్లస్టర్‌లో ఇప్పటికే స్కైలాన్, డిక్సన్, కార్మన్ సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయన్నారు. శ్రీసిటీ సెజ్‌లో ఫాక్స్‌కాన్ మొబైల్ తయారీ కంపెనీలో ఒకేచోట 12 వేల మంది మహిళలకు ఉద్యోగాలొచ్చాయని లోకేష్ తెలిపారు.

నారాయణ, శ్రీచైతన్యలకు హైకోర్టు నోటీసులు

రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి మంగళవారం విచారణ చేపట్టింది. ఆడుతూపాడుతూ చదువుకోవాల్సిన విద్యార్థులపై ర్యాంకుల కోసం తీవ్ర ఒత్తిడి పెంచుతున్నారని, దాని ఫలితంగానే పలు కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడిందని ఈ సందర్భంగా హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. దీనిలో తల్లిదండ్రుల పాపం కూడా ఉందని వ్యాఖ్యానించింది. 90 శాతం మార్కులు రావాలనే ఏకైక లక్ష్యంగా పిల్లలు ఏమతున్నారో కూడా చూడకుండా ఒత్తిడిని పట్టించుకోవడం లేదని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ ఆందోళన వెలిబుచ్చింది. సాక్షాత్తు ఏపీలో ఒక మంత్రికి చెందినదే కార్పొరేట్ కాలేజీ అని, కాలేజీలకు, హాస్టల్స్‌కు అనుమతులు లేకుండా నడుపుతున్నారని పిటిషనర్ వాదన. ఆత్మహత్యలకు పాల్పడిన కాలేజీలపై విచారణ జరిపి నివేదికలు ఇవ్వలేదని, ఆత్మహత్య ఘటనల తర్వాత కన్న తల్లిదండ్రుల్ని కూడా మతదేహాల దగ్గరకు వెళ్లనీయనంత కాఠిన్యంగా యజామాన్యాలు వ్యవహరిస్తున్నాయని, ఆయా కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన హైకోర్టును కోరారు. ఈ కేసు విచారణను మూడు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది.

మధు అక్రమ అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

జిల్లాలో పెద్ద ఎత్తున అరెస్టులు కొనసాగాయి. తాడేపల్లిలో రాష్ట్ర కార్యదర్శి మధును అరెస్టు చేశారు. కనక దుర్గమ్మ వారధి సమీపంలో బైపాస్‌రోడ్డులో నివాస ముంటున్న మధు ఉదయం 8గంటల సమయంలో విజయవాడలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయానికి తన వాహనంలో బయలుదేరి వెళుతుండగా కుంచనపల్లి అండర్ బ్రిడ్జి వద్ద ఆయనను.. మంగళగిరి సిఐ మధుసూధనరావు, తాడేపల్లి ఎస్ఐలు ప్రతాప్‌కుమార్, నారాయణ, వారి పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. తనను ఎందుకు అరెస్టు చేస్తున్నారో తెలపాలని మధు పోలీసులను ప్రశ్నించారు. స్టేషన్ వరకు వచ్చి వెళ్లాలని ఆయనను బలవంతంగా పోలీసు జీపులో స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. తాడేపల్లి పరిసర ప్రాంతాల కార్యకర్తల ఆందోళన నేపథ్యంలో గుంటూరుకు తరలించారు. గుంటూరులోని నల్లపాడు స్టేషన్‌లో ఆయనను ఉంచారు. వెంటనే అర్బన్ ఎస్‌పి విజయరావు నల్లపాడు స్టేషన్‌కు చేరుకున్నారు. ఘటన పూర్వాపరాలపై మాట్లాడారు. ఇప్పటికే నిందితులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని, దళితులకు రక్షణ కల్పించినందున 'చలో గొట్టిపాడు' కార్యక్రమాన్ని విరమించుకోవాలని సూచించారు. అందుకు మధు నిరాకరించారు. అయితే ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించుకోవాలని, ఎంత మంది వస్తారో లిఖితపూర్వకంగా రాసిస్తే బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్‌పి చెప్పగా.. తాము ఇప్పటికే పత్రికా పరంగా చలో గొట్టిపాడుపై ప్రకటన చేశామని మధు అన్నారు. గ్రామంలో అంతా ప్రశాంతంగా, అందరూ సామరస్యంగా ఉన్నప్పుడు తాము పరామర్శకు శాంతియుతంగా వెళ్తామంటే ఎందుకు అడ్డుకుంటున్నారనిఎస్‌పిని మధు ప్రశ్నించారు. మంత్రి పత్తిపాటి పుల్లారావు వత్తిడి మేరకు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి దళితుల వద్దకు ఎవ్వరినీ రానివ్వడం లేదని మధు అన్నారు.. ఎస్‌సి.,ఎస్‌టి చట్టంలోని 307 కింద నిందితులపై ఎందుకు కేసు నమోదు చేయలేదని మధు ప్రశ్నించారు. ఇప్పటికే అగ్రకులాల వారిని అరెస్టు చేశామనీ, వారికి బెయిల్ రాలేదనీ ఎస్‌పి చెప్పారు. బుధవారం చలో గొట్టిపాడును నిర్వహించి తీరుతామని, అడ్డుకుంటే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. మధును నిర్బంధించినందుకు నిరసనగా సిపిఎం నాయకులు తాడేపల్లిలో అమరారెడ్డి భవన్‌నుండి పోలీస్ స్టేషన్‌వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్టేషన్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సోమవారం అరెస్టు చేసిన నేతలను కూడా చేబ్రోలు తరలింపు

పత్తిపాడు, తెనాలిల్లో సోమవారం అరెస్టు చేసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, గుంటూరు జిల్లా (తూర్పు) కమిటీ కార్యదర్శి పాశం రామారావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, డివైఎఫ్ఐ కార్యదర్శి సూర్యారావు, కెఎన్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణను మంగళవారం ఉదయం వరకూ చేబ్రోలు స్టేషన్‌లోనే ఉంచి మధ్యాహ్నం నల్లపాడు స్టేషన్‌కు తరలించారు. గుంటూరులో మంగళవారం తెల్లవారుజామునే ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.భగవాన్‌దాస్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, అఖిల్, నాగరాజు, రాజేష్‌లను అరెస్ట్ చేసి అరండల్‌పేట స్టేషన్‌కు తరలించారు.

కొనసాగిన అరెస్టుల పర్వం

మంగళవారం సాయంత్రం గుంటూరు ఆర్‌టీసి బస్టాండ్ దగ్గర సిపిఐ జిల్లా, నగర కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రిలను అరెస్టు చేసి పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గుంటూరు ప్రగతినగర్, సుందరయ్యనగర్‌కాలనీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తల అరెస్ట్ చేసి నల్లపాడు స్టేషన్‌కు తరలించారు. పార్టీ కార్యాలయంపై, పార్టీ కార్యకర్తల ఇళ్లపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. గత అర్ధరాత్రి సమయంలో తలుపులు కొడుతూ కార్యకర్తల కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించారు. పెదకాకానిలో సిపిఎం పొన్నూరు డివిజన్ కార్యదర్శి నన్నపనేని శివాజి, సిపిఐ మండల నాయకులు ఉప్పాల సత్యనారాయణను అదుపులోకి తీసుకుని పెదకాకాని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళగిరిలో సిఐటియు నాయకులు ఎం.భాగ్యరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సత్తెనపల్లిలో డివైఎఫ్ఐ నాయకులు పెండ్యాల మహేష్ అరెస్టు చేశారు. తూర్పు నియోజకవర్గంలో లాలాపేట స్టేషన్ పరిధిలోని పలువురి ఇళ్లకు వెళ్లి డిఎస్పీ రమ్మంటున్నారంటూ నిద్రపోతున్న వారిని లేపి ఉన్న స్థితిలోనే తీసుకువచ్చి చలిలోనే స్టేషన్‌లో ఉంచారు. నల్లచెరువు ప్రాంతానికి చెందిన సిపిఎం నాయకులు షేక్ సైదా, సిపిఐ పార్టీకు చెందిన నేత జి.సురేష్, బలహీనవర్గాల జేఏసీ కన్వీనర్ వై.వి. సురేష్, సిపిఎం ఎం.ఎల్ రెడ్ పార్టీ నేత మన్నవ హరిప్రసాద్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు టి.గోవిందు, ఇతర నేతలు జి.పాపారావు, బి.సురేష్, సంతోష్‌లను లాలాపేట స్టేషన్‌లోనే ఉంచారు.

గొట్టిపాడు ఉదంతంపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

ప్రజాశక్తి – తాడేపల్లి

గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో దళితులపై పెత్తందారులు దాడి చేసిన ఉదంతంపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసులు మంగళవారం అక్రమంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వాణిని ముఖ్యంగా ప్రతిపక్షాల వాణిని కావాలనే అణగదొక్కుతోందని విమర్శించారు. భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరితో మాట్లాడి పెదగొట్టిపాడు దళితులవాణి ఢిల్లీలో వినపడేటట్లు చేస్తామని వివరించారు. ఈ ఘటనలో అనామకులైన ముగ్గురిని అరెస్టుచేసి ఏదో ఘనకార్యం చేసినట్లు పోలీసులు చాటుకుంటున్నారని మండిపడ్డారు. 18 మంది అగ్రకుల పెత్తందారులు దళితపేటపై మూడుసార్లు మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారని వివరించారు. వారందరినీ వదిలేశారని విమర్శించారు. పోలీసు వ్యవస్థ తెలుగుదేశానికి మోకరిల్లిందని ఆగ్రహించారు. అక్కడ అంతా ప్రశాంతంగా ఉందని చెబుతున్న పోలీసు అధికారులు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రశాంతంగా ఉంటే ప్రజాసంఘాల నాయకులను, మమ్మల్ని అరెస్టు చేయడం ఎందుకని ప్రశ్నించారు. జరిగిన ఘటనపై పోలీసు సమక్షంలో విచారణకు సిద్ధమని ప్రకటించారు. అక్కడేమీ జరగలేదంటే తాము ఉద్యమాన్ని విరమిస్తామని చెప్పారు. ఘటన జరిగి 25 రోజులు గడిచిన అనంతరం కూడా దళితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్న సంగతిని గుర్తుచేశారు.

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రవ్యాప్తంగా కదంతొక్కిన స్కీం వర్కర్లు

వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న తమకు కనీస వేతనాల్లేవని, కేవలం పారితోషకాలు, గౌరవ వేతనాల పేరుతో తమతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందని స్కీం వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎమ్), 108, సర్వ శిక్ష అభియాన్, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వంటి తదితర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న మహిళలు పెద్దఎత్తున ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలిండియా సిఐటియు ఉపాధ్యక్షులు జి. బేబిరాణి మాట్లాడుతూ పేదల్ని ఆదుకోవడం, పౌష్టికాహారాన్ని అందించడం, స్త్రీ శిశు మరణాల రేటును తగ్గించడం, విద్య, వైద్య సదుపాయాల్ని అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను కుదించి, నగదు బదిలీ ప్రవేశపెట్టడంతో ప్రభుత్వం లబ్ధిదారులకు నష్టం చేకూరే నిర్ణయాల్ని తీసుకుందన్నారు. దేశంలో 4 వేల అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వేదాంత సంస్థకు అప్పగించారని మండిపడ్డారు. వైద్య ఆరోగ్య రంగాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తూ కనీస వేతనాలివ్వకుండా ఎన్‌హెచ్‌ఎమ్ పథకాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అన్యాయం చేస్తోందన్నారు. కార్పొరేట్ సంస్థలకు కాంట్రాక్ట్ ఇస్తూ ఆ సంస్థలకు లాభాలు చేకూరేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథక కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. స్వరూపరాణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ఇస్కాన్, అక్షయపాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తూ ఆ పథకంలో పనిచేస్తున్న వారికి అన్యాయం చేస్తోందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఎక్కడా అమలు చేయడంలేదన్నారు. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ల వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం 13 వేల మంది ఉపాధిని పోగొట్టిందన్నారు. సర్వశిక్షా అభియాన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్. బాలకాశి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్ని పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తోందన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు, సాంఘిక సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని 2013లో జరిగిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశం తీర్మానించిందని గుర్తుచేశారు. కానీ ప్రభుత్వం ఆ సిఫార్సులను పెడచెవిన పెట్టిందన్నారు. ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుప్రజ, ఏఐటియుసి నాయకులు లలితమ్మ, శైలజ, కృష్ణా జిల్లా స్కీం వర్కర్లు ఆందోళనలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా, సర్వశిక్షా అభియాన్, జాతీయ ఆరోగ్య మిషన్‌లో పని చేస్తున్న వర్కర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా కదం తొక్కారు. సిఐటియు, ఏఐటియుసి నాయకులు పాల్గొని ప్రసంగించారు. విశాఖ జిల్లా భీమిలి, శ్రీకాకుళం జిల్లా నందిగాంలో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. విజయవాడ అలంకార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కృష్ణా జిల్లా నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గుంటూరు జిల్లాలోని 42 మండలాల్లోనూ స్కీమ్ వర్కర్లు విధులు బహిష్కరించారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పాల్గొన్నారు. విశాఖ జిల్లా అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో స్కీమ్ వర్కర్లు ఆందోళనలు చేపట్టారు. అనకాపల్లిలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వరలక్ష్మి పాల్గొన్నారు. సిఐటియు నాయకులను, ఆయా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని 38 మండల కేంద్రాల్లోనూ తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ప్రదర్శనలు నిర్వహించారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా, ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు.

ఎస్ఎస్ఎ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతారావు పాల్గొన్నారు. కర్నూలులో కలెక్టరేట్ ఆందోళన నిర్వహించారు. అనంతపురం జిల్లాలో ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. ప్రకాశం జిల్లాలోని 49 మండలాల్లో స్కీం వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు. ఒంగోలులో ప్రదర్శన, మానవహారం, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. నెల్లూరులో భారీ ర్యాలీ చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ర్యాలీలు, ప్రదర్శనలు, మానవహారాలు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ర్యాలీ, ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాజమహేంద్రవరం సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. చింతూరులో ప్రదర్శన, ఐటిడిఎ వద్ద ధర్నా చేపట్టారు. రంపచోడవరం ఐటిడిఎను ముట్టడించారు. కడప జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. కడపలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లోనూ స్కీమ్ వర్కర్ల సమ్మె విజయవంతమైంది.

అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలి

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధుతో పాటు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినవారందరినీ తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపిసిఎల్‌ఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్‌ఏ) ప్రధాన కార్యదర్శి పొత్తూరు సురేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లాలోని పెదగొట్టిపాడులో దళితులపై దాడి జరిగిన నేపథ్యంలో ప్రజాసంఘాలతో కలిసి బాధితులను పరామర్శించడానికి వచ్చిన వారిని పోలీసులు అడ్డుకోవడం దారుణమని అన్నారు. అరెస్ట్ చేసి 48 గంటలైనా వారిని కోర్టులో ప్రవేశ పెట్టకుండా అక్రమంగా నిర్బంధించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన వారిని 24 గంటల్లో కోర్టులో ప్రవేశ పెట్టాలని, పోలీసుల చర్యలు పూర్తిగా పౌరహక్కులకు విఘాతం కలిగించే ఉన్నాయని తెలిపారు. రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడిన అధికారులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేదంటే కోర్టులో పిటీషన్ దాఖలు చేస్తామని హెచ్చరించారు.



'భాగమతి' బంగ్లా లోపలి భాగంలో ఆనాటి కలర్లతో వున్న సెట్

భాగమతి బంగ్లా పేటెంట్ హక్కుల కోసం ప్రయత్నిస్తాం : రవీందర్



రవీందర్

"బంగ్లా, పెద్ద ఇల్లు, కోట.. ఇలా సెట్ వేయాలంటే వ్యత్యాసాలుంటాయి. ఒక రాజు బంగ్లా. తన భార్యకు ఇచ్చినది. ఆ రాజు ఆరోజుల్లో ఎలా దాన్ని కట్టాడు? ఆ రోజుల్లో ఎటువంటి కలర్స్ ఉంటాయి? అప్పట్లో పెద్ద హాల్స్ ఉండేవి. మరోపక్క పెద్ద కిచెన్ ఉంటుంది. దాన్ని బేస్‌చేసుకుని ఊహాలోంచే వచ్చినదే ఈ బంగ్లా సెట్' అంటూ 'భాగమతి' కళా దర్శకుడు రవీందర్ తెలియజేశారు. ఈనెల 26న విడుదల కానున్న ఈ చిత్రంలోని సెట్ గురించి ఆయన వివరించారు.

- 'భాగమతి' హారర్ చిత్రం కాదు. చిన్న భాగం మాత్రమే. బంగ్లాలో 40 రోజులు షూట్ చేశాం. బంగ్లా సెట్ అనేది కేవలం ఊహ మాత్రమే. కథ చెప్పినప్పుడు ఓ బంగ్లా కావాలి. 400 ఏళ్ళనాటి బంగ్లా. ఎవ్వరూ వాడనిది. సామానులు ఏమీ లేకుండా.. దాని కోసం ముంబైలో కొన్ని ప్రాంతాల్లో తిరిగాం. కథకు ఎక్కడా సింక్ కాలేదు. ఇంకోవైపు అనుష్క డేట్స్ ఇచ్చేశారు. నెలన్నర మాత్రమే వ్యవధి వుంది. ఆ సమయంలోనే బంగ్లా కావాలి. అనుష్క ఉంటేనే సినిమాకు క్రేజ్. అందుకే రకరకాలుగా ఆలోచించి స్కెచ్‌లు వేసి నిర్మాతలు వంశీ, దర్శకుడికి చూపించాం..
- ఇది వేశాక.. కెమెరామెన్ మది చూస్తానని వచ్చాడు. కానీ మొత్తం చూపించ కుండా కొంతవరకే చూపించాను. కోట్లు పెట్టి సెట్ వేశాక.. దాన్ని ఏవిధంగా చూపిం చాలనేది కెమెరా మెన్ పని.. అందుకే ఆయనకు కొంచెం పార్ట్ చూపించాక.. దానికే ఆయన ఆశ్చర్యపోయి నాపై నమ్మకంతో ఉన్నారు. ఇక షూట్ మొదలు పెట్టాక అనుష్క చూసి థ్రిల్ ఫీలయ్యారు. ఎంత చక్కటి సెట్ వేశారో అని ముగ్ధులయ్యారు.
- ఇంతకుముందు 'ఛత్రపతి', 'మగధీర', 'ఈగ', 'మర్యాద రామన్న', 'అత్తారింటికి దారేది', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'దువ్వాడ జగన్నాధమ్' చిత్రాలకు కళాత్మక హంగులు దిద్దాను. 'మర్యాద రామన్న'లో వేసిన ఇంటి సెట్‌కి పేటెంట్ హక్కులు కూడా దక్కాయి. అదే స్థాయిలో 'భాగమతి' బంగ్లానీ తీర్చిదిద్దా. ఈ బంగ్లాకీ పేటెంట్ హక్కుల కోసం ప్రయత్నిస్తాం.
- ఈ సెట్ కోసం 200 మంది పనిచేశాం. భారతీయత, విదేశీయత కలగలిపిన డిజైన్లు రూపొందించాం. కొన్ని స్కెచ్చులు వేశాం. చివరికి 28 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓ సెట్‌ని నిర్మించాం. అదే.. 'భాగమతి బంగ్లా'. ఇందులో 189 రాతి స్తంభాలు కనిపిస్తాయి. కొన్ని పది అడుగుల ఎత్తుంటే, మరికొన్ని నలభై అడుగుల వరకూ ఉంటాయి. 12 గదులున్న రెండు అంతస్థుల భవనం ఇది. ఆ రోజుల్లోనే లిఫ్ట్ సౌకర్యం ఉండేది. అయితే లిఫ్ట్‌ని మనుషులు తాళ్లతో లాగేవారు. వాటికి తగ్గట్టుగా ఓ లిఫ్ట్‌నీ రూపొందించాం. ఫైబర్‌ని ఎక్కువగా వాడాం. రంగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ఇప్పటి వరకూ ఎవరూ వాడని రంగులు సెట్లో కనిపిస్తాయి. రాజుల నాటి ఫొటోల్ని పెద్ద పెద్ద ఫ్రేముల్లో చూపించాం. ఒకొక్క ఫ్రేమూ పది అడుగుల వరకూ ఉంటుంది. మూడు కేజీల బరువు ఉంటుంది. ఇంత పెద్ద సెట్‌ని కేవలం 29 రోజుల్లో పూర్తి చేశాం.
- తోట తరణి, గౌతమ్ మేనన్, వినాయక్, రామ్ చరణ్, అల్లు అర్జున్, సుకుమార్, సాయిధరమ్ తేజ్ ఇలా చాలామంది సినీ ప్రముఖులు ఈ సెట్ చూడ్డానికి వచ్చారు. ఓ సెట్ ఇంతలా ఆకర్షించడం బహుశా ఇదే తొలిసారేమో. ఛాయా గ్రాహకుడు, కళా దర్శకుడు, సంగీత దర్శకుడు... ఇలా కీలకమైన విభాగాల నిపుణులు కలసికట్టుగా పనిచేయడం బాలీవుడ్ ఆనవాయితీ. అందరూ ఓ టీమ్‌గా ఉండడం వల్ల బాలీవుడ్‌లో మంచి ఫలితాలు వస్తున్నాయి. 'భాగమతి' విషయంలోనూ మేం అదే చేశాం. నేను సెట్ వేస్తుంటే... సంగీత దర్శకుడు తమన్ కూడా వచ్చి చూశారు. నేపథ్య సంగీతంలో ఈ సెట్‌ని ఎలా వాడుకోవాలో తన సౌండ్ ఎఫెక్ట్స్ నిపుణుల తో మాట్లాడారు.
- ప్రస్తుతం నాగ చైతన్య, శర్వానంద్, సుధీర్ వర్మ, ఇంద్రగంటి మోహన్ కృష్ణ చిత్రాలకు పని చేస్తున్నా. ఓ తమిళ చిత్రం కూడా చర్చల దశలో ఉంది.




400 ఏళ్ళనాటి రాజ భవనం లోపల



బంగ్లా సెట్ నమూనా అనంతరం దర్శకటీమ్ చర్చలు

ఫైట్స్ కూడా టీజర్ రిలీజ్ చేయాలనుంది



అల్లు అర్జున్ సినిమాలంటే యాక్షన్ వుండాల్సిందే. ఆయన చేసే ఫైట్స్ చూస్తుంటే పాటలను ఏవిధంగా టీజర్‌లా రిలీజ్ చేస్తామో... ఫైట్స్ కూడా అలా చేయాలనుందని నిర్మాత లగడపాటి శ్రీధర్ తెలియజేస్తున్నారు. అల్లు అర్జున్ నటిస్తున్న తాజా సినిమా 'నా పేరు సూర్య'. 'నా ఇల్లు ఇండియా' అనేది ఉప శీర్షిక. వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయం అవుతూ తీసిన మొదటి సినిమా ఇది. అను ఇమ్మానుల్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో బన్నీ ఆవేశం కలిగిన సైనికుడి పాత్రలో కనిపించనున్నాడు. ఆ ఆవేశం బోర్డర్‌లోనే కాదు, లోపల కూడా ఎలా ఉంటుందనేది యాక్షన్ ఎపిసోడ్ ద్వారా చిత్రీకరిస్తున్నారు. వైజాగ్ డాక్‌యార్డ్ నేపథ్యంలో సాగే ఈ సన్నివేశాన్ని నానక్‌రామ్‌గూడ రామానాయుడు స్టూడియోలో వేసిన డాగ్ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. దాదాపు 10 రోజులపాటు ఈ సన్నివేశం ఉంటుంది. చిన్నపాటి విషయానికి రోడ్డంతా జామ్ అయితే.. అటే వస్తున్న సోల్జర్ ఏం చేశాడు? అన్నది ఇందులోని పాయింట్. పీటర్ హేన్స్ ఆధ్వర్యంలో ఫైట్స్ జరుగుతున్నాయి. ఈ సినిమా ఫైట్స్ చూస్తుంటే టీజర్ కూడా రిలీజ్ చేయాలనే ఆలోచన కలిగింది. కథకు తగినట్లుగా ఫైట్స్ హైలైట్స్ అవుతాయి. ఇంటర్‌వెల్ ఎపిసోడ్‌గా ఇది వస్తుంది. అల్లు అర్జున్ బాడీ లాంగ్వేజ్ చిత్రానికి బాగా ఉపయోగపడింది. బడ్జెట్‌కు పరిమితులు లేకుండా కథకు తగిన విధంగా ఖర్చు చేశాం. ఇంతకుముందు లారెన్స్ 'స్టైల్' తీసినట్లే ఊహించని విధంగా ఈ చిత్రం తీశాం. ఇక పాటల పరంగా చెప్పాలంటే... పాటలు విన్నప్పుడే ఉత్సాహం కల్గింది. సంగీత ద్వయం విశాల్ శేఖర్.. కేవలం బన్నీ కాబట్టి చేయడం జరిగిందని చెప్పడం విశేషం. రిపబ్లిక్‌డే సందర్భంగా సోల్జర్‌కు అంకితమిస్తూ పాటను విడుదల చేయబోతున్నాం. సినిమాను ఏప్రిల్ 27న విడుదల చేస్తున్నాం అన్నారు.

దిల్లే ఇండియా, ఇల్లే ఇండియా...

గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ... రోమాంచితమైన టైటిల్. వంశీ కథలు రాసిన చిత్రాలు విజయాలు సాధించాయి.

ఇప్పుడు దర్శకుడిగా మారారు. తనకు సంగీత అభిరుచి కూడా వుంది. నాలుగు పాటలు రాశాను సన్నివేశపరంగా వుంటాయి.. మా ఇద్దరికీ చాలా విషయాల్లో సింక్ అయ్యాయి. విశాల్ శేఖర్ సంగీత సారథ్యంలో ఇవి రూపొందాయి. పాట గురించి చెప్పాలంటే...

సైనికులకే వందనం చేసే నేపథ్యంలో పాట రాశాను. వారి త్యాగాలు, పద్ధతులు, మనస్తత్వం, కష్టనష్టాలు తెలియజేస్తూ అంకితం ఇచ్చేలా పాట రాశాను. 'దిల్లే ఇండియా, ఇల్లే ఇండియా...' అంటూ సోల్జర్‌కు ఎత్తుపీట వేసేలా పాట ఉంటుంది. పోయిన ఏడాది 'ప్రణామం..' అనే పాటకు చాలా అవార్డులు దక్కాయి. ఈ ఏడాది పాటకూ వస్తాయని నమ్మకం కలుగుతుంది. ఈనెల 26న ఆ పాట విడుదల కానుంది.

'కిరాక్ పార్టీ'



నిఖిల్ కథానాయ కుడిగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. సంయుక్త హెగ్డే, సిమ్రాన్ ఫర్జానా కథానాయికలు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలోని తొలి గీతాన్ని సోమవారంరాత్రి హైదరాబాద్‌లో విడుదల చేశారు. 'దమ్ దారే' అంటూ సాగే ఈ పాటని వనమాలి రచించారు. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు. "ప్రీ టీజర్‌కి మంచి స్పందన వచ్చింది. అజనీష్ అందించిన బాణీలన్నీ ఆకట్టుకొం టాయి. పాటలన్నీ కిరాక్ పుట్టించేవే. మిగిలిన పాటల్ని త్వరలో విడుదల చేస్తాం. ఫిబ్రవరి 9న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ'ని చిత్రబృందం తెలిపింది.

రాజ్‌పుత్ గౌరవాన్ని పెంచే 'పద్మావతి'



ప్రివ్యూ సమీక్ష: పద్మావతి
నటీనటులు: దీపికా పదుకొణె.. షాహిద్ కపూర్.. రణ్‌వీర్ సింగ్ తదితరులు
సాంకేతికత: **ఛాయాగ్రహణం:** సుదీప్ ఛటర్జీ, **సంగీతం:** సంజయ్ లీలా భన్సాలి, సంచిత్ బల్హారా, **ఎడిటింగ్:** జయంత్ జాదర్, సంజయ్ లీలా భన్సాలి.. అఖివ్ అలీ, నిర్మాత: సంజయ్ లీలా భన్సాలి.. సుధాన్సు వాట్స్.. అజిత్, దర్శకత్వం: సంజయ్ లీలా భన్సాలి

హిందీలో నిర్మిం చిన 'పద్మావతి' చిత్రాన్ని బ్యాన్ చేయాలని రాజ్‌పుత్ వంశానికి చెందిన కర్ణిసేనలు గొడవలు చేయడం... అది సుప్రీం కోర్టు వరకు వెళ్ళడంతో చిత్రానికి ఎక్కడలేని క్రేజ్ వచ్చేసింది. ఆఖరికి చిత్ర యూనిట్‌ను టార్గెట్‌గా పెట్టుకుని తలకు రేటుపెట్టిన సందర్భాలూ వున్నాయి. సినిమాను చూడకుండానే అలా వుందంటూ.. ఇలా వుందంటూ.. నానా యాగీ చేసి దర్శక నిర్మాతలకు మంచి పేరు తెచ్చిపెట్టారు. అందుకే సెన్సార్‌లోనే పలు జాగ్రత్తలు తీసుకుని విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈనెల 25న విడుదల కానున్న ఈ చిత్రాన్ని మంగళవారం హైదరాబాద్‌లో ప్రీమియర్ షో ప్రదర్శించారు.

కథగా చెప్పాలంటే... 714 సంవత్సరాల కథ. ఢిల్లీని పాలించే అల్లావుద్దీన్ ఖిల్జీ (రణవీర్ సింగ్) సింహాసనం అధిష్ఠించడానికి అధర్మాన్ని పాటిస్తాడు. అందుకు తగినట్లు స్త్రీలోలుడు. నచ్చిన అందాన్ని వదిలి పెట్టడు. ప్రపంచంలోనే అత్యంత అందగత్తెగా పేరు పొందిన రాజ్‌పుట్ వంశానికి చెందిన 'పద్మావతి' గురించి తెలుసుకుని ఆమె కోసం యుద్ధం ప్రకటించి.. ఎంతో మంది ప్రాణాలను తీస్తాడు. చివరికి కుటిల నీతితో సంధి వంకతో పద్మావతి భర్తను బంధిస్తాడు. అతన్ని విడిపించుకునేందుకు పద్మావతి ఎటువంటి పన్నాగం పన్నింది? ఆ తర్వాత ఏం జరిగింది? అనేది సినిమా.

విశ్లేషణ:

చరిత్ర గురించి చెప్పేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు కొన్ని కొలమానాలు ఎంచుకోవాలి. ఆ విషయంలో భన్సాలీ జాగ్రత్తలు తీసుకున్నాడు. సాధారణంగా రాజ్‌పుత్ కథ, యుద్ధాలు అంటే... ఎక్కువగా యాక్షన్ ఘట్టాలపై మొగ్గు చూపిస్తారు. కత్తి యుద్ధాలు, గుర్రపు స్వారీలు, ఎత్తుగడలు, యుద్ధ నైపుణ్యాలు చూపించడానికి ప్రాధాన్యం ఇస్తారు. కానీ భన్సాలీ దాన్ని పక్కన పెట్టాడు. తనకు డ్రామాపై పట్టు ఎక్కువ. అందుకే... వీలైనంత డ్రామా ఎలివేట్ చేయడానికి చూశాడు. ఖిల్జీ అరాచకత్వం, అతని ఆలోచనలు, సింహాసనాన్ని అడ్డదారిలో అందుకున్న విధానం.. వీటితో కథ ఆసక్తికరంగా మొదలవుతుంది. ఎనిమిది వందలమంది దాసీలతో పద్మావతి ఖిల్జీలపైకి దండెత్తే సన్నివేశంలో భన్సాలీ దర్శకత్వ ప్రతిభ అణువణువూ కనిపిస్తుంది. పతాక సన్నివేశాల్లో రాజ్‌పుత్‌ల త్యాగాన్ని బాగా ఎలివేట్ చేశారు. ఈ సినిమాని నిలబెట్టే ఘట్టం అది. తొలి భాగంలో కథని చెప్పడానికి, పాత్రల్ని పరిచయం చేయడానికి ఎక్కువ సమయం తీసుకున్న దర్శకుడు పద్మావతి పాత్రను ఏవిధంగానూ కించపరలేదు. కథ రకరకాలుగా చరిత్రలో వున్నా... ఇలా వుందనేది సినిమా చూసే ప్రేక్షకుడు భావించేలా వుంది. రణవీర్ సింగ్, దీపికా పదుకొణె, షాహిద్ కపూర్.. మూడు పాత్రలు ఈ కథలో కీలకం. మూడు పాత్రల్నీ శక్తిమంతంగా మలిచాడు. రాముడు కథలో రావాణాసురుడి ఎంత బిల్డప్ వుంటుందో అంతే బిల్డప్ ఖిల్జీపాత్రకు ఆపాదించారు. చిత్రం చూస్తున్నంతసేపు ఆయనే హీరోగా అనిపిస్తాడు. తెలుగులో రాజుల చరిత్రలు చాలానే వచ్చాయి. ఆ కళ్ళతో ఈ చిత్రాన్ని చూస్తే ఏవరేజ్ సినిమాగా నిలుస్తుంది. రాజపుత్రులు ఆనాటి ఆచారం ప్రకారం.. భర్త ముందుగా చనిపోతే సతీసహగమనం గావిస్తారు. అలా పద్మావతి పాత్ర ముగుస్తుంది. ఉత్తరాదిలో ఆమెను దేవతగా ఆ వంశీయులు భావించేట్లుగా ఈ కథను దర్శకుడు తెరకెక్కించడంలో సఫలం అయ్యాడు. అయితే ఏ రాజుకథ అయినా ధర్మం, అధర్మంపై జరిగే యుద్ధమే. ఇందులో సంభాషణలూ ఆకట్టుకున్నాయి. నా మాటను అల్లానే నమ్మడు.. నువ్వే నమ్మావంటూ... పద్మావతి భర్తకు చెప్పడం.. ఆయన నైజానికి నిదర్శనంగా రాశారు. ఇలా ఆనాటి ఢిల్లీ రాజు ఎంత క్రూరంగా తన స్వార్థం కోసం కొన్ని వేల ప్రాణాలు బలిపెట్టారనేది కళ్ళకు కట్టినట్లు చూపించాడు. అయితే 'బాహుబలి', 'గౌతమిపుత్ర శాతకర్ణి'లాంటి చిత్రాల్లో వున్న యుద్ధ సన్నివేశాలు ఇందులో లేకపోవడంతో సోసోగా.. అనిపిస్తుంది.

– పెండ్యాల మురళీ



అడవి శేష్, శివాని జంటగా...





అడవి శేష్ హీరోగా జీవితా రాజశేఖర్ కుమార్తె శివాని హీరోయిన్‌గా నటించబోతున్నారు. లక్ష్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం షూటింగ్ ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. వెంకట్ రెడ్డి దర్శకత్వంలో ఎంఎల్‌వి.సత్యనారాయణ నిర్మిస్తున్నారు. హిందీలో విజయం సాధించిన '2 స్టేట్స్' చిత్రానికి తెలుగు రీమేక్ ఇది. శివాని తొలి చిత్రం కోసం ఎన్నో కథలు విన్నప్పటికీ నటనకు ఎంతో ఆస్కారం ఉన్న ఈ కథను ఎంచుకోవడం విశేషం. బ్యూటీఫుల్ లవ్ అండ్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. దర్శకుడు వెంకట్ రెడ్డి వి.వి. వినాయక్‌తో అసోసియేట్‌గా చాలా చిత్రాలకు పనిచేశారు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా నటీనటులను, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే నిర్మాతలు ప్రకటిస్తారు. ఈ చిత్రానికి సంగీతం : అనూప్ రూబెన్స్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎం.ఎస్.కుమార్, నిర్మాత : ఎం.ఎల్.వి.సత్యనారాయణ, దర్శకత్వం : వెంకట్ రెడ్డి.

పదేళ్ళ తర్వాత నెరవేరింది: తమన్నా



'విక్రమ్‌గారితో పనిచేయాలని కెరీర్ ప్రారంభం నుండి అనుకున్నాను. పదేళ్ల తర్వాత ఆయనతో కలిసి నటించే అవకాశం కలిగింది. ఆయన నుండి చాలా విషయాలను నేర్చుకున్నాను. కమర్షియల్ సినిమాలకు నేను పెద్ద ఫ్యాన్‌ని. అలాంటి కమర్షియల్ ఎలిమెంట్స్ ఆధారంగానే ఈ సినిమా చేశారు. నాకు, విక్రమ్‌గారికి మధ్య ప్రేమ సన్నివేశాలు చాలా చక్కగా వచ్చాయి. ఎంజాయ్ చేస్తూ నటించాను. తమన్ చక్కటి మ్యూజిక్ ఇచ్చారని' తమన్నా అన్నారు. తమిళంలో 'జీవా' పేరుతో విడుదలైన సినిమా తెలుగులో 'స్కెచ్'గా త్వరలో రాబోతుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. డి.సురేష్ బాబు మాట్లాడుతూ.. సెన్సార్ పూర్తి కాగానే ఈ సినిమా విడుదల తేదీ ప్రకటిస్తారు. విక్రమ్ నాకు చాలా మంచి స్నేహితుడు. తను చిన్న రేంజ్ నుండి పెద్ద స్టార్‌గా ఎదిగారు. 25 ఏళ్ల క్రితం తనని కలిసినప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలాగే ఉన్నారు. ఇండస్ట్రీకి మంచి సినిమాలు అవసరం. అలా ఉన్నప్పుడు ఆడియెన్స్ థియేటర్‌కి రావాలనుకుంటాడు. లేకుంటే ప్రేక్షకులు థియేటర్స్‌కు రావడం తగ్గించేస్తారని అన్నారు. విక్రమ్ మాట్లాడుతూ... తమిళం, కేరళ, కన్నడలో సినిమా పెద్ద హిట్ అయ్యింది. తెలుగులో కూడా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. డి.సురేష్‌బాబు సినిమాను విడుదల చేస్తుండటం ఆనందంగా ఉంది. నేను ఎప్పుడూ విభిన్నమైన సినిమాలు చేస్తుంటాననే సంగతి తెలిసిందే. పద్నాలుగేళ్లు, పదిహేనేళ్ల తర్వాత కమర్షియల్ మూవీ చేశాను. పాత విక్రమ్ వచ్చారని అందరూ అనుకుంటారు. అలాగని రెగ్యులర్ కమర్షియల్ మూవీ కాదు. నిజ ఘటనలతో తెరకెక్కించిన కమర్షియల్ మూవీ. దర్శకుడు విజయ్ సినిమాను చక్కగా తెరకెక్కించాడు. ముందు నేను రెండు నెలలు పాటు కథ వినలేదు. వినగానే థ్రిల్ అయ్యాను. కమర్షియల్ టైప్‌లో సాగే థ్రిల్లర్ మూవీ ఇది. నా పాత్ర పరంగా కాస్త డిఫరెంట్‌గా ఉండాలని ప్రయత్నించాను. తమన్నాతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. తను మంచి నటే కాదు.. బెస్ట్ డ్యాన్సర్ కూడా. ఇది కమర్షియల్ సినిమానే అయినా రొమాన్స్ సీన్స్ అందరినీ ఆకట్టుకుంటాయి. చిన్న మెసేజ్ కూడా ఉంటుంది' అన్నారు.

సైటెక్ Science & Technology
ప్రజాశక్తి
విజయవాడ
బుధవారం 24-1-2018
11
scitechpage@gmail.com

రేడియో కార్బన్ డేటింగ్ అంటే ఏమిటి?

ప్రశ్న: కార్బన్-14, కార్బన్-12 నిష్పత్తి అంటే ఏమిటి? రేడియో కార్బన్ డేటింగ్ అంటే ఏమిటి?

- ఎం.మోహనరెడ్డి, విజయవాడ


పదార్థాలన్నీ పరమాణు నిర్మితం. పరమాణువుల లోపల పరమాణు కేంద్రకం (atomic nucleus), దాని పైభాగాన కేంద్రకం చుట్టూ తిరిగే ఎలక్ట్రాన్లు ఉంటాయి. పరమాణువులోని కేంద్రకంలో ధనావేశిత ప్రోటాన్లు, తటస్థమయిన న్యూట్రాన్లు ఉంటాయి. వీటితో పాటు వివిధ రకాలైన కణాలున్నా కేంద్రకంలో ప్రోటాన్లు, నూట్రాన్లే ప్రధానం. పదార్థాల భౌతిక, రసాయనిక ధర్మాలకు ప్రధాన ఆధారం పరమాణువులు లేదా అణువులలో ఎలక్ట్రాన్ల అమరికనే. సాధారణంగా పరమాణువులు, అణువులు తటస్థం (neutral) గా ఉంటాయి. అందుకు కారణం అందులో ధనావేశిత ప్రోటాన్ల సంఖ్య ఋణ విద్యుదావేశం ఉన్న ఎలక్ట్రాన్ల సంఖ్య సమానంగా ఉండడమే! పదార్థాల్లో ఉన్న పరమాణువులన్నీ ఒకే విధమైన సంఖ్య గల ప్రోటాన్లతో నిండి ఉన్న కేంద్రకాలున్నవి అయితే ఆ పదార్థాలను మూలకాలు (Elements) అంటారు. పదార్థాలలో వివిధ సంఖ్యలలో ప్రోటాన్లున్న కేంద్రకాలు గల పరమాణువులతో నిండి ఉంటే ఆ పదార్థాలను సంయోగ పదార్థాలు (Compounds) అంటారు. పరమాణువుల్లో ఉన్న కేంద్రకంలోని ప్రోటాన్ల సంఖ్యను ఆ పరమాణువుకున్న 'పరమాణు సంఖ్య' (Atomic number) అంటారు. పరమాణు సంఖ్య ఆ పరమాణువుకున్న ఓ విశిష్ట సంఖ్య (unique number). పరమాణు కేంద్రకంలో ప్రోటాను సంఖ్య ఒకేవిధంగా ఉన్నా న్యూట్రాన్ల సంఖ్య ఒకేలా ఉండాలన్న నియమం లేదు. ప్రోటాను సంఖ్యను బట్టే పరమాణువులకు సంకేతాలు (symbols) ఉన్నాయి. ఆక్సిజన్ మూలకపు పరమాణువులో 8 ప్రోటాన్లు ఉంటాయి. దీని సంకేతం '0'. గంధకంలో 16 ప్రోటాన్లు ఉంటాయి. కర్బనంలో '6' ప్రోటాన్లు ఉంటాయి. ప్రోటాన్ల సంఖ్య, న్యూట్రాన్ల సంఖ్యను కలగలిపి పరమాణు ద్రవ్య సంఖ్య (atomic mass number) అంటారు. ఉదాహరణకు సాధారణ కర్బన పరమాణు కేంద్రకంలో 6 ప్రోటాన్లు, 6 న్యూట్రాన్లు ఉంటాయి. ఇలాంటి పరమాణువుల్ని C-12 పరమాణువులు అంటారు. కానీ పరమాణు కేంద్రకంలో 6 ప్రోటాన్లు, 7 న్యూట్రాన్లు ఉంటే వాటిని C-13 కేంద్రకాలు అంటారు. ఇక C-14 అంటే ఏమిటో మీకిప్పటికే అర్థమై ఉంటుంది. ప్రతి కర్బన పరమాణు కేంద్రకంలో ఆరు ప్రోటాన్లు, 8 న్యూట్రాన్లు ఉంటే వాటిని C-14 అంటాము. ప్రోటాను సంఖ్య (లేదా పరమాణు సంఖ్య) ఒకే విధంగా ఉండి, పరమాణు ద్రవ్య సంఖ్యలో తేడాలున్న మూలకాలను సమస్థానీయాలు (isotopes) అంటారు. ఐసోటోపుల భౌతిక ధర్మాల్లో తేడా ఉన్నా రసాయనిక లక్షణాల్లో పెద్దగా తేడా ఉండదు. ప్రకృతిలో అధిక మోతాదులో లభించే సమస్థానీయం స్థిరంగా ఉన్నదనీ, తక్కువగా ఉన్న దాన్ని అస్థిర ఐసోటోపుగాను భావించగలము.


ప్రకృతిలో ప్రతి 100 C-12 పరమాణువులకు కేవలం ఒక C-13 పరమాణువు మాత్రమే లభ్యమవుతుంది. ఇక C-14 మరీ అరుదుగా ఉంటుంది. ప్రతి లక్ష కోట్ల C-12 పరమాణువులకు ఒక C-14 పరమాణువు మేరకే ప్రకృతిలో ఏర్పడుతుంది. ఇది సహజసిద్ధంగా భూమిలో ఉండదు. ఎప్పటికపుడు భూ వాతావరణంలోని నత్రజని వాయు పరమాణువులు సూర్యకాంతి నుంచి వచ్చే గామా కిరణాల తాకిడికి, ఎలక్ట్రాన్ల తాకిడికి లోనయ్యి ఒక్కో ప్రోటాను న్యూట్రానుగా మారే కేంద్రక చర్యల్లో C-14 పరమాణువులు ఏర్పడతాయి.

గామా కిరణాలు ఇలా ఏర్పడ్డ C-14 ఐసోటోపులు స్థిరంగా ఉండవు. ఎప్పటికప్పుడు తిరిగి N-14గా మారిపోతుంటాయి. ఇలా ప్రతి 100 C-14 కేంద్రకాలు 50 C-14 కేంద్రకాలుగా మారడానికి పట్టే సమయాన్ని C-14 కున్న అర్ధాయుష్షు (Half life period) అంటారు. దీని విలువ సుమారు 5890 సంవత్సరాలు ఉంటుంది.

ప్రకృతిలో కర్బనం నుండి CO^2ను ఇస్తుంది. ఇందులో కొన్ని Cలు C -12వి కాగా, మరికొన్ని C -13 వి కాగా, ఇంకొన్ని C-14వి అయి ఉంటాయి. C-14 తో నిండి వున్న CO^2 వాయువు మోతాదు భూ వాతావరణంలో చాలా తక్కువగా ఉంటుంది. అయినా కిరణజన్య సంయోగక్రియ (photosynthesis) వంటి రసాయనిక చర్యల్లో CO^2 అనే వాయువు H_2Oతో కలిసి చక్కెరలుగా మారుతుంది. ఈ చక్కెరల నుంచే వృక్షాల చెక్క, కాండం, కలప ఏర్పడతాయి. C-14 ఏర్పడడం, తిరిగి వియోగం చెందడం వల్ల బతికున్న వృక్షంలోకి ప్రతి కిలోగ్రాము కలపలో సుమారు 16 కాంట్లు వచ్చేలా C -14 రేడియో ధార్మికత (radio activity) ని ప్రదర్శిస్తుంది. కానీ చెట్టు మరణించాక కిరణ జన్యసంయోగ క్రియ ఆగి పోవడం వల్ల వాతావరణంలో ఉన్న CO^2తో సంధానాన్ని కోల్పోతుంది. కాబట్టి రేడియోధార్మికతను ప్రదర్శించే C-14 కేంద్రకాల సంఖ్య

ప్రతి 5750 సంవత్సరాలకు సగానికి పడిపోతుంది. ఓ చెక్కతో తయారుచేసిన మ్యూజియంలో కార్యశిల్పంలో ప్రస్తుతం ప్రతి కి.గ్రా చెక్కలో 8 రేడియో ధార్మిక కాంట్లు ఉంటే ఆ శిల్పము వయస్సు 5750 సంవత్సరాలన్నీ 4 కాంట్లు ఉంటే దాని వయసు సుమారు 11,500 సంవత్సరాలనీ లెక్కిస్తారు. ఇలా వస్తువుల వయసును C-14 ఆధారంగా లెక్కించే పద్ధతిని C -14 డేటింగ్ లేదా కార్బన్ డేటింగ్ అంటాము.







ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com

అందుబాటులోకొచ్చిన వాట్సాప్ బిజినెస్ యాప్



ప్రపంచవ్యాప్తంగా 130 కోట్ల మంది యాక్టివ్ వినియోగదార్లతో ఇన్‌స్టెంట్ మెసేజింగ్ యాప్ వాట్సాప్ అగ్రస్థానంలో దూసుకుపోతోంది. అదే సందర్భంలో తన వినియోగదార్లకు కొత్తకొత్త ఫీచర్లను అందుబాటులోకి తెస్తూనే వుంది. ఈ క్రమంలో ఇటీవల లాంచ్ చేసిన వాట్సాప్ బిజినెస్ యాప్‌ను అద్భుతమైన ఆఫర్లతో ఇకపై భారత్‌లోకి తీసుకొచ్చింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి దీన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముఖ్యంగా ఆండ్రాయిడ్ వినియోగదార్లకు దీన్ని అందుబాటులోకి తెచ్చారు. స్వంతంగా వ్యాపారాలు చేసుకునే ఎవరైనా దీన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తమ ఖాతాదారులకి నేరుగా అందుబాటులో ఉండొచ్చు. ఈ యాప్ ద్వారా షాప్, బిజినెస్, చిరునామా తదితర వివరాలు అందుబాటులో ఉంటాయి. ముఖ్యంగా వినియోగదారులకందించే సేవలతోపాటు వారి అడిగే సందేహాలకు తక్షణమే స్పదించవచ్చు. వాయిస్ , వీడియో కాల్స్ చేయడానికి కూడా అవకాశం వుంది. అలాగే మీ కస్టమర్లకి గ్రీటింగ్స్ తెలిపే అవకాశం కూడా. అంతేకాదు మెసేజ్‌లను ఎంతమంది చదివారనేది కూడా గణాంకాల ద్వారా తెలుసుకోవచ్చు. వాట్సాప్ లాగానే ఈ బిజినెస్ యాప్ కూడా కాల్స్, మెసేజ్‌లను థర్డ్‌పార్టీకి చేరకుండా ఎండ్ టూ ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను ఆఫర్ చేస్తోంది. ప్రొఫైల్ ఫొటో సెక్యూరిటీతోపాటు లైవ్ లొకేషన్ షేరింగ్‌ను కూడా అనుమతిస్తుంది. కాగా ఇటీవల ఇండోనేషియా, ఇటలీ, మెక్సికో, యుకె, యుఎస్ సహా కొన్ని మార్కెట్లలో వాట్సాప్ బిజినెస్ యాప్ మొదట లాంచ్ చేసింది. అధికారిక లాంచింగ్ ముందే ఇండియా, బ్రెజిల్‌లో టెస్టింగ్ నిర్వహించింది.

లెనోవా టూ ఇన్ వన్




చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ లెనోవా... ఇప్పుడు సరికొత్త ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. 'యోగా 920' లిమిటెడ్ ఎడిషన్ వైబ్స్ కన్వర్టిబుల్ ల్యాప్‌టాప్‌ను మంగళవారం ఆవిష్కరించింది. దీని ధర రూ .1,27,150. టాబ్లెట్ మోడ్, స్టాండ్ మోడ్ , టెంట్ మోడ్ లతో 2-ఇన్ -1 గా వాడుకోవచ్చు. కన్వర్టిబుల్ పీసీ కేటగిరీలో లెనోవా యోగా బ్రాండ్ లీడర్‌గా కొనసగుతోందని లెనోవా చెబుతోంది. తమ తాజా ఆవిష్కరణ యోగా 920 అల్ట్రా ప్రీమియం మోడల్. దీని 2ఇన్ వన్ గ్లాస్ కన్వర్టిబుల్ పరికరంలో డిజిటల్ పిన్, ఫార్-ఫీల్డ్ టెక్నాలజీని జోడించారు. దీని వలన వినియోగదారులు నాలుగు మీటర్ల దూరంలో ఉన్నా, స్టాండ్ బై మోడ్‌లో ఉన్నా వాయిస్-యాక్టివేటెడ్ ఇంటిలిజెన్స్ అసిస్టెంట్ కోర్టానా ను యాక్టివేట్ చేసేకోచ్చు. కంపెనీ వినియోగదారుల పోర్ట్‌ఫోలియోలో 2ఎక్స్ థండర్ బోల్టులు కలిగిన మొదటి డివైస్ ఇది. 4కే టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, 8వ జనరేషన్ ఇంటెల్ క్వాడ్ కోర్ యు-సిరీస్ ప్రాసెసర్స్ విత్ ఇంటిగ్రేటెడ్ గ్రాఫిక్స్, ట్విన్ థండర్ బోర్డ్ యూఎస్‌బీ టైప్-సి పోర్టు, డాల్బీ అట్మోస్ టెక్నాలజీ జెబీఎల్ స్పీకర్లు, ప్రధాన ఫీచర్లు దీనిలో వున్నాయి. ప్లాటినం కలర్, మెటల్‌బాడీ డిజైన్‌తో వస్తున్న ఈ ల్యాప్‌టాప్ విండోస్ -10 ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా పనిచేస్తుంది. ఫింగర్ ప్రింట్ రీడర్ కూడా దీనిలో ఉంది.


వచ్చే ఐదేళ్లలో ప్రతి ఒక్కరికీ స్మార్ట్‌ఫోన్

నేటి ఆధునిక ప్రపంచంలో చాలా వరకు కమ్యూనికేషన్ పనులు ఇంటర్నెట్‌తో ముడిపడి వుంటున్నాయి. అదేసమయంలో స్మార్ట్‌ఫోన్‌లో ఇంటర్నెట్ వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో ప్రతి పనికీ స్మార్ట్‌ఫోన్ ముఖ్యమైన సాధనంగా మారిపోయింది. దేశంలో చాలా మంది ఇప్పటికే తమ ఫీచర్ ఫోన్‌లను స్మార్ట్‌ఫోన్‌లతో అప్‌గ్రేడ్ చేసుకుంటున్నారు. ఫీచర్ ఫోన్ నుంచి స్మార్ట్‌ఫోన్ వినియోగానికి మారుతోన్న వినియోగదార్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదేళ్లలో ప్రతి భారతీయుడి చేతిలో స్మార్ట్‌ఫోన్ వుంటుందని నితి అయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అమితాబ్ కంట్ చెబుతున్నారు. ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎమ్ఎఐ) నిర్వహించిన ఇండియా డిజిటల్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన స్మార్ట్‌ఫోన్ వినియోగానికి సంబంధించి కీలక ప్రసంగం చేసారు. ఆయన మాటల్లో చెప్పాలంటే...

ప్రస్తుతం దేశంలో దాదాపు 40 కోట్ల మంది స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఉన్నారు. వీరంతా మొబైల్ ఫోన్‌ల ద్వారానే ఇంటర్నెట్‌ను వినియోగించుకుంటున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్ ఇంకా ట్విట్టర్ యాప్‌ల వినియోగంలో నెలవారీ ఇంటర్నెట్ వినియోగదార్ల సంఖ్య భారత్‌లో మొదటి స్థానంలో ఉంది. కేవలం నాలుగు నెలల వ్యవధిలో 17 కోట్లు కొత్త కస్టమర్లు జియో నెట్‌వర్క్‌లో జాయిన్ అవటమనేది అసాధారణమైన విషయం. దేశంలో భారీ టెక్నాలజీ డిస్రప్షన్‌కు, 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' వంటి విప్లవాత్మక టెక్నాలజీలు మార్కెట్లోకి రంగ ప్రవేశం చేసేందుకు ఇది సరైన సమయం. 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' మార్కెట్ 2025 నాటికి 70 బిలియన్ డాలర్లకు విస్తరించే అవకాశముంది. ఇక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ విభాగానికి వచ్చేసరికి, భారత్‌లో ఈ సెక్టార్ 32 బిలియన్ డాలర్ల రివెన్యూను జనరేట్ చేసే అవకాశముంది. భారత్‌లో 25 శాతం ఉద్యోగాలను అడ్వాన్సుడ్ రోబోటిక్స్ హ్యాండిల్ చేస్తున్నాయి. రానున్న సంవత్సరాల్లో ఈ శాతం 45కు విస్తరించే అవకావం ఉంది. అత్యధిక మంది యక్టివ్ ఇంటర్నెట్ వినియోగదార్లను కలిగి ఉన్న దేశంగా భారత్ అభివృద్ధి చెందింది. రానున్న పదేళ్లలో ఇక్కడి డిజిటల్ లావాదేవీల సంఖ్య 100 ట్రిలియన్ డాలర్లకు రీచ్ అయ్యే అవకాశముండగా, ప్రస్తుతం 4,000గా ఉన్న యువ స్టార్టప్‌ల సంఖ్య 12000కు చేరుకునే అవకాశముంది.



పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ!
మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ...
'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం...
పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



చిన్నారి

రంగులు వేయండి



పిల్లలూ..! పక్కనున్న బొమ్మకు చుక్కలు కలిపి రంగులు వేయండి!

పొడుపు కథ

ఎరుపుకు ఆగుతుంది,
పసుపుకు పోతుంది,
కమ్మీలపై నడుస్తుంది,
స్టీవెన్‌సన్ కనుగొన్నది..?

జవాబు: [illegible]

జోక్ :

తండ్రి : ఏరా రవి! ఈరోజు ఎగ్జామ్ కదా.. పేపర్ ఎలా ఉంది?
రవి : అదేంటో నాన్న.. పేపరు చాలా తేలిగ్గా, తెల్లగా ఉంది..!

ఇసుకలేని బీచ్!



పిల్లలూ! బీచ్ అంటే మనకు గుర్తుకొచ్చేది ఇసుకే కదా? కానీ ఒక బీచ్‌లో ఇసుక అస్సలు ఉండదట! నమ్మలేక పోతున్నారా? నిజమే పిల్లలూ.. ఇసుక లేని ఎర్రటి బీచ్ చైనాలోని పాన్‌జింగ్ అనే ఊరిలో ఉంది. ఆ ఊరిని ఆనుకుని సముద్రం ఉంటుంది. దానిపేరు రెడ్ బీచ్. కొన్నిరోజులు మాత్రం ఆ సముద్రతీరం సింధూరం చల్లినట్టు ఎర్రగా ఉంటుంది. పిల్లలందరికీ ఎరుపంటే చాలా ఇష్టం కదా! ఆ సమయంలో దాని అందం చూడటానికి మన రెండు కళ్ళూ చాలవు తెలుసా?! బీచ్ మధ్య వరకూ వెళ్లేందుకు చిన్న చెక్క వంతెనలు ఉంటాయి. వాటిపై వెళ్లి ఆ బీచ్‌ని చూడొచ్చు. కంటికి కనిపించినంత దూరం ఎర్రటి మొక్కలు, పైన ఎగిరే రకరకాల పక్షులు, దూరంగా సముద్రపు అలలు ఇలా ఆ దృశ్యం చూస్తే మనల్ని మనమే మరచిపోతాం! మిగతా బీచ్‌ల్లా కాకుండా ఈ బీచ్‌లోకి వంతెనల్లాంటి వాటిపై ఎందుకు వెళ్లాలబ్బా? అనే అనుమానం వచ్చింది కదూ? ఎందుకంటే ఇక్కడ అన్ని సముద్ర తీరాల్లోలా ఇసుక ఉండదు. చిత్తడి నేల ఉంటుంది. అంటే తెలుసుగా ఎక్కువ నీటిని తనలో ఇముడ్చుకుని, ఎప్పుడూ మెత్తగా అడుసులా ఉంటుంది. పక్కనే ఉన్న సముద్రపు నీరు పాయలు పాయలుగా దీనిలోకి వస్తుండటంతో ఈ తీరమంతా ఎప్పుడూ తడిగానే ఉంటుంది. ఇక్కడ మనం ఒక్క అడుగు వేసినా బురద అంటుకుపోతుంది. అందుకే ఇలా వంతెన ఏర్పాట్లు. అక్కడ బురదనేల కాబట్టే దానిలో సీవీడ్ అనే ఓ రకం సముద్రమొక్కలు పెరుగుతుంటాయి. మార్చి, ఏప్రిల్ నెల వచ్చేసరికి తీరమంతా ఈ మొక్కలు మొలచి, బీచ్ మొత్తం పచ్చగా కనిపిస్తుంది. అవి ఎదిగి పెద్దవయ్యేసరికి ఎర్రగా మారతాయి. అలా ఆకురాలే కాలం వచ్చేసరికి బీచ్ అంతా ఎర్ర తివాచీ పరిచినట్లు మారిపోతుందన్నమాట! భలే బాగుంది కదా ఈ ఎర్ర తీరం ★





నేను గీసిన బొమ్మ





పి. చైతన్య వర్మ,
8 తరగతి,
వెంకటేశ్వర టాలెంట్ స్కూల్,
వత్సవాయి,
కృష్ణాజిల్లా

వైట్‌వాష్ తప్పేనా!


టీమిండియా కోచ్ రవిశాస్త్రి

నేడు దక్షిణాఫ్రికాతో మూడో టెస్టు
మధ్యాహ్నం 1.30 గం॥ల నుండి

జోహాన్స్‌బర్గ్: భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య బుధవారం నుండి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఇప్పటికే టెస్ట్ సిరీస్‌ను కోల్పోయి టీమిండియా కొంత నిరుత్సాహంగా ఉన్నప్పటికీ... కనీసం చివరి టెస్ట్‌లోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని కోహ్లి సేన ఆశిస్తోంది. తొలి రెండు టెస్ట్‌ల్లో బ్యాట్స్‌మెన్ వైఫల్యం కారణంగానే ఓటమిపాలయ్యామన్న విషయం తెలిసిందే. కనీసం చివరి టెస్టులోనైనా నెగ్గి సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఆధిక్యాన్ని 2-1కు తగ్గించాలని టీమిండియా పట్టుదలగా ఉంది. చివరి టెస్ట్ కోసం భారత ఆటగాళ్లు ప్రాక్టీస్ సెషన్‌లో చెమటోడ్చారు. రెండు టెస్టుల్లోనూ చోటుదక్కని రహానే.. మూడో టెస్టులో ఆడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రాక్టీస్ సెషన్లలో రహానే ఎక్కువ సమయం బ్యాటింగ్ చేయటంతో చివరి టెస్ట్‌లో చోటు దక్కడం ఖాయమనే చెప్పవచ్చు. చివరి టెస్టుకు ఓపెనర్ కేఎల్ రాహుల్ ఆడటం అనుమానంగానే ఉంది. నెట్ ప్రాక్టీస్ గాయపడ్డాడు. మూడో టెస్టుకు రాహుల్ పూర్తిగా కోలుకోకపోతే.. అతని స్థానంలో మురళీ విజయ్‌తో శిఖర్ ధావన్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశముంది. పిచ్ పచ్చికతో కళకళలాడుతున్న నేపథ్యంలో స్పిన్నర్లను ఆడించకుండా రోహిత్‌ను తుది జట్టులోకి తీసుకోవచ్చు. ఆరుగురు బ్యాట్స్ మెన్, నలుగురు పేసర్లు, ఒక ఆల్‌రౌండర్‌తో తుదిజట్టు ఉండ నుందని ప్రాథమిక సమాచారం. పిచ్‌పై తగినంత పచ్చిక ఉందని బౌన్స్, పేస్, స్వింగ్‌కు చక్కగా అనుకూలిస్తుందని స్థానిక క్యురేటర్ చెప్తున్నారు.

దక్షిణాఫ్రికా పర్యటనలో ఒక్క సిరీస్ ఓటమితో ఆటగాళ్ల ఎంపికపై విమర్శలు మొదలయ్యాయి. డిసెంబర్ చివరి వరకు జయహో.. కోహ్లీసేన! అన్నవాళ్లే పేలవమైన ఆటతో.. స్వీయ తప్పిదాలతో.. ఆటగాళ్ల ఎంపికలో గందరగోళంతో సర్వత్రా విమర్శలపాలైం ది. చివరికి సఫారీల చేతిలో 0-3తో క్లీన్‌స్వీప్ అవు తారా లేదా 0-2తో కాస్తలో కాస్తైనా పరువు నిలుపుతారా అన్న పరిస్థితి తెచ్చుకుంది.

భారతజట్టు(అంచనా) : కెఎల్ రాహుల్/విజయ్, శిఖర్ ధావన్, ఛటేశ్వర పుజరా, విరాట్ కోహ్లి(కెప్టెన్), అజింక్య రహానే, కార్తీక్, హార్దిక్ పాండ్య, భువనేశ్వం కుమార్, బుమ్రా, మహ్మద్ షమి, అశ్విన్.

దక్షిణాఫ్రికా జట్టు (అంచనా) : డుప్లెసిస్ (సారథి), డీన్ ఎల్గర్, హాషిమ్ ఆమ్లా, డివిలియర్స్, క్వింటన్ డికాక్, కేశవ్ మహరాజ్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, వెర్నాన్ ఫిలాండర్, రబాడ, లుంగి ఎంగిడి.

ఇప్పటికే 0-2తో టెస్ట్ సిరీస్‌ను కోల్పోయిన టీమిండియా చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని చూస్తోంది. దక్షిణాఫ్రికా జట్టు మాత్రం ఆఖరి టెస్ట్ సైతం గెలిచి టీమిండియాను వైట్‌వాష్ చేయాలని పట్టుదలగా ఉంది. ఊపుమీదున్న సఫారీ జట్టును టీమిండియా ఏమేరకు పోటీనివ్వగలుగుతుందో మరికొద్ది గంటల్లో తేలనుంది...



దక్షిణాఫ్రికా సారథి డుప్లెసిస్ మాత్రం ఫాస్ట్, బౌన్సీ పిచ్ భారత ఆటగాళ్ల కోసం ఎదురుచూస్తోందని సిద్ధంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశాడు. దక్షిణాఫ్రికా చీఫ్ క్యూరేటర్ సైతం డుప్లెసిస్ నిర్ణయానికి కట్టుబడి పిచ్ సిద్ధం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. చివరి టెస్ట్‌ను ఏమాత్రం తేలికగా తీసుకోకుండా టీమిండియాపై కీన్‌స్వీప్ చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తామని డుప్లెసిస్ తెలిపాడు. వారికి ఎలాంటి ఆందోళన లేదు. తిరిగి టెస్టుల్లో అగ్రస్థానానికి చేరుకునేందుకు నామమాత్రమైన చివరి టెస్టునూ అంత తేలిగ్గా తీసుకునేట్టు కనిపించడం లేదు. డుప్లెసిస్ ఇంతకుముందే ఈ సూచన చేశాడు. రెండో టెస్టులో గాయపడ్డ మార్క్రమ్ బుధవారానికి ఫిట్ అయ్యే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్ ఉన్న నేపథ్యంలో సఫారీలు తమ రిజర్వు ఆటగాళ్ల బలాన్ని పరీక్షించే అవకాశాలున్నాయి. బ్యాట్స్‌మన్ బవుమా గాయంతో మ్యాచ్‌కు దూరమయ్యాడు. క్రిస్‌మోరిస్, డీబ్రూన్‌కు జట్టులో చోటు దక్కుతుందేమో చూడాలి.


విరాట్ కోహ్లి

సెమీస్‌కు సిలిక్, ఎడ్మండ్

గాయం కారణంగా నాదల్ నిష్క్రమణ
అన్‌సీడెడ్ చేతిలో ఓడిన డిమిట్రోవ్



ఓ మెల్‌బోర్న్ : టాప్‌సీడ్, వరల్డ్ నెంబర్ వన్ ఆటగాడు రఫెల్ నాదల్(స్పెయిన్) టోర్నీ నుండి నిష్క్రమించాడు. మంగళవారం క్రొయేషియాకు చెందిన 6వ సీడ్ సిలిక్ 3-6, 6-3, (5) 6-7, 6-2, 2-0 మూడు గంటల 47 నిమిషాలపాటు జరిగిన అనంతరం నాదల్ తొడ కండరాలు పట్టేయడంతో మ్యాచ్‌ను నిష్క్రమించాడు. మరో క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌కు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారుడు ఎడ్మండ్ 6-4, 3-6, 6-3, 6-4 సెట్ల తేడాతో 3వ సీడ్ డిమిట్రోవ్‌ను ఓడించి సంచలనం సృష్టించాడు. సిలిక్‌తో ఎడ్మండ్‌లు శుక్రవారం జరిగే తొలి సెమీఫైనల్లో ముఖాముఖి తలపడనున్నారు.

మహిళల విభాగంలో అన్‌సీడెడ్ క్రీడాకారిణి బెల్జియంకు చెందిన ఎల్సీ మెర్టెన్స్ 6-4, 6-0 సెట్ల తేడాతో 4వ సీడ్ ఉక్రెయిన్‌కు చెందిన ఎలెనా స్విటోలినాపై విజయం సాధించి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మరో మ్యాచ్‌లో 2వ సీడ్ డెన్మార్క్‌కు చెందిన కరోలినా వాజ్నోంకి 6-0, 6-7(3-7), 6-2తో గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. భారత ఆశాకిరణం, మిక్సిడ్ డబుల్స్‌లో మిగిలిన ఏకైక క్రీడాకారుడు బొప్పన్న-బాబోస్(నెదర్లాండ్)ల జోడీ 6-4, 6-4తో అమెరికా-క్రొయేషియా జోడీపై విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు.


సిలిక్



ఎడ్మండ్


వాజ్నోంకి

నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లు...

మహిళలు...	పురుషులు...
హెలెప్ (1) × కరోలినా ప్లిస్కోవా (6)	రోజర్ ఫెదరర్ (2) × బెర్డిచ్ (19)
మడిసన్ కీయ్స్ (17) × కెర్బర్ (21)	టెన్నిస్ శాండ్రిన్ × చెంగ్ హుయాన్

(బ్రాకెట్లలో ఉన్నవి ర్యాంకులు)


రమణ


మత్స్య సంతోషి

జాతీయస్థాయి వెయింట్‌లిఫ్టింగ్ పోటీల్లో విజయనగరం క్రీడాకారులకు బంగారు పతకాలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ క్రీడాపోటీల్లో విజయనగరం జిల్లా కొండవెలగాడ క్రీడాకారులు సత్తా చాటారు.సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహిళా విభాగంలో రైల్వే స్పోర్ట్సు ప్రొమోటెన్ బోర్డు (ఆర్‌ఎస్‌పిబి) తరపున ప్రాతినిధ్యం వహించిన మత్స సంతోషి 53 కేజీల కేటగిరిలో స్నాచ్ 81 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 104 కేజీలు లిఫ్ట్ చేసి మూడు బంగారు పతకాలు సొంతం చేసుకుంది. పురుషుల 56 కేజీల కేటగిరిలో ఆర్‌ఎస్‌పిబి తరపున ప్రాతినిధ్యం వహించిన కోరాడ రమణ స్నాచ్ 108 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 132 కేజీలు లిఫ్ట్ చేసి రెండు బంగారు పతకాలు, ఒక సిల్వర్ పతకం సాధించాడు. పతకాలు సాధించిన క్రీడాకారులను జెడ్‌పిటిసి సభ్యులు గదల సన్యాసి నాయుడు, సర్పంచ్ గదల బంగారమ్మ, కోచ్ చల్లారాము, గ్రామస్తులు అభినందించారు.

కెజిబివి ఛాంపియన్స్ 'అనంత' విజయనగరం

- ముగిసిన రాష్ట్రస్థాయి కస్తూర్బా బాలికల క్రీడోత్సవాలు

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖపట్నం

ఆంధ్రా యూనివర్సిటీ(ఎయు) గోల్డెన్ జుబ్లీ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి కస్తూర్బా బాలికల పాఠశాలల క్రీడోత్సవాలు మంగళవారం ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో 10 గేమ్స్, 11 స్పోర్ట్స్ ఈవెంట్ల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 13 జిల్లాల కస్తూర్బా పాఠశాలల నుంచి 1,180 మంది విద్యార్థినులు, 200 మంది పిఇటిలు పాల్గొన్నారు. బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, టెన్నీకాయిట్ సింగిల్స్, షటిల్ సింగిల్స్, డబుల్స్‌లో విజయనగరం జట్లు సత్తా చాటాయి. తైక్వాండోలో ఎక్కువ విజయాలు సాధించాయి. అత్యధికంగా 26 పాయింట్లు సాధించి ఆ జిల్లా ఛాంపియన్‌గా నిలిచింది. కడప 15 పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలవగా, 14 పాయింట్లతో ప్రకాశం జిల్లా తృతీయస్థానం సంపాదించింది. స్పోర్ట్స్ విభాగంలో అనంతపురం జిల్లా అత్యధికంగా 22 పాయింట్లు సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. చిత్తూరు 20 పాయింట్లతో ద్వితీయ స్థానం, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాలు చెరి 15 పాయింట్లతో తృతీయ స్థానం దక్కించుకున్నాయి.

అండర్-19 ప్రపంచకప్

లింకోలన్ (న్యూజిలాండ్): శ్రీలంక-కెన్యాల మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్‌లలో శ్రీలంక, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు గెలుపొందాయి. శ్రీలంకజట్టు కెన్యాపై 311 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. లంక 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 419 పరుగులు భారీ చేసింది. కెన్యా 35.5 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో లంక జట్టు 311 పరుగుల తేడాతో విజయం సాధించింది. లంక జట్టులో అత్యధిక పరుగులు చేసిన హసితా బోయగుండా(191)కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.

ఆస్ట్రేలియా-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆసీస్ తొలిగా బ్యాటింగ్ చేసి 127 మాత్రమే చేస్తే... ఆ లక్ష్యాన్ని ఛేదించలేక ఇంగ్లండ్ 96 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఆసీస్ బౌలర్ లైడ్ పోప్ (31 పరుగులకు 8 వికెట్లు)కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. వెస్టిండీస్-ఐర్లాండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ 4 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై గెలిచాయి. ఐర్లాండ్-278/8, వెస్టిండీస్-281/6. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ యంగ్(55-వెస్టిండీస్)కు లభించింది.

కడప కలెక్టరేట్‌లో తండ్రీకొడుకులు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కడప

పులివెందుల తాలూకా కోమనూతల గ్రామానికి చెందిన గంగరాజు(45) అతని కుమారుడు రాజేష్(15) మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని వెంటనే రిమ్స్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. గంగరాజు అతని భార్య మధ్య మనస్పర్థాలు ఏర్పడ్డాయి. ఏడాది క్రితం గంగరాజును భార్య విడిచి తన పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావాలని పలు మార్లు భార్యను గంగరాజు కోరాడు. అయినప్పటికీ భార్య గంగరాజు మాటలు పట్టించుకోకుండా అతనిపై వేధింపులకు గురిచేస్తున్నాడని కేసులు పెట్టింది. మనస్తాపం చెందిన గంగరాజు తనకు న్యాయం చేయాలని పలుమార్లు పోలీసులను ఆశ్రయించాడు. ఫలితం లేకపోవడంతో మంగళ వారం గంగరాజు తన కుమారుడు రాజేష్‌తో కలిసి కలెక్టరేక్‌కు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పూనుకున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇ-కాఫింగ్

- లబ్ధిదారునికి 20 మేలు జాతి గేదె దూడలు
- సరికొత్త పథకానికి శ్రీకారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్సీ కార్పొరేషన్ ఇ - కాఫింగ్ పేరుతో నూతన పథకానికి శ్రీకారం చుట్టనుంది. పాడి పరిశ్రమలో సరికొత్త మార్గాన్ని అనుసరించనుంది. దేశంలోని మేలు జాతి గేదె దూడల్ని కొనుగోలు చేసి వాటిని రాష్ట్రంలోని ఎస్సీ లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.. కేవలం దూడల్ని పంపిణీ చేయడమే కాకుండా వాటిని పెంచి, పెద్ద చేసేందుకు అవసరమైన ప్రోత్సకాల్ని కూడా అందించనున్నారు. దూడలకు అవసరమైన దాణా, గడ్డిని పెంచుకునేందుకు విత్తనాలు, దూడలకు సోకే జబ్బుల్ని నివారించేందుకు కావలసిన వైద్య సదుపాయాల్ని ప్రభుత్వమే సమకూర్చనుంది. గేదెలు ఇచ్చే పాల ద్వారా లబ్ధిదారుల్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యంగా కార్పొరేషన్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకం కింద ఒక్కో లబ్ధిదారునికి 20 గేదె దూడల్ని అందించనున్నారు. దీని కోసం లక్ష నుంచి రూ 3 లక్షల వరకు రుణాలు అందించనున్నారు. మిగిలిన పథకాలు మాదిరిగానే ఈ పథకంలో కూడా రాయితీలు ఇవ్వనున్నారు. మహిళలకైతే 45 శాతం, పురుషులకైతే 35 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ప్రతి మండలంలో 25 మంది నుంచి 35 మంది లబ్ధిదారుల్ని ఎంపిక చేసి పథకాన్ని అమలు చేయనున్నారు. పశు సంవర్ధక శాఖ సహకారంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ఇరు శాఖల అధికారులు కలిసి పథకానికి సంబంధించిన విధివిధానాల్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఏయే రాష్ట్రాల నుంచి దూడల్ని కొనుగోలు చేయాలనే అంశాలపై చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. తొలుత నేరుగా గేదెలనే కొనుగోలు చేసి పంపిణీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇలా చేస్తే ఆయా రాష్ట్రాల వాతావరణానికి మన రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉన్నందున అవి తట్టుకొని నిలబడగలుగుతాయో లేదో అని ఆ ఆలోచనను విరమించుకున్నారు. దూడలైతే చిన్నప్పటినుంచే ఇక్కడ వాతావరణ పరిస్థితులకు తట్టుకొని నిలబడగలిగే సామర్థ్యం పెరుగుతుందని భావిస్తున్నారు. చివరికి దూడలనే పంపిణీ చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్టు అధికారులు పేర్కొంటున్నారు.

దక్షిణాఫ్రికా సిరీస్‌కు టీ20 మహిళా జట్టు ఇదే..

ముంబయి: దక్షిణాఫ్రికాతో ఐదు టీ20ల్లో పాల్గొనే టీమిండియా మహిళాజట్టును మంగళవారం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. ఫిబ్రవరి 13 నుంచి ప్రారంభమయ్యే సిరీస్‌లో టీమిండియా సారథిగా స్టార్ ఆల్‌రౌండర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను ఎంపిక చేశారు. స్మృతి మంధనను ఉప సారథిగా నియమించారు. మిథాలీ నాయకత్వంలో వన్డే సిరీస్ ముగిసిన తర్వాత ఈ మ్యాచ్‌లు ప్రారంభం అవుతాయి. ఫిబ్రవరి 13న పోషెస్ట్రోమ్, 16న తూర్పు లండన్, 19న జోహనెస్‌బర్గ్, 21న సెంచూరియన్, 24న కేప్‌టౌన్‌లలో ఈ టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి.

జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (సారథి), మంధాన, మిథాలీ రాజ్, వేద కృష్ణమూర్తి, జెమీమా రోడ్రిగెజ్, దీప్తి శర్మ, అనూజ పాటిల్, తానియా భాటియా, పర్వీన్, పూనమ్ యాదవ్, రాజేశ్వరీ గైక్వాడ్, జులన్ గోస్వామి, శిఖ పాండే, పూజా వస్త్రకర్, రాధా యాదవ్.

అనుమతి లేకుండానే కేంద్రం నుంచి నిధులు

- అనంతరం రాష్ట్ర వాటా నిధులకు శాఖల ప్రతిపాదన
- తీవ్రంగా పరిగణిస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ
- పద్ధతి మార్చుకోవాలంటూ శాఖలకు సర్క్యులర్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

ఒక రాష్ట్రంలో కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవాలంటే ముందుగా ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి. అయితే రాష్ట్రంలో మాత్రం ముందుగా కేంద్రంలోని శాఖల నుంచి అంగీకారాన్ని పొంది, ఆ తరువాత ఆ నిధులకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులకు ప్రతిపాదించడం కనిపిస్తోంది. ఇదే సమయంలో అధికారికంగా కేంద్రం నుంచి వచ్చిన నిధులను సమర్థవంతంగా వాడుకోని శాఖలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఇవీ రాష్ట్ర ఆర్థిక శాఖ అధ్యయనంలో వెలుగుచూస్తున్న వాస్తవాలు. ఇటువంటి విధానాలకు చెక్ పెట్టాలని ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. 2018-10 వార్షిక బడ్జెట్‌లో భాగంగా వివిధ శాఖల ఆదాయ వ్యయాలపై ఆరా తీస్తున్న ఆర్థిక శాఖకు అనేక లోటుపాట్లు కనిపించాయి. ముందుగా కేంద్రం నుంచి వచ్చే నిధుల వినియోగంపై అనేక అంశాల్ని గుర్తించింది. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకోవాలంటే నేరుగా రాష్ట్ర ఆర్థికశాఖను సంప్రదించి, ఆ తరువాత కేంద్రానికి వెళ్లాలి. కేంద్రం నుంచి వచ్చే నిధులకు రాష్ట్ర వాటా నిధుల్ని కూడా కేటాయించాల్సి ఉండడంతో ఈ విధానం తప్పకపాటించాలని మొదట్నించీ ఆర్థిక శాఖ స్పష్టం చేస్తోంది. అయితే తాజాగా కొన్ని శాఖలు నేరుగా కేంద్రాన్ని సంప్రదించి నిధులకు అంగీకారాన్ని పొందడం, ఆ తరువాత రాష్ట్ర వాటాకు ఆర్థికశాఖ వద్దకు వెళ్లడం కనిపిస్తోంది. దీంతో ఈ నిధులకు వాటా మొత్తాన్ని సమకూర్చడంలో అధికారులు అవస్థలు పడుతున్నారు. అందుకే ఇకపై కేంద్ర నిధులు కావాలనుకునే వారు ముందుగా రాష్ట్ర ఆర్థిక శాఖను సంప్రదించాల్సిందేనని స్పష్టం చేస్తూ తాజాగా అన్ని శాఖలకూ సర్క్యులర్ పంపించారు.

ఇదిలా ఉండగా, కేంద్రం నుంచి అధికారికంగా వచ్చే నిధుల్ని కూడా వినియోగించుకోవడంలో అనేక శాఖలు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని ఆర్థిక శాఖ ఆరోపిస్తోంది. ఆర్థిక సంవత్సరం ఆరంభంలో కేంద్రం ఆమోదించిన నిధుల్ని తెచ్చుకోవడంపైనా వారు శ్రద్ధ చూపించడం లేదని ఆర్థిక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై భారీగా ఒత్తిడి పెరుగుతోందని తేల్చి చెబుతున్నారు. అందుకే ఇకనైనా కేంద్ర నిధుల్ని వీలయినంత ఎక్కువగా తెచ్చుకునేందుకు స్పందించాలని పలు శాఖలకు సూచిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల నుంచి తెచ్చుకునే నిధులు కూడా పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా చూడాలని ఆర్థిక శాఖ స్పష్టం చేస్తోంది. నీటిపారుదల శాఖ తీరుపైనా ఆర్థిక శాఖ అసంతృప్తిగానే ఉంది. ఎప్పుడో పూర్తయిపోయిన నీటి ప్రాజెక్టులకూ ఇంకా బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నారని ఆరోపిస్తోంది. దీనివల్ల బడ్జెట్ కూర్పు సక్రమంగా ఉండడం లేదని అభిప్రాయపడింది. అందుకే 2018-19లో కూడా అటువంటి ప్రాజెక్టుల ప్రతిపాదనలు లేకుండా జాగ్రత్తపడాలని నిర్ణయించింది.

మార్చి 14న పూర్తిస్థాయి విధివిధానాలు

- ఆంధ్రా, తెలంగాణ వేరు కాదు
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పూర్తి స్థాయి ప్రణాళిక ఎలా ఉండబోతుందనేది మార్చి 14 పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రకటిస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. రాజకీయాల్లో కొత్త రక్తం రావాల్సిన అవసరం ఉందని, తమ పార్టీలో ప్రతిభావంతులకు స్థానం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బాధ్యతతో కూడిన రాజకీయాలు చేయడానికే రాజకీయాల్లోచ్చానన్నారు. ఆంధ్ర జన్మనిస్తే...తెలంగాణ పునర్జన్మనిచ్చిందని, ఆఖరి శ్వాశ ఉన్నంత వరకూ తెలంగాణ గడ్డకు రుణపడి ఉంటానన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని శుభం గార్డెన్స్‌లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పూర్తి స్థాయిలో రాజకీయాలకు వచ్చేందుకు తెలంగాణ వేదిక కావడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. కులాలను కలిపే ఆలోచనా విధానం, మతాల ప్రస్తావన లేని రాజకీయం, భాషల్ని గౌరవించే సాంప్రదాయం, సంస్కృతుల్ని కాపాడే సమాజం, ప్రాంతీయతను విస్మరించని జాతీయ వాదం, అవినీతి, అక్రమాలపై రాజీలేని పోరాటం, పర్యావరణ పరిరక్షణ విధానం జనసేన ముఖ్య సిద్ధాంతాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండు రాష్ట్రాల్లోనూ ప్రత్యేక పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కులాల వారీగా సీట్లు ఇవ్వడం కాదని, ఆయా సామాజిక తరగతుల అభివృద్ధి అవసరమని అన్నారు. జనసేన పార్టీపై కొందరు విమర్శలు చేస్తున్నారని, అసలు పార్టీ ఉంటుందా..? విలీనం చేస్తారంటూ ప్రచారం జరుగుతుందన్నారు. పార్టీని విలీనం చేసే ఉద్దేశమే ఉంటే ప్రజల ముందుకు ఎందుకు వస్తానని ప్రశ్నించారు.

వందేమాతరం ఎంతటి పవిత్ర పదమో, జై తెలంగాణ అంతటి పవిత్ర పదమని అన్నారు. సంస్కృతికి విలువ ఇవ్వనప్పుడు బాధ కలుగుతుందని, తెలంగాణ భాషను, యాసను గౌరవించాల్సిన అవసరముందన్నారు. ప్రాంతీయత పేరుతో జాతీయతను విస్మరించరాదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎవరితోనైనా గొడవలు పెట్టుకుంటానని, ఎంతవరకైనా పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. అభివృద్ధి, అవినీతి రహిత సమాజం, ఆశ్రిత పక్షపాతం లేని రాజకీయాలు రావాలన్నారు. 2019 ఎన్నికల కోసం కాకుండా 25 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి సిద్ధంకావాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్‌ను కలవడాన్ని కాంగ్రెస్ పార్టీ రాద్ధాంతం చేస్తోందని, దీనివల్ల కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టమేంటో అర్థంకావడం లేదన్నారు. తన సోదరుడు చిరంజీవి కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారన్నారు. తెలంగాణ సాధన, అభివృద్ధిలో కేసీఆర్ పక్కాగా పని చేస్తున్నారన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68